ప్రకటనల కోసం
సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం 29.09.2024 | సంపుటి : 11 సంచిక : 79 | పేజీలు : 12 వెల: రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370




తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

## బీజేపీ అగ్రనాయకులపై కేసులు

### ఏ1గా ఆర్థిక మంత్రి నిర్మల



**బెంగుళూరు(జనంసాక్షి):** ఎన్నికల బాండ్ల పేరిట పలువురు పారిశ్రామికవేత్తలను బెదిరించారన్న ఆరోపణల నేపథ్యంలో కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్, బీజేపీ జాతీయ నాయకులపై

మిగతా 2లో..

## పాక్.. మళ్లీ పాత పల్లవే..

### ఐక్యరాజ్య సమితిలో కాశ్మీర్ ప్రస్తావన
### 370 ఆర్టికల్‌పైనా ప్రేలాపనలు
### తిప్పికొట్టిన భారత్ ప్రతినిధి

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** భారత్ చేతిలో ఎన్నిసార్లు భంగపడినా.. దాయాది దేశం పాకిస్థాన్ మాత్రం తన వక్ర బుద్ధిని మార్చుకోవడం లేదు. ఐక్యరాజ్య సమితివేదికగా భారత్‌పై

మిగతా 2లో..





# మాతృస్వామ్య కుటుంబం

## కుటుంబ డిజిటల్ కార్డులో మహిళే యజమాని

- ఒకే కార్డులో రేషన్, ఆరోగ్య, ఇతర పథకాల వివరాలు
- ప్రస్తుత అందుబాటులోని డాటా ఆధారంగా కుటుంబాల నిర్ధారణ
- ప్రతి నియోజకవర్గం పరిధిలో రెండు ప్రాంతాలు ఎంపిక
- అక్టోబరు 3 నుంచి క్షేత్రస్థాయి పరిశీలన : సీఎం రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్(జనంసాక్షి):** కుటుంబ డిజిటల్ కార్డులో మహిళనే ఇంటి యజమానిగా గుర్తించాలని, ఇతర కుటుంబ సభ్యుల పేర్లు, వారి వివరాలు కార్డు వెనుక ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. ఫ్యామిలీ డిజిటల్ కార్డులకు (ఎఫ్‌డీసీ) సంబంధించి రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఫ్యామిలీ డిజిటల్ కార్డులపై ఈ నెల 25వ తేదీ నుంచి 27 వ తేదీ వరకు రాజస్థాన్, హర్యానా, కర్ణాటక, మహారాష్ట్రల్లో పర్యటించిన అధికారులు చేసిన అధ్యయనంపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. కార్డుల రూపకల్పలో ఆయా రాష్ట్రాలు సేకరించిన వివరాలు, కార్డులతో కలిగే ప్రయోజనాలు, లోపాలను అధికారులు వివరించారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫ్యామిలీ డిజిటల్ కార్డుల రూపకల్పనపై అధికారులకు పలు ఆదేశాలు, సూచనలు ఇచ్చారు. ప్రస్తుతం ఉన్న రేషన్, రాజీవ్ ఆరోగ్యశ్రీ, ఐటీ, వ్యవసాయ, ఇతర సంక్షేమ పథకాల్లోని డాటా ఆధారంగా కుటుంబాల నిర్ధారణ చేయాలని సూచించారు. ఇతర రాష్ట్రాల కార్డుల రూపకల్పన, జారీలో ఉన్న మెరైన అంశాలను స్వీకరించాలని, లోపాలను పరిహరించాలన్నారు. బ్యాంకు ఖాతాలు, పాన్ కార్డుల వంటి అనవసర సమాచారం సేకరించాల్సిన పని లేదన్నారు. ఫ్యామిలీ డిజిటల్ కార్డులకు సమాచార సేకరణ, వాటిల్లో ఏం ఏం పొందుపర్చాలి, అప్‌డేట్‌కు సంబంధించిన వివరాలను నివేదిక రూపంలో ఆదివారం సాయంత్రంలోగా మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దామోదర రాజనరసింహలతో కూడిన మంత్రివర్గ ఉప సంఘానికి అందజేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మంత్రివర్గ ఉప సంఘం సూచనల మేరకు అందులో జత చేయాల్సిన, తొలగించాల్సిన అంశాలను సమగ్ర జాబితా రూపొందించాలని సూచించారు. అనంతరం రాష్ట్రంలోని 119 శాసనసభ నియోజకవర్గాల్లో రెండు ప్రాంతాలు ఒక

మిగతా 2లో..

# పేదలకు న్యాయ ఫలాలు

- న్యాయవ్యవస్థలోనూ కృత్రిమ మేధ అమలు
- నల్సార్ స్నాతకోత్సవంలో రాష్ట్రపతి ముర్ము
- విద్యార్థులకు డిగ్రీలు, పతకాలు ప్రదానం

**హైదరాబాద్ (జనంసాక్షి):** ప్రపంచ వ్యాప్తంగా ప్రస్తుతం సాంకేతికంగా ఎన్నో మార్పులు వస్తున్నాయని, న్యాయ వ్యవస్థ కూడా కృత్రిమమేధను మరింత ఉపయోగించుకొని బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలని రాష్ట్రపతి ద్రౌపదిముర్ము అన్నారు. కృత్రిమ మేధ పేదలకు అందుబాటులోకి రావాలని, వారికి అండగా నిలవాలని ఆకాంక్షించారు. ధనికులతో పోలిస్తే పేదలు న్యాయం పొందలేక పోతున్నారని.. మెరుగైన సమాజం కోసం ఈ విధానంలో మార్పు రావాలని రాష్ట్రపతి అన్నారు. స్వాతంత్య్ర పోరాటంలో గాంధీజీ న్యాయబద్ధంగా సత్యాగ్రహ దీక్ష చేసి ఆదర్శంగా నిలిచారని ముర్ము అన్నారు. నిబద్ధత, పారదర్శకంగా పనిచేస్తే న్యాయవాద వృత్తిలో ఎంతో ఎత్తుకు ఎదగొచ్చని తెలిపారు. నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన 21వ స్నాతకోత్సవంలో రాష్ట్రపతి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పీహెచ్‌డీ, ఎల్‌ఎల్‌ఎంలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు రాష్ట్రపతి చేతుల మీదుగా బంగారు పతకాలు అందించారు. రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము, స్నాతకోత్సవ ప్రసంగంలో చట్టంలోని వివిధ రంగాలలో నల్సార్ కృషిని ప్రశంసించారు. ప్రధానంగా నల్సార్ జంతు సంరక్షణ చటాల గురించి చేస్తున్న కృషిని ప్రస్తావించారు. ఒరిస్సా ప్రభుత్వంలో తాము మత్స్యశాఖ, జంతు వనరుల అభివృద్ధి మంత్రిగా ఆమె గతంలో పనిచేసిన విషయాన్ని గుర్తు చేసుకుంటూ, జంతువుల రక్షణ, సంక్షేమం గురించి ప్రజలను చైతన్యం చేయడంలో ఈ జంతు సంరక్షణ చట్టాల అవగాహన అత్యవసరం అని అన్నారు . భారతదేశంలోని

మిగతా 2లో..



## మమ్మల్నే తప్పుదోవ పట్టిస్తారా..!

### కమిషన్‌కు తప్పుడు సమాచారం ఇస్తారా!
### ఈఎన్సీ వెంకటేశ్వర్లు తీరుపై జస్టిస్ పీసీ ఘోష్ ఆగ్రహం



**హైదరాబాద్(జనంసాక్షి):** మాజీ ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లుపై జస్టిస్ పీసీ ఘోష్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సీక్రెట్ ఫైల్స్‌పై వెంకటేశ్వర్లు చెప్పిన సమాధానంపై మండిపడ్డారు. తన వద్ద ప్లాన్స్, డిజైన్స్ ఉన్నాయని... కమిషన్‌కు తప్పుడు సమాచారం

మిగతా 2లో..

# పేదల తరపున పోరాడుతాం

### పేదల ఇళ్లను కూల్చి అభివృద్ధి ఎలా చేస్తారు ? : హరీశ్ రావు విమర్శలు



**హైదరాబాద్(జనంసాక్షి):** మూసీలో గోదావరి నీళ్లు పారిస్తామని చెప్పిన రేవంత్ రెడ్డి.. పేద, మధ్య తరగతి ప్రజల కన్నీళ్లు పారిస్తున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. ప్రభుత్వానికి పేదల ఆశీర్వాదాలు ఉండాలని, వారి గోసలు కాదని చెప్పారు. పేదల కన్నీళ్లపై అబివృద్ధి చేయడం ఏంటని ప్రశ్నించారు. మీ సోదరుడికి నోటీసులు ఇచ్చి, పేదల ఇంటికి బుల్డోజర్లు పంపుతారా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ లీగల్ సెల్ ప్రతినిధులు,

మిగతా 2లో..

## గనుల శాఖలో అక్రమాలపై విచారణ జరిపించండి

### కేటీఆర్ డిమాండ్



**హైదరాబాద్(జనంసాక్షి):** నకిలీపత్రాలు, రసీదులు సృష్టించి ఖనిజాభివృద్ధి సంస్థ నుంచి రూ.150 కోట్ల విలువైన ఇసుకను దోచుకున్న ఇంటిదొంగలపై దర్యాప్తు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ డిమాండ్ చేశారు.ఎక్స్ వేదికగా స్పందించిన ఆయన... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గనుల

మిగతా 2లో..

# ఇరాన్‌లో హైఅలర్ట్

## ఇజ్రాయెల్ దాడుల్లో హెజ్‌బొల్లా అధిపతి హసన్ నస్రల్లా మృతి



- తమ నాయకుడిని కోల్పోయినట్లు ధృవీకరించిన సంస్థ
- తప్పకుండా ప్రతీకారం తీర్చుకుంటామని హెచ్చరిక
- పశ్చిమాసియాలో రోజురోజుకీ పెరుగుతున్న ఉద్రిక్తత

**బీరూట్(జనంసాక్షి):** హెజ్‌బొల్లా లక్ష్యంగా ఇజ్రాయెల్ దాడులు కొనసాగిస్తోంది. ఈ క్రమంలోనే హెజ్‌బొల్లా అధిపతి హసన్ నస్రల్లా మృతి చెందినట్టు ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్ ప్రకటించిన సంగతి తెలిసిందే. దీనిపై హెజ్‌బొల్లా కూడా స్పందించింది. ఈ దాడుల్లో తమ నాయకుడు నస్రల్లా ప్రాణాలు కోల్పోయినట్లు తాజాగా వెల్లడించింది. ఇజ్రాయెల్ చర్యకు ప్రతికారం తీర్చుకుంటామని ప్రతిజ్ఞ చేసింది. ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడుల్లో మా నాయకుడు నస్రల్లా మృతి చెందారు. అయితే.. దీనికి తప్పకుండా ప్రతీకారం తీర్చుకుంటాం. పాలస్తీనాకు మద్దతుగా నిలవడంతో పాటు శత్రువుపై యుద్ధం కొనసాగిస్తాం" అని హెజ్‌బొల్లా బృందం ప్రకటించింది. కాగా.. హెజ్‌బొల్లా లక్ష్యంగా ఇజ్రాయెల్ భీకర స్థాయిలో దాడులు కొనసాగిస్తున్న సంగతి తెలిసిందే.బీరుట్‌లోని హెజ్‌బొల్లా ప్రధాన కార్యాలయంపై క్షిపణులను ప్రయోగించింది. ఈ దాడుల్లో హసన్ నస్రల్లా మరణించినట్లు ఐడీఎఫ్ 'ఎక్స్' (ట్విటర్) వేదికగా ప్రకటించింది. "నస్రల్లా ఇక ఈ ప్రపంచాన్ని ఉగ్రవాదంతో భయభ్రాంతులకు గురి చేయలేడు" అని రాసుకొచ్చింది. అతడి మృతిపై తాజాగా హెజ్‌బొల్లా స్పందించింది. దాడుల్లో తమ నాయకుడు మరణించినట్లు ధ్రువీకరించింది. నస్రల్లాతో పాటు అతడి కుమార్తె కూడా మృతి చెందినట్లు మీడియా కథనాలు పేర్కొన్నాయి. నస్రల్లా

మిగతా 2లో..

### ఆయుధాలు వీడి.. బందీలను విడిచిపెడితేనే
## యుద్ధం ఆగుతుంది

### గాజాకు స్పష్టం చేసిన ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు
### ఐరాసలో గ్రీన్- బ్లాక్ మ్యాపుల ప్రదర్శన

**న్యూయార్క్(జనంసాక్షి):** హమాస్‌తో పోరు మొదలైన తర్వాత తొలిసారి ఐరాస వేదికగా ప్రసంగించిన ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు

మిగతా 2లో..

# మూసీలో పేదలకు అన్యాయం జరగనివ్వం

## నిర్వాసితుల్ని అన్ని విధాలుగా ఆదుకుంటాం



- నదికి పూర్వ వైభవం తీసుకొస్తాం
- 55 కి.మీ పొడవైన కారిడార్లు నిర్మిస్తాం
- వర్షాకాలంలో వరదలు రాకుండా విస్తరణ
- ఇప్పటికే ప్రణాళికలు రూపొందించాం
- కార్పోరేషన్ ఎండి దానకిశోర్ వెల్లడి

**హైదరాబాద్(జనంసాక్షి):** మూసీ నిర్వాసితుల్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ దాన కిశోర్ తెలిపారు. మూసీ సుందరీకరణ అవసరమని, హైదరాబాద్ అభివృద్ధిలో అది ఓ భాగమని అన్నారు. దీనికి అందరూ సహకరించాలని అన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలు, నిర్వాసితుల తరలింపు, బాధితుల ఆందోళన తదితర అంశాలపై హైడ్రా కమిషనర్ రంగనాథ్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు.గతంలో మూసీకి వరదలు భారీగా వచ్చేవి, అప్పట్లోనూ నిర్వాసితులను తరలించారు. గతంలో మూసీ సుందరీకరణకు మోక్షగుండం విశ్వేశ్వరయ్య పలు సూచనలు చేశారు. ఇటీవల ఖైరతాబాద్‌లో 20 నిమిషాల్లో 9 సె.మీ కుపైగా వర్షపాతం నమోదైంది. చిన్న వర్షాలకే హైదరాబాద్ ముంపునకు గురవుతోంది. నగరంలో ప్రస్తుతం కోటి

మిగతా 2లో..

### విద్యాసంవత్సరం పూర్తి కాగానే ప్రైవేటు కళాశాలల
# ఆక్రమణలు తొలగిస్తాం

## హైడ్రా అంటే భద్రత..భరోసా • బూచిగా చూపడం సరికాదు



- ప్రభుత్వ స్థలాలు, చెరువులు రక్షించుకోవాల్సిందే
- హైడ్రాలాంటి వ్యవస్థ దేశంలో ఎక్కడా లేదు
- కబ్జాల వెనక ఎందరో పెద్దలు ఉన్నారు
- హైడ్రా కమిషనర్ రంగనాథ్ వివరణ

**హైదరాబాద్(జనంసాక్షి):** ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించే బాధ్యత హైడ్రాకు ఉందని హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. ప్రభుత్వ స్థలాలను కబ్జా చేసి ఇళ్లు, విల్లాలు కట్టుకునే హక్కు ఎవరికీ లేదన్నారు. పరిశుభ్రమైన వాతావరణం ఉండాలంటే చెరువులను రక్షించుకోవాల్సి ఉందన్నారు. ఎండి దానకిశోర్‌తో కలసి శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు.కొన్ని కట్టడాలు కూల్చితే హైడ్రా బాగా పనిచేస్తోందని కితాబు ఇచ్చారు. ఇప్పుడేమో సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం చేస్తున్నారు. అక్రమకట్టడాలను మాత్రమే కూల్చివేశాం. అమీన్‌పూర్‌లో ప్రభుత్వ భూములు పెద్ద ఎత్తున అన్యాక్రాంతం అయ్యాయి. అమీన్‌పూర్‌లో ఒక ఆసుపత్రిపై అధికారులు గతంలో చర్యలు తీసుకున్నా మళ్లీ నిర్మించారు. ఆ ఆసుపత్రిని కూల్చిన సమయంలో అందులో రోగులెవరూ లేరు. వీడియోకూడా రికార్డు చేశాం. ఎన్ కన్వెన్షన్‌ను కూల్చివేశాం.. దాని పక్కన ఉన్న గుడిసెలను కూల్చలేదు. ప్రజలు

మిగతా 2లో..

## డబుల్ ఇళ్లకు తరలుతున్న మూసీ పేదలు



**హైదరాబాద్(జనంసాక్షి):** మూసీ పరివాహకంలోని ఇళ్లను హైడ్రా తొలిగించే పనిలోపడింది. దీంతో అక్కడి నిర్వాసితులు డబుల్ ఇళ్లవైపు కదిలారు. మరోవైపు మూసీ నది ప్రక్షాళనలో భాగంగా నిర్వాసితులకు డబుల్ బెడ్ రూం ఇళ్ల కేటాయింపుతోనే సరిపెట్టకుండా మహిళలకు రుణాలు, చిన్నారులను హాస్టళ్లు, అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. నిర్వాసితులకు అన్నిరకాల తోడ్పాటును అందించిన తర్వాతే కూల్చివేతలను మొదలుపెట్టాలని భావిస్తోంది. ఉపాధి కల్పన, పట్టా ఉంటే చట్ట ప్రకారం రావాల్సిన

మిగతా 2లో..

## సాగు చట్టాల రద్దు పోరాట మృతులకు అమరవీరుల హోదా

### అమరుల కుటుంబాలకు రూ. 2 కోట్లు..
### హరియాణాలో కాంగ్రెస్ మేనిఫెస్టో

**చండీగఢ్(జనంసాక్షి):** హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించేందుకు కాంగ్రెస్ తీవ్రంగా యత్నిస్తోంది. ఓటర్లను ఆకట్టుకునేలా పలు హామీలతో మేనిఫెస్టోను విడుదల చేసింది. రైతుల సంక్షేమం,అమరవీరుల కుటుంబాలను

మిగతా 2లో..



# కాశ్మీర్‌లో కమలం వికసిస్తుంది



## మూడో విడత ప్రచారంలో మోడీ

**శ్రీనగర్(జనంసాక్షి):** తొలి రెండు విడతల పోలింగ్ అనంతరం జమ్మూకశ్మీర్లో తొలిసారి పూర్తి మెజారిటీతో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమైందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. బీజేపీ ప్రభుత్వాన్ని ఇక్కడి ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. అక్టోబర్ 1న తుది విడత పోలింగ్ నేపథ్యంలో శనివారంనాడిక్కడ జరిగిన ఎన్నికల ప్రచార సభలో మోదీ పాల్గొన్నారు. ఉగ్రవాదం, అవినీతి అంశాలకు సంబంధించి కాంగ్రెస్, దాని భాగస్వామ్య పార్టీ నేషనల్ కాన్ఫరెన్స్, మెహబూబా ముఫ్తీ సారథ్యంలోని పీడీపీపై విమర్శలు గుప్పించారు. మొదటి రెండు విడతల పోలింగ్ సరళితో బీజేపీ తొలిసారి జమ్మూకశ్మీర్‌లో పూర్తి మెజారిటీ సాధించడం ఖాయమైంది. బీజేపీ ప్రభుత్వాన్ని ప్రజలు కోరుకుంటున్నారు. రెండు విడతల్లో ప్రజలు భారీగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. దీంతో బీజేపీ గెలుపు తథ్యమైందని మోదీ ధీమా వ్యక్తం చేశారు. ప్రజల అభిమతంతో తొలిసారి జమ్మూకశ్మీర్‌లో ప్రభుత్వం ఏర్పడనుందని, ఇక్కడ ఎన్నో ఆలయాలు ఉన్నాయని, ఈ అవకాశాన్ని వదులుకోవద్దని, బీజేపీ ప్రభుత్వం ప్రజల సమస్యలన్నింటినీ పరిష్కరిస్తుందని భరోసా ఇచ్చారు. జమ్మూకశ్మీర్‌లోని కాంగ్రెస్, ఎన్సీ, పీడీపీల 'మూడు కుటుంబాల' పాలనతో

మిగతా 2లో..



## కాంగ్రెస్‌లో బీసీలకు పెద్దపీట

### త్వరలోనే కార్యవర్గం కూర్పుపై చర్చిస్తా
### టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్

**హైదరాబాద్ (జనంసాక్షి):** భవిష్యత్‌లో బీసీలకే ఎక్కువ సీట్లు ఇస్తామని టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. గాంధీభవన్‌లో మీడితో మహేష్ కుమార్

మిగతా 10లో..

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
29.09.2024

## బీజేపీ అగ్రనాయకులపై కేసులు

బెంగళూరులో కేసులు నమోదయ్యాయి. జనాధికార సంఘర్ష సమితి సహాధ్యాక్షుడు ఆదర్శ్ అయ్యర్ ఫిర్యాదు మేరకు కోర్టు ఆదేశాలతో పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ కేసుల వ్యవహారంపై నేతల మధ్య విమర్శలు, ఆరోపణలతో రాజకీయ వాతావరణం వేడెక్కిందిఎన్నికల బాండ్ల పేరిట పలువురు పారిశ్రామికవేత్తలను బెదిరించారనే ఆరోపణల నేపథ్యంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, బీజేపీ జాతీయనాయకులపై బెంగళూరులో కేసులు నమోదయ్యాయి. పారిశ్రామిక వేత్తలను ఎన్నికల బాండ్ల పేరిట బెదిరించి పలువురు బీజేపీ నేతలు వారి పార్టీకి 8వేల కోట్లకుపైగా నిధులు సమకూర్చుకున్నట్లు జనాధికార సంఘర్ష సమితి సహాధ్యక్షుడు ఆదర్శ్ అయ్యర్ ఆరోపించారు. ఈ అంశంపై గతంలో తిలక్ నగర ఠాణాలో ఆయన ఫిర్యాదు చేసేందుకు వెళ్లారు. అయితే పోలీసులు ఆయన ఫిర్యాదును స్వీకరించలేదు. పోలీసుల తిరస్కరణ నేపథ్యంలో ప్రజాప్రతినిధుల కేసుల కోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపిన చట్టసభ ప్రతినిధుల న్యాయస్థానం ఆదర్శ్ అయ్యర్ అభియోగం మోపిన వారిపై కేసు నమోదు చేయాలని తిలక్‌నగర్ ఠాణా పోలీసులను తాజాగా ఆదేశించింది. అధికారాన్ని దుర్వినియోగం చేసి విరాళాల పేరుతో కార్పొరేట్ సంస్థలను బెదిరించి దోచుకున్నారని ఫిర్యాదుదారు ఆదర్శ్ అయ్యర్ ఆరోపించారు. అందుకే కోర్టుకు వెళ్లి ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. తాము పార్లమెంట్‌లో లేవనెత్తిన ఎలక్టోరల్ బాండ్ వ్యవహారాన్న ఎవరో కోర్టు వరకూ తీసుకెళ్లారని, కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తెలిపారు. విచారణలో ఏం జరుగుతుందో వేచిచూద్దామన్నారు. ఈ కేసులపై కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఘాటుగా స్పందించారు. ముడా భూ కేటాయింపుల కేసులో తనను రాజీనామా చేయాల్సిందేనంటూ పట్టుబట్టిన బీజేపీ శ్రేణుల ప్రకారం, ఎఫ్ఐఆర్ నమోదైన కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ కూడా రాజీనామా చేయాలన్నారు. కర్ణాటక సీఎం వ్యాఖ్యలపై జేడీఎస్ నేత కేంద్రమంత్రి హెచ్‌డీ కుమారస్వామి మండిపడ్డారు. నిర్మలా సీతారామన్ ఎందుకు రాజీనామా చేయాలని ప్రశ్నించారు. ఆమె రాజీనామా చేయడానికి ఎలక్టోరల్ బాండ్ నిధులు ఏమైనా ఆమె వ్యక్తిగత ఖాతాలోకి వెళ్లాయా లేక కాంగ్రెస్ నేతల్లా అధికారాన్ని దుర్వినియోగ పరిచి లబ్ధి పొందారా అని ప్రశ్నించారు.

## గనుల శాఖలో జరిగిన అక్రమాలపై విచారణ జరిపించండి

శాఖలో అవినీతి ఘనులని పేర్కొన్నారు. నకిలీ పత్రాలు, రసీదులతో రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ నుంచి రూ.150 కోట్లు విలువచేసే 1.5 లక్షల టన్నుల ఇసుక దోచేశారని ఆరోపించారు. హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ అవసరాల కోసమంటూ తప్పుడు కాగితాలు సృష్టించి ఇసుకను దారి మళ్లించారన్నారు. సీఎం రేవంత్ రెడ్డి వద్ద ఉన్న శాఖలోనే జరిగిన ఈ కుంభకోణం, ప్రభుత్వ పెద్దలకు తెలియకుండా ఉండదని వ్యాఖ్యానించారు. వెంటనే ఈ ఇసుక దొంగలెవరో దర్యాప్తు చేసి, కఠిన చర్యలు తీసుకోవాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

## డబుల్ ఇళ్లకు తరలుతున్న మూసీ పేదలు

ప్రయోజనాలు, ఆయా కుటుంబాల్లోని పిల్లలకు గురుకులాల్లో ప్రవేశాలు కల్పిస్తామని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కార్పొరేషన్ల సమన్వయంతో అర్హుల కు పథకాలు అందేలా చూస్తామన్నారు. మూసీలో సుందరీకరణలో భాగంగా ఏడాది పొడవునా మంచినీటిని వదిలేందుకు వీలైన ప్రాజెక్టు నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం వచ్చే వారంలోనే టెండర్లను పిలవనుంది. మల్లనసాగర్ నుంచి 15 టీఎంసీల తాగునీటిని తీసుకువచ్చే ప్రాజెక్టును సంవత్సరంలోగా పూర్తి చేయడానికి కసరత్తు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

# మాతృస్వామ్య కుటుంబం

గ్రామీణ, ఒక పట్టణ ప్రాంతాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేయాలని సీఎం సూచించారు. (పూర్తిగా గ్రామీణ ప్రాంతాలున్న నియోజకవర్గాల్లో రెండు గ్రామాలు, పూర్తిగా పట్టణ/నగర ప్రాంతాలు ఉన్న నియోజకవర్గాల్లో రెండు వార్డులు/ డివిజన్లను ఎంపిక చేస్తారు.) కుటుంబాల నిర్ధరణ, ఫ్యామిలీ డిజిటల్ కార్డుల వివరాలకు సంబంధించి అందుబాటులో ఉన్న డాటా ఆధారంగా అక్టోబరు మూడో తేదీ నుంచి పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన ప్రాంతాల్లో క్షేత్ర స్థాయి (డోర్ టూ డోర్) పరిశీలన చేయించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. పైలెట్ ప్రాజెక్టును పకడ్బందీగా చేపట్టాలని, ఇందుకు గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి నియోజకవర్గానికి ఆర్డీవో స్థాయి అధికారిని, పట్టణ/నగర ప్రాంతాల్లో జోనల్ కమిషనర్ స్థాయి అధికారిని పర్యవేక్షణకు నియమించాలని, ప్రతి ఉమ్మడి జిల్లాకు ఇటీవల వరదల సమయంలో వేసిన సీనియర్ అధికారులను పర్యవేక్షకులుగా నియమించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. క్షేత్ర స్థాయి పరిశీలన సమగ్రంగా కచ్చితత్వంతో చేపట్టాలని, ఎటువంటి లోపాలకు తావులేకుండా చూడాలని ముఖ్యమంత్రి హెచ్చరించారు. సమీక్షలో మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దామోదర రాజనరసింహ, పొన్నం ప్రభాకర్, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ కార్యదర్శి వి.శేషాద్రి, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శులు అజిత్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, ముఖ్యమంత్రి కార్యదర్శులు సంగీత సత్యానారాయణ, మాణిక్ రాజ్, షానవాజ్ ఖాసీం, ముఖ్యమంత్రి ఓఎస్డీ వేముల శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పేదలకు న్యాయ ఫలాలు



ప్రాచీన భారత పరిపాలన, న్యాయ సంప్రదాయాలను గురించి మాట్లాడారు. కౌటిల్యుని అర్థశాస్త్రములో , ప్రాచీన భారత్ దేశంలో చట్టపరమైన పరిపాలనా వివరణ ఉన్నది అని తెలిపారు . దక్కన్ ప్రాంతంలో రచించబడిన అపస్తంభధర్మసూత్రాలను ఆమె ప్రస్తావించింది. దేశం ఉన్నత న్యాయ సంప్రదాయాన్ని పట్ట భద్రులు గుర్తుఉంచుకోవాలని ఆమె ఉద్బోధిం చారు .మహాత్మా గాంధీ ,డా. బి.ఆర్ అంబేద్కర్ లనుప్రస్తావిస్తూ,కరుణ వృత్తి పర నైపుణ్యాల సమ్మేళనం ఆ మహా మానవులు అందించిన సూత్రమని అన్నారు . సున్నితత్వం న్యాయబద్ధతఅనే రెండు గుణాల కలయికగా ఆ మహా నాయకులు ఉం డినారు అని ఆమె కొనియాడారు. విజయవంతమైన వృత్తి జీవితాన్ని పొందాలనుకునే న్యాయ నిపుణుల కోసం ఆ విలువలను పాటించాలి అని ఆమె చెప్పారు . మన రాజ్యాంగ విలువ లో కీలకమైన సామాజిక న్యాయం అనే భావనను లోతుగా అర్థం చేసుకోవాలని పట్టభద్రులకు ఆమె సూచించారు . నిజాయితీ, ధైర్యం విలువలకు కట్టుబడి సానుకూల సామాజిక మార్పు లకు సారథులు గా నూతన స్నాతకులుఉండాలని ఆమె కోరారు. బంగారు పతకాల విజేతలలో బాలిక విద్యార్థులు పతకాలు బాలురు కంటే ఎక్కువ సంఖ్య లో ఉన్నారని అధ్యక్షుడు ముర్ము తన సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ రోజుల్లో అనేక ఉన్నత విద్యాసంస్థల్లో బాలికా విద్యార్థులు మంచి ప్రతిభను చూపుతున్నారు అనిఆమె అన్నారు. అనేక పరిమితులు ఉన్నప్పటికీ కుమార్తెలు తమ ఉన్నత ప్రదర్శన తో మనల్ని గర్వపడేలా చేస్తున్నారని ఆమె అన్నారు. ఇక్కడ ప్రతిభ చూపిన అమ్మాయిలు ఇతర మహిళలు, తక్కువ ప్రాధాన్యత కలిగిన బాలికలకు సహాయం, సాధికారత కల్పించాలని ఆమె ఉద్బోధించారు. నల్సార్ విశ్వవిద్యాలయం మహిళా న్యాయవాదులు ,న్యాయ విద్యార్థులతో కూడిన దేశవ్యాప్త నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేయడానికి చొరవ తీసుకోవాలని సలహా ఇచ్చారు. ఈ నెట్‌వర్క్ మహిళలపై అఘాయిత్యాలను అరికట్టడానికి, అలాంటి అఘాయిత్యాల కేసులను ఎదుర్కోవడానికి సంఘటిత ప్రయత్నాలు చేయడానికి ఎంతో పని చేయగలదు అన్న ఆశాభావాన్ని ఆమె వ్యక్తంచేశారు. నల్సార్ గ్రాడ్యుయేట్‌లు సామాజిక న్యాయం అభివృద్ధికి సమర్థవంతమైన సాధనంగా ఉండాలని ,మన జాతీయ లక్ష్యాలను సాకారం చేసుకునేందుకు విలువైన సహకారం అందించాలని కోరుతూ ఆమె తన ప్రసంగాన్ని ముగించారు. నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లా వైస్ ఛాన్సలర్ ప్రొ.కృష్ణదేవరావు తన సంక్షిప్త స్వాగత ప్రసంగంలో వికలగుల హక్కుల చట్టాలు , బాలల హక్కులు, ఖైదీల హక్కులు సంస్కరణల రంగాలలో ప్రస్తుత విద్యా సంవత్సరంలో నల్సార్స్ సాధించిన విజయాలను గురించి పేర్కొన్నారు.నల్సార్ బోధనా అభ్యసన పరిశోధన కార్యక్రమాన్ని విస్తరించడానికి, యూనివర్సిటీ విద్య విభాగాలను వైవిధ్యపరచడానికి ఉదారంగా సహాయం అందించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా 57 బాగారు పతకాలను రాష్ట్రపతి బహూకరించారు. బీ ఏ ఎల్ ఎల్బిఈ కి చెందిన భవ్య జోహరి డి పది బంగారు పతకాలతో బంగారు పతకాల పట్టికలో అగ్రస్థానంలో ఉండగా, అదే తరగతికి చెందిన కుమారి అమిషి ఏడు పతకాలతో రెండవ స్థానంలో నిలిచారు. నల్సార్ విశ్వవిద్యాలయం ఛాన్సలర్ జస్టిస్ అలోక్ ఆరాధే, గౌరవ అతిథి, గౌరవనీయులైన జస్టిస్ పి.ఎస్. నరసింహ, భారత సుప్రీంకోర్టు న్యాయమూర్తి పట్టభద్రులైన విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో మొత్తం 582 డిగ్రీలను ప్రదానం చేశారు. వాటిలో ఎనిమిది పీహెచ్‌డీలు, లా మరియు బిజినెస్ అడ్మినిస్ట్రేషన్‌లో వరుసగా 68 మరియు 48 మాస్టర్స్ డిగ్రీలు ఉన్నాయి, 115 మరియు 28బ్యాచిలర్స్ డిగ్రీ ఇన్ లా మరియు బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ల లో , ప్రదానం చేయబడ్డాయి.ఆనంద ఉత్సాహలతో స్నాతకోత్సవం ముగిసింది.తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.ఎస్. నరసింహులు పాల్గొన్నారు. తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లా ఛాన్సలర్ అలోక్ ఆరాధే ఈ స్నాతకోత్సవానికి అధ్యక్షత వహించారు. స్నాతకోత్సవ ఊరేగింపునకు ప్రొఫెసర్.ఎన్.వాసంతి రిజిస్ట్రార్ నల్సార్ విశ్వవిద్యాలయం నేతృత్వం వహించారు.అంతకు ముందు బేగంపేట విమానాశ్రయానికి చేరుకున్న రాష్ట్రపతికి.. గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క, సీఎస్ శాంతి కుమారి, డీజీపీ జితేందర్ స్వాగతం పలికారు.

## సాగు చట్టాల రద్దు పోరాట మృతులకు అమరవీరుల హోదా

ఆకట్టుకునేలా దీన్ని రూపొందించింది. హరియాణా మాజీ ముఖ్యమంత్రి భూపిందర్ హుడా, రాజస్థాన్ మాజీ సీఎం అశోక్ గహ్లోత్ మేనిఫెస్టోను విడుదల చేశారు.ఇటీవల ఏడు గ్యారంటీలతో మేనిఫెస్టోను విడుదల చేసిన కాంగ్రెస్.. పలు హామీలతో మరో మేనిఫెస్టోను రూపొందించింది. రైతుల సంక్షేమం కోసం ఓ కమిషన్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపింది. దీంతో పాటు దేశం కోసం ప్రాణాలు అర్పించిన అమరవీరుల కుటుంబాలకు రూ. 2 కోట్లను ప్రకటించింది. మూడు సాగు చట్టాల రద్దు కోసం జరిగిన పోరాటంలో అమరులైన రైతులకు స్మారక చిహ్నం ఏర్పాటు చేయడంతో పాటు 736 మంది రైతులకు అమరవీరుల హోదా ఇస్తామని తెలిపింది. బాధిత కుటుంబాల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చింది

## మమ్మల్నే తప్పుదోవ పట్టిస్తారా..!

ఇస్తారా?అని జస్టిస్ ఘోష్ ప్రశ్నించారు. గతంలో కాళేశ్వరం ఈఎన్సీగా పని చేసిన వెంకటేశ్వర్లు శనివారం కమిషన్ ఎదుట విచారణకు హాజరయ్యారు. వివిధ అంశాలకు సంబంధించి ఆయను కమిషన్ ప్రశ్నించింది. ప్రత్యేకంగా మేడిగడ్డ ఆనకట్టకు సీకెంట్ ఫైల్స్ వినియోగించమని ఎవరు సూచించారని కమిషన్ ఛైర్మన్ ప్రశ్నించగా.. సీడీవో సీఈ సూచనల మేరకు ఇలా చేశానని సమాధానమిచ్చారు. దీనిపై కమిషన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కమిషన్‌ను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేయవద్దని జస్టిస్ ఘోష్ వ్యాఖ్యానించారు. అయితే, తన సమాధానాన్ని సరిచూసుకునే అవకాశం ఇవ్వాలని వెంకటేశ్వర్లు కోరగా.. దీనికి అంగీకరించబోనని తేల్చి చెప్పారు. తగిన దస్త్రాలు సమర్పిస్తే సవరించుకునే అవకాశం ఇస్తామని అన్నారు. తనకు ఆంగ్లంపై పూర్తిగా పట్టు లేదని వెంకటేశ్వర్లు తెలపగా.. ఆంగ్లంపై పట్టు లేకుండానే కాళేశ్వరం సీఈగా ఎలా పని చేశారని కమిషన్ అసహనం వ్యక్తం చేసింది.

## కాశ్మీర్‌లో కమలం వికసిస్తుంది

ప్రజలు విసిగిపోయారని, ప్రజలు శాంతిని కోరుకుంటున్నారని ప్రధాని అన్నారు. అవినీతి, ఉద్యోగాల్లో వివక్ష తిరిగి చోటుచేసుకోరాదని, వేర్పాటువాదం, రక్తపాతానికి ఇంకెంత మాత్రం చోటులేదని ప్రజలు భావిస్తున్నారని పేర్కొన్నారు. ఇక్కడి ప్రజలు శాంతిని కోరుకుంటున్నారు. తమ పిల్లలకు మంచి భవిష్యత్తును ఆశిస్తున్నాను. ఆ కారణంగానే జమ్మూకశ్మీర్ ప్రజలు బీజేపీ పాలన రావాలని కోరుకుంటున్నారు‘ అని మోదీ అన్నారు. 2016 సెప్టెంబర్ 18న భారత్ చేపట్టిన సర్జికల్ దాడులను ప్రధాని గుర్తుచేస్తూ, సరిహద్దు ఉగ్రవాదంపై సర్జికల్ దాడులతో ప్రపంచానికి తాము విస్పష్టమైన సందేశం ఇచ్చామని, ఇది న్యూ ఇండియా అని, ఉగ్రవాదాన్ని సహించేది లేదని చాలా స్పష్టంగా తెలియజేశామని అన్నారు. ఉగ్రవాదులు తెగబడితే వారెక్కడున్నా మోదీ వెతికి పట్టుకుంటారనే విషయం వారికి బాగా తెలుసునన్నారు. కాంగ్రెస్ పార్టీ మాత్రం సర్జికల్ దాడులకు ఆధారాలు చూపెట్టమని ఆర్మీని నిలదీస్తోందని ప్రధాని విమర్శించారు.

## పేదల తరపున పోరాడుతాం



మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డితో కలిసి హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో హైడ్రా బాధితులతో హరీశ్ రావు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పేదల ఇండ్లు కూల్చి మూసీపై పెద్ద భవనాలకు అనుమతి ఇస్తామంటున్నారని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల బృందం బాధితుల వద్దకు వస్తుందన్నారు. కేసీఆర్ పాలనలో ప్రజలను ఇబ్బంది పెట్టలేదని చెప్పారు. సీఎం రేవంత్ అనాలోచిత నిర్ణయాలతో పాలన చేస్తున్నారని విమర్శించారు. వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామన్న అంశంపై దృష్టి సారించాలని హితవు పలికారు. ప్రజలు రోగాలబారిన పడుతున్నప్పుడు వాటిపై దృష్టి పెట్టే ఆలోచన ముఖ్యమంత్రి చేయలేదని విమర్శించారు. హైదరాబాద్ ఖ్యాతిని సీఎం రేవంత్ దెబ్బ తీస్తున్నారని చెప్పారు. అఖిలపక్ష సమావేశం నిర్వహించిన తర్వాతే మూసీపై ముందుకు వెళ్లాలని డిమాండ్ చేశారు. కూకటపల్లిలో హైడ్రా బాధితురాలు బుచ్చమ్మది ఆత్మహత్య కాదని, అది రేవంత్ రెడ్డి చేసిన హత్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముగ్గురు బిడ్డలకు ఇల్లు కట్టించి పెండ్లిళ్లు చేసిందని, ఆ ఇల్లు కూలగొడితే తన బిడ్డల భవిష్యత్తు ఏం అవుతుందని బాధతో ఆత్మహత్య చేసుకుందని వాపోయారు. మొన్న కూడా ఒక ఆమె ఇల్లు కూలకొట్టే సరికి గుండె పోటుతో చనిపోయిందన్నారు. ఇవ్వన్నీ రేవంత్ రెడ్డి పిచ్చి నిర్ణయాల వల్లే జరుగుతున్నాయన్నారు. రాహుల్ గాంధీ హర్యానా ఎన్నికల ప్రచారంలో బుల్డోజర్ రాజ్ నహి చలేగా అంటూ ప్రచారం చేస్తున్నాడని, మరి తెలంగాణలో ఏం జరుగుతున్నదని ప్రశ్నించారు. నేడు తెలంగాణలో కూడా బుల్డోజర్ రాజ్యం నడుస్తుందన్నారు. ముందు తెలంగాణకు వచ్చి బుల్డోజర్లు ఆపి ఆ తరువాత బుల్డోజర్ రాజ్ నహి చలేగా అంటూ ఇక్కడ ప్రచారం చేయాలన్నారు.హైడ్రా బాధితులంతా తమ కుటుంబ సభ్యులని, మీకోసం తెలంగాణ భవన్ తలుపులు ఎప్పుడు తెరిచే వుంటాయన్నారు. ఎప్పుడైనా రావచ్చని, తాము మీ వెంటే ఉంటామని భరోసానిచ్చారు.

# మూసీలో పేదలకు అన్యాయం జరగనివ్వం

జనాభా ఉంది. మూసీ పరివాహక ప్రాంతం మురికి కూపంలా మారింది.. దాన్ని మార్చాలి. మూసీకి వరదలు వస్తే ఇబ్బందులు పడేది ప్రజలే. కుచించుకుపోయిన మూసీని విస్తరించడమే మా లక్ష్యం. మూసీ సుందరీకరణ ద్వారా ఉద్యోగ అవకాశాలు వస్తాయి. మూసీ పరిధిలోని ఎమ్మెల్యేలను తీసుకొని క్షేత్ర పర్యటనకు వెళ్తాం. 2030 కల్లా హైదరాబాద్ ఆర్థిక వ్యవస్థ 250 బిలియన్ డాలర్లకు చేరుతుంది. మూసీలోకి వచ్చే నీటిని శుద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం. 2026 జూన్ లోపు మూసీ నదిలో మంచినీరు ప్రవహించాలని సీఎం ఆదేశించారు. నదిలోకి వచ్చే నీటిని శుద్ధి చేసేందుకు రూ.3,800 కోట్లు వ్యయం చేస్తున్నాం. మూసీ రివర్‌ఫ్రంట్ పక్కనే పార్కులు, పార్కింగ్ సదుపాయాలు ఏర్పాటు చేస్తాం. 55 కి.మీ పొడవైన ఈస్ట్, వెస్ట్ కారిడార్లు నిర్మిస్తాం. దీంతో నగరంలో ట్రాఫిక్ తగ్గుతుంది. 3 నెలల క్రితం మూసీ రివర్ ఫ్రంట్ కార్పొరేషన్ అధికారులు 55 కి.మీ మేర డ్రోన్ సర్వే చేసి దాదాపు 10,600 ఇళ్లు, నిర్మాణాలు.. బఫర్ జోన్, రివర్‌బెడ్‌లో ఉన్నాయని గుర్తించారు. ఏదో ఒక రోజు వారిని ఖాళీ చేయించాల్సిందే. నిర్వాసితుల కోసం హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశాం. డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లు కేటాయిస్తాం. ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకుంటున్నాం. ఒక్కో కుటుంబానికి రూ.25లక్షల నుంచి 30లక్షల విలువ చేసే ఇళ్లు ఇస్తున్నాం. నిర్వాసితుల్ని ఎవరినీ బలవంతంగా తరలించలేదు. వారితో సామరస్యంగా మాట్లాడే డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లకు తరలిస్తున్నాం. హైడ్రా అధికారులు చట్టానికి లోబడే పనిచేస్తున్నారు. మూసీ ఆధునికీకరణకు ప్రజలందరూ సహకరించాలని దాన కిషోర్ విజ్ఞప్తి చేశారు. అప్పట్లో మూసీకి భారీ వరదలు వచ్చాయని, గతంలో వరదలతో ప్రాణ నష్టం జరిగిందని తెలిపారు. గతంలోనూ నిర్వాసితులను తరలించారని గుర్తుచేశారు. మూసీ సుందరీకరణకు మోక్షగుండం విశ్వేశ్వరయ్య సూచనలు చేశారని చెప్పారు. హైదరాబాద్ లో ప్రస్తుతం కోటి జనాభా ఉందని, హైదరాబాద్‌కు వరదల ముంపును తగ్గించేందుకే మూసీ ప్రక్షాళన చేయాలని నిర్ణయించినట్లు దానకిషోర్ స్పష్టం చేశారు. మూసీకి వరద పోటెత్తితే ఇబ్బంది పడేది స్థానికంగా ఉండే జనాలేనని చెప్పారు. ప్రముఖ కట్టడాలను పరిరక్షించేందుకు చర్యలు చేపట్టామని, నగరంలో వచ్చే మురికినంతా క్లీన్ చేసే ప్రక్రియ మొదలుపెట్టామని పేర్కొన్నారు. మూసీలో మంచినీరు ప్రవహిస్తే వ్యవసాయం మరింత పెరుగుతుందని, 2026 నాటికి మూసీలో మంచినీరు ప్రవహించేలా చేస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## పాక్.. మళ్లీ పాత పల్లవే..

పాకిస్థాన్ మరోసారి అక్కసు వెళ్లగక్కగా.. మన దౌత్యవేత్త భవిక మంగళానందన్ గట్టిగా తిప్పికొట్టారు. పాక్ ప్రధాని షెహబాజ్ కశ్మీర్ అంశాన్ని లేవనెత్తి, ఆర్టికల్ 370 రద్దుపై మాట్లాడుతూ.. ఉగ్రవాదం విషయంలో పాకిస్థాన్, ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్ గురించి మాట్లాడటమేంటో అని గట్టిగా కౌంటర్ ఇచ్చారు. ఈ ప్రపంచ వేదిక దురదృష్టవశాత్తూ అవాస్తవాలను వినాల్సి వచ్చింది. పాకిస్థాన్ ప్రధాని భారతదేశం గురించి ప్రస్తావించడంపై నేను మాట్లాడుతున్నాను. పాక్ సుదీర్ఘకాలంగా సీమాంతర ఉగ్రవాదాన్ని పొరుగు దేశాలపై ఆయుధంగా ఉపయోగిస్తోందని అందరికీ తెలుసు. అలాంటి దేశం హింస గురించి మాట్లాడటం వంచనే అవుతుంది.ఎన్నికల్లో రిగ్గింగ్ చేసే దేశం..ప్రజాస్వామ్యం గురించి మాట్లాడుతోంది. వాస్తవమేంటంటే.. ఆ దేశం మా భూభాగాన్ని కోరుకుంటోంది. జమ్మూకశ్మీర్‌లో ఎన్నికలకు అవాంతరం కలిగించేందుకు నిరంతరం ఉగ్రవాదాన్ని ఉపయోగిస్తోంది. మిలిటరీ సాయంతో నడుస్తూ, ఉగ్రవాదం విషయంలో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపుపొందిన పాక్.. అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్ గురించి మాట్లాడటమా అని భవిక తీవ్రంగా స్పందించారు. ఐరాస జనరల్ అసెంబ్లీ 79వ సెషన్‌లో సాధారణ చర్చ సందర్భంగా ఊహించినట్లుగానే ప్రధాని షహబాజ్ షరీఫ్ జమ్మూకశ్మీర్ అంశాన్ని లేవనెత్తడంతో పాటు ఆర్టికల్ 370 గురించి మాట్లాడటం గమనార్హం. దాదాపు 20 నిమిషాల పాటు చేసిన ప్రసంగంలో తమ దేశంలోని సమస్యలను వదిలేసిన షరీఫ్.. కేవలం కశ్మీర్ గురించే సుదీర్ఘంగా మాట్లాడారు. పాలస్తీనా ప్రజల మాదిరిగా నే జమ్మూకశ్మీర్ ప్రజలు కూడా స్వేచ్ఛ, నిర్ణయాధికారం కోసం పోరాడుతున్నట్లు వ్యాఖ్యానించారు. ఆర్టికల్ 370 రద్దును ప్రస్తావిస్తూ.. శాంతిస్థాపన కోసం 2019 ఆగస్టులో భారత్ ఏకపక్షంగా, చట్టవిరుద్ధంగా చేపట్టిన చర్యలను వెనక్కి తీసుకోవాలన్నారు. ఐరాస భద్రతా తీర్మానాలకు అనుగుణంగా కశ్మీర్ సమస్యపై శాంతియుత పరిష్కారం కోసం చర్చలు జరపాలన్నారు. ప్రపంచ వేదికలపై జమ్మూకశ్మీర్ అంశాన్ని ప్రస్తావించి భంగపాటుకు గురికావడం పాకిస్థాన్‌కు కొత్తేమీ కాదు. గతంలోను పలుమార్లు ఆయా ఫోరమ్‌లలో చర్చిస్తున్న అంశాలు, వాటి ప్రాముఖ్యతతో సంబంధం లేకుండా భారత్‌పై విషం చిమ్మడమే పనిగా పెట్టుకున్న సందర్భాలు అనేకం. మరోవైపు, జమ్మూకశ్మీర్, లద్దాఖ్‌లు భారత్‌లో అంతర్భాగమని, విడదీయరాని భాగమంటూ భారత్ ఎప్పటికప్పుడు స్పష్టం చేస్తూ వస్తోంది.

## ఆయుధాలు వీడి.. బందీలను విడిచిపెడితేనే యుద్ధం ఆగుతుంది

రెండు చేతుల్లో రెండు మ్యాపులను ప్రదర్శించారు. ఒకదానికి 'శాపం' మరొక దానికి 'వరం' అని పేర్లుపెట్టి.. వాటిలో పలుదేశాలను పేర్కొన్నారు. ఆసియా దేశాలకు చెందిన ఆ మ్యాపుల్లో భారత్ పేరును ప్రస్తావించారు. ఈ సందర్భంగా వెస్ట్‌బ్యాంక్, గాజా నగరాలతోపాటుగా సిరియాలోని గోలన్‌హైట్స్‌ను ఇజ్రాయెల్‌లో భాగంగా చూపించడం గమనార్హం. నెతన్యాహు కుడిచేతిలో ఉన్న 'శాపం' పేరిట నలుపు రంగులో ఉన్న మ్యాపులో ఇరాన్, ఇరాక్, సిరియా, యెమన్ వంటి దేశాలున్నాయి. ఎడమచేతిలోని మ్యాపు ఆకుపచ్చ రంగులో కనిపించింది. దానికి 'వరం' అని శీర్షిక పెట్టారు. అందులో ఈజిప్టు, సుడాన్, సౌదీ అరేబియా, ఇండియాను చూపించారు. గ్రీన్ మ్యాపులో పేర్కొన్న దేశాల్లో కొన్ని నెతన్యాహు ప్రభుత్వానికి మిత్రదేశాలు కాగా, మరికొన్ని సంబంధాలను పునరుద్ధరించుకునే ప్రయత్నంలో ఉన్నాయి. లెబనాన్, సిరియా, యెమెన్ దేశాల్లో హింసకు ఇరాన్ కారణమని ఈ సందర్భంగా తీవ్రంగా విమర్శలు చేశారు. పశ్చిమాసియాను అస్థిరపరిచేలా హమాస్, హెజ్‌బొల్లా, హూతీలకు ఆర్థికంగా, సైనికంగా ఇరాన్ సాయం చేస్తోందని నిందించారు. ఈ గ్రూపుల నుంచి ఇజ్రాయెల్ తనను తాను రక్షించుకుంటోందన్న నెతన్యాహు తన చర్యలను సమర్థించుకున్నారు. హెజ్‌బొల్లా గ్రూప్‌ను చావుదెబ్బ తీస్తామని ఆయన ఈ సందర్భంగా హెచ్చరించారు. లెబనాన్ నుంచి రోజువారీ రాకెట్ల దాడులను సహించేది లేదని అన్నారు. హమాస్ లొంగిపోయి.. ఆయుధాలు వీడి.. బందీలను విడిచిపెడితేనే గాజా యుద్ధం ఆగుతుందని స్పష్టం చేశారు. అప్పటివరకు దాడులు ఆపే ప్రసక్తే లేదని అన్నారు. వాస్తవంగా తాను ఈ సదస్సుకు రాకూడదని నిర్ణయించుకున్నానని.. కానీ ఈ వేదికపై నిలబడి చాలామంది నాయకులు అబద్ధాలు చెబుతున్నారని.. వాటిని తిప్పికొట్టడానికే వచ్చానని చెప్పారు. న్యూయార్క్‌లోని తన హోటల్ గది నుంచే హెజ్‌బొల్లా చీఫ్ హసన్ నస్రల్లా లక్ష్యంగా వైమానిక దాడులకు నెతన్యాహు ఆదేశాలు ఇచ్చారని తెలుస్తోంది. బాంబుల వర్షంలో నస్రల్లా హతమయ్యాడని ఇజ్రాయెల్ సైన్యం (ఐడీఎఫ్) తాజాగా వెల్లడించింది.

## విద్యా సంవత్సరం పూర్తి కాగానే ప్రైవేటు కళాశాలల ఆక్రమణలు తొలగిస్తాం

నివసిస్తున్న భవనాలను ఎక్కడా కూల్చలేదని వివరించారు. ముందస్తు సమాచారం ఇచ్చినా కొందరు ఖాళీ చేయడంలేదు. సరైన సమయం ఇచ్చిన తర్వాతే ఆక్రమణలు కూల్చివేస్తున్నాం. ఇటీవల కూకట్‌పల్లి నల్ల చెరువులో ఆక్రమణలు కూల్చివేశాం. పేదలు, మధ్య తరగతి ప్రజలు చెరువులు ఆక్రమించరు. అక్రమ కట్టడాల వెనుక పెద్దవాళ్లు ఉన్నారు. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణకే ముఖ్యమంత్రి హైడ్రాను తీసుకొచ్చారు. చెరువులు, నాలాలు కబ్జా చేస్తుంటే చూస్తూ ఊరుకోం. ఇప్పుడు కాకపోతే.. ఇంకెప్పుడు చెరువులు నాలాలను కాపాడుకోలేం. పేదలకు ఇబ్బంది చేయాలనేది హైడ్రా అభిమతం కాదు. ఒవైసీ, మల్లారెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డికి చెందిన కాలేజీలపై ఫిర్యాదులు వచ్చాయి. విద్యా సంవత్సరం నష్టపోతారనే వాటిపై చర్యలుతీసుకోలేదు. విపత్తు నిర్వహణ, ఆస్తుల పరిరక్షణ హైడ్రా బాధ్యత. హైడ్రాను బూచిగా చూపించి ప్రజలను భయపెడితే భవిష్యత్ తరాలకు నష్టం జరుగుతుంది. చెరువులు, ప్రభుత్వ భూములను ఎవరూ కాపాడలేరు. జన్వాడ ఫామ్ హౌస్ 111 జీవో పరిధిలో ఉంది. 111 జీవో హైడ్రా పరిధిలోకి రాదని రంగనాథ్ వివరించారు. చెరువులు, నాలాలు కాపాడడమే హైడ్రా లక్ష్యమని వెల్లడించారు. ఆర్టికల్ 21 ప్రకారం.. పరిశుభ్రమైన వాతావరణం రైట్ టూ లైఫ్ ఉద్దేశమన్నారు. హైడ్రా డిజాస్టర్ మేనేజ్మెంట్, ఎసెట్ ప్రొటెక్ట్ ఉద్దేశ్యం.. వాటి పరిరక్షణ మా బాధ్యత అని పేర్కొన్నారు. నదులు, చెరువులు, నాలాలు ప్రజల ఆస్తులేనన్నారు. సోషల్ మీడియాలో హైడ్రాపై తప్పుడు ప్రచారం జరుగుతోందని ఆయన తెలిపారు. కొందరు బలవంతులు అక్రమ కట్టడాల వెనుక ఉన్నారన్నారు. అనధికార ఆస్తులను కూల్చివేశామన్న ఆయన.. ఇప్పటి వరకు 21, 22 ప్రాంతాల్లో కూల్చివేతలు చేశామన్నారు. కొంతమంది దుండిగల్, అమీన్‌పూర్ ప్రాంతంలో నకిలీ పర్మిషన్లు ఇచ్చారు. అలా పర్మిషన్లు ఇచ్చిన వారిపై కేసులు నమోదు చేశామని.. పంచాయతీ సెక్రటరీని సస్పెండ్ చేశామన్నారు. కొంతమంది ఆస్తులు కొనుగోలు చేసే ముందు సరైన విచారణ చేయకుండా కొనుగోలు చేస్తున్నారని.. పంచాయతీ పర్మిషన్లు క్యాన్సిల్ చేసిన తర్వాత కూడా కొందరు నిర్మాణాలు చేపట్టారన్నారు. తప్పులు చేసిన బిల్డర్లపై క్రిమినల్ కేసులు పెడుతున్నామన్నారు.సున్నం చెరువులో వెంకటేష్ అనే వ్యక్తి ఒంటిపై కిరోసిన్ పోసుకున్న వ్యక్తి ట్యాంకర్ల బిజినెస్ చేస్తాడని.. ఒకరోజు ఆదాయం లక్షకు పైనే ఉంటుందన్నారు. ఎఫ్టీఎల్‌లో ప్రజలు నివాసం ఉండే సముదాయాల జోలికి వెళ్లడం లేదన్నారు. కూల్చివేతలకు సంబంధించి సంబంధిత ఇంటి యజమానులకు సమాచారం ఇస్తున్నామన్నారు. బుచ్చమ్మ ఆత్మహత్య చేసుకోవడం వెనుక వేరే కారణం ఉందన్నారు. హైడ్రా అంటే ఒక భరోసా? హైడ్రాను భూచి, రాక్షసిగా చూపించొద్దని రంగనాథ్ సూచించారు. దేశంలో ఎక్కడా హైడ్రా లాంటి వ్యవస్థ లేదన్నారు. హైడ్రా అంటే బాధ్యత, భరోసా అని..భయంగా చూపొద్దని పేర్కొన్నారు. పర్మిషన్ ఉందని చెబుతోంది తప్పు.. ఒకవేళ పర్మిషన్ చూపినా అవన్నీ తప్పు.. వాటి సమయం ముగిసి ఎంతో కాలం అవుతుందన్నారు.

## ఇరాన్‌లో హైఅలర్ట్



మృతితో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరోసారి భగ్గుమన్నాయి. ఇజ్రాయెల్ భీకర దాడులతో హెజ్‌బొల్లాకు భారీ నష్టం సంభవిస్తోంది. ఈ క్రమంలోనే ఇరాన్ అప్రమత్తంగా వ్యవహరిస్తోంది .లెబనాన్‌లోకి తన బలగాలను పంపేందుకు ఇరాన్ సిద్ధంగా ఉందని ఆ దేశ ఉన్నతస్థాయి అధికారిని ఉటంకిస్తూ అంతర్జాతీయ మీడియా వెల్లడించింది. దానికి సంబంధించి అనుమతులు జారీ చేయనున్నట్లు పేర్కొంద్ని. ఇజ్రాయెల్‌- హెజ్‌బొల్లాల మధ్య జరుగుతోన్న పోరుతో పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.ఇజ్రాయెల్ దళాలు చేస్తోన్న భీకరదాడులతో హెజ్‌బొల్లాకు భారీ నష్టం సంభవిస్తోంది. తాజాగా ఆ గ్రూప్ చీఫ్ హసన్ నస్రల్లా ను మట్టుపెట్టినట్టు సమాచారం. ఇజ్రాయెల్ సైన్యం దూకుడు వేళ.. ఇరాన్ అప్రమత్తమవుతోంది. తమ సుప్రీంలీడర్ అయతుల్లా అలీ ఖమేనీని సురక్షిత ప్రాంతానికి తరలించినట్లు తెలుస్తోంది. ఈ మేరకు అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. లెబనాన్ రాజధాని బీరుట్‌లోని హెజ్‌బొల్లా ప్రధాన కార్యాలయంపై ఇజ్రాయెల్ బాంబులను ప్రయోగించింది. ఈ దాడుల్లో హెజ్‌బొల్లా అధిపతి హసన్ నస్రల్లా మరణించినట్లు తాజాగా ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్ ధ్రువీకరించింది. ఆ సమయంలో నస్రల్లా ఇదే కార్యాలయంలో సమావేశం నిర్వహిస్తున్నట్లు తమకు పక్కా సమాచారం వచ్చిందని ఇజ్రాయెల్ మిలిటరీ వెల్లడించింది. ఈ దాడుల్లో భవనం పూర్తిగా ధ్వంసమైందని తెలిపింది. "నస్రల్లా ఇక ఈ ప్రపంచాన్ని ఉగ్రవాదంతో భయభ్రాంతులకు గురిచేయలేడు" అని రాసుకొచ్చింది. ఈ పరిణామాల వేళ.. భవిష్యత్తు కార్యాచరణపై లెబనాన్‌లోని హెజ్‌బొల్లా, పశ్చిమాసియాలో ఇతర మిత్రపక్షాలతో ఇరాన్ సంప్రదింపులు జరుపుతోందని ఆ కథనాలు పేర్కొన్నాయి. ఇదిలా ఉంటే.. ఇజ్రాయెల్ వరుస దాడుల నేపథ్యంలో ఖమేనీ అత్యవసర సమావేశం నిర్వహించారు. తన నివాసంలో సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్‌తో భేటీ అయ్యారు. నస్రల్లా మరణించినట్లు ఇజ్రాయెల్ ప్రకటించిన నేపథ్యంలో ఖమేనీ ఒక ప్రకటన విడుదల చేశారు. లెబనాన్ ప్రజలకు, హెజ్‌బొల్లాకు అండగా ఉండాలని, దాడులను ఎదుర్కోవడంలో వారికి సహాయం చేయాలని అంతర్జాతీయ సమాజానికి ఖమేనీ పిలుపునిచ్చారు. ఈ ప్రాంతం భవిష్యత్తును ప్రతిఘటించే శక్తులే నిర్ణయిస్తాయని, ఆ విషయంలో హెజ్‌బొల్లా ముందువరుసలో ఉంటుందని చెప్పారు. గాజాలో ఏడాదికాలంగా జరుగుతోన్న యుద్ధం నుంచి వారు ఏమీ నేర్చుకోలేదన్నారు. మహిళలు, పిల్లలు, పౌరుల సామూహిక హత్యలు ఆ ప్రతిఘటన శక్తుల్ని విచ్ఛిన్నం చేయలేవని వారికి ఇంకా అర్థంకాలేదని వ్యాఖ్యానించారు.

ఆదివారం
29 సెప్టెంబర్ 2024
జనంసాక్షి
www.janamsakshi.org
JANAMSAKSHI DAILY


# ప్రయివేట్ హాస్పిటల్‌లోని అర్హత లేని వైద్యులు

- రోగుల ప్రాణాలతో చెలగాటం
- ఇష్టారాజ్యంగా డబ్బులు వసూలు చేస్తున్నారని రోగి బంధువుల ఆందోళన



ఖానాపూర్ రూరల్ 27 సెప్టెంబర్ (జనం సాక్షి): అర్హత లేకున్నా వైద్యం చేస్తూ రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ఒక ప్రైవేటు ఆసుపత్రిని ఏర్పాటు చేయాలంటే ఉన్నతాధికారుల అనుమతులు అర్హత ఉన్న వైద్యులను నియమించుకోవాలి. దానికి సంబంధించి రిజిస్ట్రేషన్ నంబర్ తో సహా అన్ని అనుమతులు ఉండాలి. కానీ ఖానాపూర్ పట్టణంలోని లారీ అడ్డ సమీపంలో గల తిరుమల పిల్లల మరియు జనరల్ హాస్పిటల్ ను ఏ లాంటి అనుమతులు లేకుండా ఏర్పాటు చేశారు. రోగులను వైద్య పరీక్షలు చేసేందుకు అర్హత గల వైద్యులను ఏర్పాటు చేయాలి. కానీ యాజమాన్యం ఎంబిబిఎస్ చదువు ఇంకా పూర్తిగా కాకుండానే ఓ వైద్యురాలిని నియమించి రోగులకు వైద్యం అందిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు ఇదిలా ఉండగా శుక్రవారం ఖానాపూర్ పట్టణానికి చెందిన మల్లవ్వ ఆస్పత్రిలో వైద్యం కోసం వెళ్ళింది మందుల చీటీపై మందులు రాసి ఆసుపత్రిలో చేరింది. తూతూ మంత్రంగా వైద్య నిర్వహించి ఎక్కువ డబ్బులు అడిగారని సరైన వైద్యం కూడా చేయలేరని బాధితురాలు ఆరోపించింది. ఈ విషయమై సరైన వైద్యం చేయకుండా అధిక బిల్లు వేశారని రోగి బంధువులు ఆందోళన చేపట్టారు. అనంతరం యాజమాన్యాన్ని వెళ్లి నిలదీయగా తెల్ల కాగితంపై బిల్లు వేసి ఇచ్చారని బాధితురాలు తెలిపారు ఎక్కువ బిల్లు ఎందుకు తీసుకుంటున్నారని రోగి బంధువులు యాజమాన్యాన్ని నిలదీసి ఆసుపత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. అంతేకాకుండ వైద్యం చేసే మహిళా వైద్యురాలికి ఎంబిబిఎస్ కూడా పూర్తి కాలేదని ఎలాంటి అర్హత లేని వైద్యురాలితో చికిత్సలు చేయిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని రోగి బంధువులు యాజమాన్యంతో ఆందోళనకు దిగారు. ఆస్పత్రి ఎదుట ఏర్పాటుచేసిన బోర్డుపై ఎలాంటి రిజిస్ట్రేషన్ కూడా లేదని రోగి బంధువులు ఆరోపించారు. ఎంబిబిఎస్ పూర్తి కాకుండా స్త్రీ వైద్య నిపుణురాలు బోర్డులపై ఎలా రాసుకుంటారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్హత లేకున్నా అర్హతలు ఉన్నాయంటూ ప్రజలను మభ్యపెడుతూ స్త్రీ వైద్య నిపుణులు అని ఫ్లెక్స్ లపై రాయించుకొని ప్రజలను పక్కదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. అర్హత లేకుండా గర్భిణులకు మహిళలకు ఇన్ని రోజులు ఎలా చికిత్సలు అందించారని పలువురు ఆరోపించారు. అన్నారు. ఇలాంటి ఘటనలు జరుగుతున్న సంబంధిత జిల్లా ఉన్నతాధికారులు మామూలుగా వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపించారు. విషయం తెలుసుకున్న నిర్మల్ బి ఎం అండ్ హెచ్ ఓ సంఘటన స్థలానికి వచ్చి విచారణ చేసి మహిళ వైద్యురాలికి అర్హత లేదని ఆమె వైద్యం చేయరాదని అన్నారు. ఈ ఘటనపై తిరుమల ప్రైవేట్ ఆసుపత్రికి జరిమానా విధిస్తామని అన్నారు.

# జెడ్పీలో కారుణ్య నియామకాలు భర్తీ చేయండి

- రాష్ట్రంలోని 743 కారుణ్య ఖాళీలు ముఖ్యమంత్రికి కనపడకపోవడం బాధాకరం
- బాధితులు 2014 నుండి వేచి చూస్తున్న ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం సిగ్గుచేటు
- కారుణ్య ఖాళీలను భర్తీకి ప్రభుత్వం పై ఒత్తిడి తేవాలని ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణ రెడ్డికు బాధితుల వినతి
- బీజేపీ రాష్ట్ర నాయకులు బేతి మహేందర్ రెడ్డి వెల్లడి



కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 28 (జనంసాక్షి) : తెలంగాణ రాష్ట్రం వస్తే కొత్తగా నియామకాలు చేపట్టి నిరుద్యోగ సమస్యకు పరిష్కారం దొరుకుతుందని ఎన్నో ఆశలతో ప్రత్యేక రాష్ట్రం కోసం కొట్లాడి తెచ్చుకుంటే తెలంగాణలో కొత్త నియామకాలు చేపట్టకపోగా న్యాయ బద్దంగా రావాల్సిన కారుణ్య నియామకాలను కూడా గత టి.ఆర్.ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం భర్తీ చేయకపోవడం బాధాకరమని బీజేపీ రాష్ట్ర నాయకులు బేతి మహేందర్ రెడ్డి అన్నారు. వివిధ కారణాలతో మృతి చెందిన జిల్లా పరిషత్ లోని ఉద్యోగుల కుటుంబాలలో ఒకరికి రావాల్సిన ఉద్యోగాలు 2014 సంవత్సరం నుండి 743 మంది కారుణ్య నియామకాలను భర్తీ చేయకుండా గత టి.ఆర్.ఎస్ ప్రభుత్వం, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేసారని ఈ ప్రధాన సమస్యను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి కారుణ్య నియామకాలను వెంటనే భర్తీ చేసేలా ప్రభుత్వం పై ఒత్తిడి తేవాలని కారుణ్య నియామకాల కోసం ఎదురు చూస్తున్న బాధితుల పక్షాన బీజేపీ రాష్ట్ర నాయకులు బేతి మహేందర్ రెడ్డి కామారెడ్డి కి వెళ్లి బీజేపీ ఎమ్మెల్యే కాటిపెల్లి వెంకటరమణ రెడ్డిని కామారెడ్డి లోని ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్ లో కలిసి వినతి పత్రం ఇచ్చి తమ గోడును వెలిబుచ్చారు. బాధితుల ముందే ఎమ్మెల్యే కాటిపెల్లి వెంకటరమణ రెడ్డి వెంటనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఫోన్ చేసి సమస్యను వివరించడంతో ముఖ్యమంత్రి వారం రోజుల్లోపు జిల్లా పరిషత్ లోని కారుణ్య నియామకాలను భర్తీ చేస్తానని ఎమ్మెల్యే వెంకటరమణ రెడ్డికి హామీ ఇవ్వడంతో సమస్య పరిష్కారం అవుతుందనే ఆశతో బాధితులు ఎదురుచూస్తున్నారని బేతి మహేందర్ రెడ్డి తెలిపారు. ఒకవేళ కాంగ్రెస్ ప్రభుత్వం ఈ కారుణ్య నియామకాలను భర్తీ చేయకపోతే ప్రభుత్వం పై నియామకాలు చేపట్టేదాకా తనే పోరాడుతానని బాధితులకు ఎమ్మెల్యే వెంకటరమణ రెడ్డి భరోసా ఇచ్చారని బేతి మహేందర్ రెడ్డి తెలిపారు.

# వస్త్ర పరిశ్రమ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- సిరిసిల్ల పాలిస్టర్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ ప్రమాణ స్వీకారం



రాజన్నసిరిసిల్లబ్యూరో, సెప్టెంబర్ 28 (జనంసాక్షి) : సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. శనివారం నిర్వహించిన పాలిస్టర్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ ప్రమాణ స్వీకారానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నూతన పాలకవర్గానికి అభినందనలు తెలిపారు అనంతరం ఆయన మాట్లాడుతూ బతుకమ్మ చీరల పాత బకాయిలు 197 కోట్లు విడుదల చేశామని మరో నాలుగు కోట్లు త్వరలో విడుదల చేస్తామని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో తయారుచేసిన 7 లక్షల చీరలను ప్రభుత్వం వినియోగించుకుని డబ్బులు చెల్లిస్తున్నాడు తెలిపారు. ఇప్పుడు 10 హెచ్పీలు కాకుండా 20 హెచ్పి లో కరెంటు, యారన్ డిపో త్వరలో ఏర్పాటు చేస్తామని అన్నారు. నాలుగైదు రోజుల్లో ప్రభుత్వ ప్రిన్సిపాల్ సెక్రెటరీ శైలజ రామయ్యర్ సిరిసిల్లకు రాబోతున్నట్లు తెలిపారు. తమిళనాడులో ఉన్న వస్త్రపరిశ్రమ తరహాలో సిరిసిల్లకు అవకాశం కల్పించి ఆలోచన ప్రభుత్వం చేస్తున్నట్లు తెలిపారు. 8 కోట్ల మీటర్ల బట్టకు త్వరలో ఆర్డర్ ఇస్తామని అన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ నూతన పరవశం ఫోన్ లో అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇంచార్జ్ కేకే మహేందర్ రెడ్డి, వెలుగుల స్వరూప, సంగీతం శ్రీనివాస్, మున్సిపల్ చైర్పర్సన్ జిందంకళ, వైస్ చైర్మన్ మంచి శ్రీనివాస్, పాలిస్టర్ అసోసియేషన్ అధ్యక్షులు ఆడెపు భాస్కర్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# విద్యా వ్యవస్థ బలోపేతమే లక్ష్యం : ఎమ్మెల్యే



పిట్లం, సెప్టెంబర్ 28 (జనంసాక్షి) : విద్యావ్యవస్థను బలోపేతం చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం అని జుక్కల్ నియోజకవర్గ ఎమ్మెల్యే తోట లక్ష్మి కాంతరావ్ అన్నారు.శనివారం మండల కేంద్రంలో గల కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల పాఠశాలలో అదనపు మౌళిక వసతుల కల్పన నిర్మాణం కోసం ఎమ్మెల్యే తోట లక్ష్మికాంతరావ్,జహీరాబాద్ పార్లమెంట్ సభ్యుడు ఎంపి సురేష్ షేట్కార్ శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భావితరాలకు మెరుగైన విద్యను అందించాలనే ముఖ్య ఉద్దేశ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్ష అని అన్నారు.2.30కోట్ల సమగ్ర శిక్ష నిధులతో మౌళిక వసతుల,అదనపు తరగతుల కల్పనకు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జంబిగే హన్మండ్లు,సీనియర్ నాయకులు అడ్వకేట్ రాంరెడ్డి,మోహన్ రెడ్డి,మురళీ, బొడ్ల రాజు,శివ కుమార్,వెంకన్న, క్రిష్ణా రెడ్డి,శ్రీనివాస్ రెడ్డి,నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కుల అణచివేత, వివక్షకు వ్యతిరేకంగా పోరాడుదాం!

(ప్రత్యేక ప్రతినిధి / జనంసాక్షి)



కుల అణచివేత, వివక్షకు వ్యతిరేకంగా పోరాడుదామని వక్తలు పిలుపునిచ్చారు. సత్యశోధకు సమాజ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సిపిఐ (ఎంఎల్ ) న్యూడెమోక్రసీ పార్టీ ఆధ్వర్యంలో ఎఫ్సిఐ గోడన్ కాలనీలో సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు పిఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి అరుణ అధ్యక్షత వహించగా.. వక్తులుగా సిపిఐ (ఎంఎల్ ) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఎ.లాల్ కుమార్ మాట్లాడుతూ కులం పోవాలి అందరికి విద్యా అందుబాటులో ఉండాలి అనే లక్ష్యంతో జ్యోతిరావుపులే 152 సంవత్సరాల క్రితం సత్యశోధక్ సమాజ్ ను స్థాపించాడు.కానీ కులం ఒక వ్యక్తి ఇస్ట ఇష్టాలతోనూ అతని ప్రతిభతో సంబంధం లేకుండా అతని తల్లిదండ్రుల నుండి పూర్వికులు నుండి వంశపార్య పరంగా వచ్చే అసమానతతో కూడిన అత్యంత దుర్మార్గమైన వ్యవస్థ కులం, మనిషి పుట్టుకతోనే జనన ధ్రువీకరణ పత్రం, చనిపోయిన తర్వాత మరణ ధ్రువీకరణ పత్రం చివరికి స్మశాన వాటికలో వెంటాడుతూనే ఉంటుందని, సమాజంలో అట్టడుగున ఉన్న దళితులు ఆదివాసుల్లోనూ కొన్ని తెగలు కులవ్యక్షత నే కాదు అంటరానితనం అనే దురాచరాన్ని అదనంగా ఎదుర్కొంటుందని, పైనుండి కింది వరకు అన్ని కులాలకు కుల వ్యవస్థ పిశాచిలీ పట్టి పీడిస్తోందని, కులాల్లోని ప్రజలంతా చైతన్య వంతులై వ్యతిరేకించినప్పుడు కుల నిర్మూలన సాధ్యమవుతుంది. అందుకు కుల వ్యవస్థను పునాదిగా ఉన్న దోపిడి వ్యవస్థ రద్దు కావాలని, అందుకు ప్రజా ఉద్యమాలు, వర్గ పోరాటాలు మినహా మార్గం లేదు కనుక కులం సమస్యను ప్రజా ఉద్యమ పోరాటాలతో జోడించుకుని చైతన్యవంతంగా కృషి చేయాలని, అన్ని కులాలను పీడిత ప్రజలందరిని ఐక్యంగా ముందుండే విధంగా పోరాటాలకు సంసిద్ధం చేయాలి దోపిడీ వ్యవస్థ మారి ప్రజలు ప్రజలలో నిజమైన ప్రజాస్వామ్య చైతన్యం అభివృద్ధి చెందినప్పుడే కుల వ్యవస్థ రద్దు అవుతుంది. అప్పుడు జ్యోతి రావులే ఆశయాలు నెరవేర్చిన వాళ్లమవుతామని తెలిపారు. కార్యక్రమంలో పిఓడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంగ ,అరుణోదయ రాష్ట్ర కోశాధికారి మల్లన్న ,పీడీఎస్యు రాష్ట సహాయ కార్యదర్శి శ్రీకాంత్, పిఓడబ్ల్యూ డివిజన్ అధ్యక్షురాలు మంగ ,మహేశ్వరి, నర్సక్క, విజయ తదితరులు పాల్గొన్నారు.

# యాదాద్రి విమానగోపురానికి బంగారు తాపడం

- కమిటీని వేసి అనుమతులు ఇచ్చిన ప్రభుత్వం
- భద్రాచలం ఆయన విస్తరణకు భూసేకరణకు నిర్ణయం

యాదాద్రి, సెప్టెంబర్ 28 (జనంసాక్షి) : యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానాన్ని దేదీప్యమానంగా తీర్చిదిద్దేందుకు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ సారథ్యంలో జరిగిన సమావేశాల్లో పలు నిర్ణయాలు తీసుకున్నారు. మంత్రి చొరవతో దేవాలయ విమాన గోపురానికి బంగారు తాపడం పనులు ప్రారంభించేం దుకు సీఎం రేవంత్‌రెడ్డి అనుమతి ఇచ్చారు. వెంటనే ఆ పనులను ప్రారంభించాలని మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు బంగారు తాపడం పనుల బాధ్యతలను స్మార్ట్ క్రియేషన్స్ కంపెనీకి రాష్ట్ర ప్రభుత్వం అప్పగించింది. ఈ పనులు స్వామి బ్రహ్మోత్సవాల నాటికి ముందే 2025 మార్చిలోగా పూర్తి చేయాలని సూచించారు. ఈ పనులను నిరంతరం పర్యవేక్షించేందుకు దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్ ఛైర్‌పర్సన్‌గా, దేవాదాయ శాఖ డైరెక్టర్ కన్వీనర్‌గా ప్రభుత్వ ఇన్ఫ్రాస్ట్రక్చర్ అండ్ ప్రాజెక్ట్స్ సలహాదారు, వైటీడీఏ ఉపాధ్యక్షుడు జి.కిషన్‌రావు,యాదగిరిగుట్ట దేవస్థాన కార్యనిర్వహణాధి కారి, విద్యుత్ శాఖ చీఫ్ ఇంజనీర్ సభ్యులుగా ప్రభుత్వం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది.

# ఏఈవోలు అధైర్య పడొద్దు.. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం

- తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్, తెలంగాణ ఎన్జీవోల కేంద్ర సంఘం అధ్యక్షులు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ముజీబ్ హుస్సేన్



హైదరాబాద్, సెప్టెంబర్ 28 (జనంసాక్షి) : తెలంగాణ నాన్ గెజిటెడ్ కేంద్ర సంఘం హైదరాబాదు కార్యాలయంలో తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్, తెలంగాణ ఎన్జీవోల సంఘం రాష్ట్ర అధ్యక్షులు మారం జగదీశ్వర్ గారు ప్రధాన కార్యదర్శి ముజీబ్ హుస్సేన్ అధ్యక్షతన తెలంగాణ వ్యవసాయ విస్తరణ అధికారులు సెంట్రల్ ఫోరం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలనుకుంటున్న డిజిటల్ క్రాఫ్ సర్వే లో ఏఈఓలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి, ఇతర సమస్యల గురించి సుదీర్ఘంగా చర్చించారు. వివిధ రాష్ట్రాలలో డిజిటల్ క్రాప్ సర్వే అమలు చేస్తున్న విధానం కాకుండా మన రాష్ట్రంలో ఏ ఈ ఓ లను పూర్తి బాధ్యుల్ని చేస్తూ ఒక యాప్ డెవలప్ చేసి దానిని ఏఈఓ లందరినీ తమ వ్యక్తిగత చరవనులలో డౌన్లోడ్ చేసుకొని సర్వే చేపట్టాలని, లేనిపక్షంలో ఉన్నతాధికారులు జిల్లా అధికారుల ద్వారా ఏఈఓల భయభ్రాంతులకు గురిచేస్తూ యాప్ డౌన్లోడ్ చేసుకోని వారికి విధి నిర్వహణలో ఉన్నప్పటికీ ఉద్యోగానికి హాజరుకానట్టు సెలవు పరిగణిస్తామని ఒత్తిడి చేస్తున్నారు డిజిటల్ క్రాఫ్ సర్వే ప్రభుత్వం వ్యవసాయ శాఖ పైలెట్ ప్రాజెక్టుగా గత సంవత్సరము వాన కాలము మరియు యాసంగి లో 17 జిల్లాలలో 17 మండలాలను ఎంపిక చేసి చేపట్టారు. ఆ పైలెట్ ప్రాజెక్టు లో భాగంగా ప్రతి సర్వే నెంబరు ప్రతి సబ్ డివిజన్ లో వేసిన పంట యొక్క వి వివరాలను ఫోటోతో సహా యాప్ లో అప్లోడ్ చేయవలసి ఉంటుంది సర్వే నంబర్ను ఐడిటిఫికేషన్ చేసినప్పటికీ కూడా అందులో ఉన్న సబ్ డివిజన్లను మనము ఐడెంటిఫై చేయలేము దీనివల్ల రైతు వేసిన పంట వివరాలను తప్పుగా నమోదు చేసే అవకాశం ఉంటుంది ఈ విధంగా చేయుట రోజుకు ఒక మనిషి 50 ఫోటోలను చిత్రించగలిగారు ఈ విషయాన్ని గమనించిన అధికారు పంటకాలం అయిపోయే లో ఈ నమోదును పూర్తి చేయాలి కాబట్టి ఇతర మండలాల ఏఈఓ లను డిప్యూట్ చేసి చేయించినప్పటికీ కూడా రెండు నెలల సమయంలో పూర్తి చేయడం జరిగింది. ఉదాహరణకు నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండల జానకంపేట క్లస్టర్లో పైలెట్ ప్రాజెక్టు కింద చేసినప్పుడు 10470 ఫార్మ్ చిత్రాలు తీయడానికి కి ఐదుగురు ఏ ఈ ఓ లు 90 రోజుల సమయాన్ని వెచ్చించారు. అది కూడా ఒకే రకమైన పంట ఉన్నది. అదే ఒక్క ఏ ఈ ఓ మాత్రమే ప్రస్తుతం ఉన్న పరిస్థితిలో చేయాలంటే 455 రోజులు సమయం పడుతుంది ఇతర రాష్ట్రాలు అయిన కర్ణాటక లో ప్రైవేటు రెసిడెంట్స్ పేరిట స్థానిక యువకులను నియమించుకొని సర్వే చేయిస్తుంది ఇందుకుగాను ప్రతి ఫార్మ్ కి రూపాయలు 10 కేంద్ర బడ్జెట్ నుండి చెల్లిస్తున్నారు మహారాష్ట్రలో అక్కడి ప్రభుత్వం ఈ పిక్ పహాని పేరిట విజయవంతంగా అమలు చేస్తున్నారు మన పక్క రాష్ట్రం ఆంధ్ర ప్రదేశ్ వీఏఏ విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ ల ద్వారా ఒక్కొక్కరి 1000 ఎకరాలు పరిమితితో చేయిస్తున్నారు.

రాష్ట్రంలో 2604 రైతు వేదికలు గత ప్రభుత్వం రైతుల సమావేశాలు శిక్షణకు నిర్మించడం జరిగింది వాటి నిర్వహణకు నెలకు తొమ్మిది వేల రూపాయల చొప్పు నిర్వహణ ఖర్చులను ఇస్తామని హామీ ఇచ్చి కేవలం 5 నెలల మాత్రమే చెల్లించారు ఇంకా ఒక్కొక్క రైతు వేదికకు 216000 విడుదల కాకపోవడంతో ఏ ఈ ఓ లు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. పై విషయాలన్నిటినీ పరిగణలో తీసుకొని వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు వెంటనే స్పందించి డిజిటల్ క్రాఫ్ సర్వే యాప్ పై ఎక్స్పర్ట్ కమిటీని నియమించి ఈ కమిటీలో వ్యవసాయ విస్తరణ అధికారుల సంఘం నాయకులను మెంబర్స్ గా పరిగనిస్తూ కమిటీ నివేదిక ద్వారా ఇటు రైతులకు ఏ ఈ ఓ లకు ఇబ్బంది లేకుండా ప్రభుత్వ లక్ష్యాలను చేరుకునే విధంగా డీసీఎస్ అమలుపై సమీక్షించి నిర్ణయం తీసుకోగలరని తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్, తెలంగాణ ఎన్జీవోల కేంద్ర సంఘం అధ్యక్షులు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ముజీబ్ హుస్సేన్ తెలిపారు. పై సమస్యలన్నింటినీ కూడా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని రాష్ట్రంలోని ఏఈవోలెవ్వరు కూడా అధైర్య పడవద్దని యావత్ తెలంగాణ ఉద్యోగుల జేఏసి మీ వెన్నంటే ఉంటుందని భరోసా ఇచ్చారు ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ విస్తరణ అధికారుల రాష్ట్ర సంఘం అధ్యక్షులు డి శ్రీనివాస్ గౌడ్ కార్యదర్శి కే సురేష్ రెడ్డి అన్ని జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

# కలెక్టరేట్ ఎదుట కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగుల ధర్నా



నస్పూర్, సెప్టెంబర్ 28 (జనం సాక్షి): మంచిర్యాల కలెక్టరేట్ ఎదుట శనివారం కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. కనీస వేతనాలు చెల్లించాలని,కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు కార్మిక వ్యతిరేక లేబర్ చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా కాంట్రాక్ట్ కార్మిక సంఘం సిఐటియు రాష్ట్ర అధ్యక్షుడు దూలం శ్రీనివాస్, సిఐటియు జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ మాట్లాడారు.కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక, పారిశ్రామిక విధానాల వల్ల అన్ని రంగాలలో తాత్కాలిక ఉద్యోగుల సంఖ్య విపరీతంగా పెరిగిందన్నారు.1991 నుండి అనుసరిస్తున్న ఈ విధానాల వల్ల ఉద్యోగ భద్రత పోయి హైర్ అండ్ ఫైర్ సిస్టం వచ్చిందన్నారు.2014 నుండి కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కార్పోరేట్ సంస్థల ప్రయోజనాల కోసం కార్మిక చట్టాలలో మార్పులు చేశారని,29 చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్లను ప్రవేశపెట్టారన్నారు.కనీస వేతనానికి గ్యారంటీ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.8 గంటల పని దినానికి బదులు 12 గంటల పని దినం ప్రవేశపెట్టారన్నారు.కాబట్టి తక్షణమే కనీస వేతనాలు,కార్మిక చట్టాలను అమలు చేయాలని,ఉద్యోగ భద్రత కల్పించాలని లేనియెడల సిఐటియు యూనియన్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో నాయకులు గోమాస ప్రకాష్,దాసరి రాజేశ్వరి, రాజన్న,మహేందర్,కాంట్రాక్ట్,ఔట్సోర్సింగ్ కార్మికులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ ఆసుపత్రిలో పసికందు మృతి

- వైద్య సిబ్బంది కారణమంటున్న కుటుంబీకులు
- మిల్క్ ఆస్పిరేషన్ వల్లే ఇలాంటి ఘటనలు అంటున్న వైద్యుడు



భైంసా సెప్టెంబర్ 28 (జనంసాక్షి) : భైంసా పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో పసికందు మృతి చెందిన ఘటన శనివారం చోటుచేసుకుంది.కుటుంబీకులు,బంధువులు తెలిపిన వివరాల ప్రకారం...కుబీర్ మండలంలోని రాజురా గ్రామానికి చెందిన ఆనంద అనే గర్భిణీనీ గత రెండు రోజుల క్రితం పురిటినొప్పులతో పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో తీసుకురాగా, అదే రోజు పండంటి ఆడపిల్లను ప్రసవించిందనీ,బరువు తక్కువగా ఉండడంతో ఎన్.ఐ.సి.యు లో ఉంచారనీ,శనివారం ఉదయం శిశువు శరీరం నీలం రంగులోకి మారి తీవ్ర అస్వస్థతకు గురికాగా,దింతో వైద్యడు కాపాడే ప్రయత్నం చేసి, పరిస్థితి విషమించడంతో శిశువు మృతి చెందిందనీ వాపోయారు.శిశువు మృతి చెందడంతో బాధిత కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు.శిశువు మృతికి డాక్టర్ తో పాటు వైద్య సిబ్బందే కారణమని ఆగ్రహం వ్యక్తం చేశారు.శిశువు మృతి పై డాక్టర్ వివరణ కోరగా... సాధారణంగా శిశువును పడుకోబెట్టి పాలు తాగించడం ద్వారా ఇలాంటి సంఘటనలు చోటు చేసుకుంటాయని,మిల్క్ ఆస్పరేషన్ వల్లనే శిశువు మృతి చెందినట్లు వైద్యుడు పేర్కొన్నారు.

# ఆందోళన కలిగిస్తున్న హృద్రోగ మరణాలు




హృదయ సంబంధ వ్యాధుల గురించి ప్రజలలో అవగాహన పెంచడానికి, వ్యాధులు రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి సమాయత్తం చేయడానికి ప్రపంచవ్యాప్తంగా సెప్టెంబరు 29 న "ప్రపంచ హృదయ దినోత్సవం" జరుపుకుంటారు. ఈ దినోత్సవమును ప్రపంచ ఆరోగ్య సంస్థ, వరల్డ్ హార్ట్ ఫెడరేషన్ లు సంయుక్తంగా నిర్వహిస్తాయి. గుండెపోటు, గుండె జబ్బులను నివారించడంకోసం 1946లో జెనీవా దేశంలో వరల్డ్ హార్ట్ ఫెడరేషన్ సంస్థ ఏర్పాటయింది. 1999లో అప్పటి వరల్డ్ హార్ట్ ఫెడరేషన్ ప్రెసిడెంట్ తొలిసారిగా ఈ దినోత్సవాన్ని జరిపాడు. అలా 2000 నుండి ప్రపంచవ్యాప్తంగా ప్రారంభించబడింది. 2010 వరకు సెప్టెంబరు నెలలోని ఆఖరి ఆదివారం నిర్వహించబడిన ఈ దినోత్సవం 2011వ సంవత్సరం నుంచి సెప్టెంబరు 29వ తేదీన నిర్వహించబడుతోంది. 2024లో ప్రపంచ హృదయ దినోత్సవం యొక్క థీమ్ "వారి గుండె ఆరోగ్యాన్ని చూసుకోవడానికి వ్యక్తులను ప్రేరేపించడం." గుండె ఆరోగ్యానికి బాధ్యత వహించేలా వ్యక్తులను ప్రోత్సహించడం, గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరిచే చర్యలను సూచించడం, జాతీయ స్థాయిలో హృదయ ఆరోగ్య కార్యాచరణ ప్రణాళికను అమలుచేయడం, సానుకూల ప్రభావం చూపడానికి ప్రజలను, రోగులను, వైద్యులను నిమగ్నం చేయడం అనేవి ఈ యేడాది ప్రపంచ హృదయ దినోత్సవం లక్ష్యాలుగా పెట్టుకోవడం జరిగింది.

**మన దేశంలో పరిస్థితులు:** మన దేశంలో గత మూడు సంవత్సరాలుగా గుండెపోటు మరణాలు పెరిగాయి. 2022లో గుండెపోటు కారణంగా 32,457 మంది మరణించారని, అంతకుముందు సంవత్సరంలో నమోదైన 28,413 మరణాల కంటే గణనీయమైన పెరుగుదల ఉందని నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్ సి ఆర్ బి) తెలిపింది. 2022లోనే గుండెపోటు కేసులలో 12.5% ??పెరుగుదల ఉందని తెలిపింది. ప్రపంచవ్యాప్తం గణాంకాలలో భారతదేశం రెండవ స్థానంలో ఉంది. మనదేశంలో ఏటా 20% పురుషులు 17% మంది స్త్రీలు మరణిస్తున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదికలో మనదేశంలో స్త్రీల కంటే పురుషులలో హృదయ సంబంధిత మరణాల రేటు ఎక్కువగా ఉందని తెలిపింది. ఒక లక్ష మందిలో పురుషులలో 349 మంది స్త్రీలలో 265గా మరణాలు ఉన్నాయి. ఈ రేట్లు యునైటెడ్ స్టేట్స్ కంటే రెండు నుండి మూడు రెట్లు ఎక్కువగా ఉన్నాయి. గుండె సమస్యలతో యువకులు అకాల మరణాలకు గురవుతున్నారు. ఇది ఆందోళన కలిగించే విషయం యువకులలో గుండెపోటు విషయానికి వస్తే అతిపెద్ద సవాళ్ళలో ఒకటి. చాలా మందికి తమకు ప్రమాదం ఉందని తెలియదు.

**కారణాలు :** ఫాస్ట్‌ఫుడ్, అధిక ప్రాసెస్ చేసిన వస్తువులు, చక్కెర పానీయాలతో నిండిన ఆధునిక ఆహారాలు యువకులలో అధిక ఊబకాయం, అధిక రక్తపోటు, అనారోగ్య లిపిడ్ ప్రొఫైల్‌లకు దోహదపడుతున్నాయి.

యువకులు తమ రోజులో గణనీయమైన భాగాన్ని పనిలో లేదా విశ్రాంతి కోసం కూర్చొని గడుపు తున్నారు. ఇది బరువు పెరగడానికి, హృదయనాళ ఫిట్‌నెస్‌లో క్షీణతకు, గుండె సమస్యలకు ఎక్కువ ప్రమాదానికి దారితీస్తుంది. పొగాకు వినియోగం, మాదకద్రవ్యాలు మద్యం వాడకం మరో పెద్ద కారణం. దీర్ఘకాలిక ఒత్తిడి అనేక విధాలుగా గుండె ఆరోగ్యాన్ని ప్రతికూలంగా ప్రభావితం చేస్తుంది. డిప్రెషన్ లేని వారితో పోలిస్తే డిప్రెషన్‌ను నివేదించిన యువకులకు గుండె జబ్బులు వచ్చే అవకాశాలు రెండింతలు ఎక్కువగా ఉన్నాయని కొత్త అధ్యయనాలు కనుగొన్నాయి.

**పరిష్కారాలు :** తృణధాన్యాలు,లీన్ ప్రోటీన్లు, పండ్లు,కూరగాయలతో కూడిన సమతుల్య ఆహారం గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. కొవ్వు పదార్థాలు, చక్కెర పానీయాలు వంటి ప్యాక్ చేయబడిన, ప్రాసెస్ చేయబడిన ఆహారాల వినియోగాన్ని తగ్గించడం చాలా ముఖ్యం. తక్కువ చక్కెర, కొలెస్ట్రాల్ స్థాయిలు, ట్రాన్స్ ఫ్యాట్స్, కాంప్లెక్స్ కార్బోహైడ్రేట్లు అధికంగా ఉన్న ఆహారం గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. స్థిరమైన వ్యాయామ దినచర్యను నిర్వహించడం గుండె పనితీరును మెరుగుపరుస్తుంది. కొలెస్ట్రాల్ స్థాయిలను, రక్తపోటును తగ్గిస్తుంది. ఆరోగ్యకరమైన బరువును నిర్వహించడానికి సహాయపడుతుంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ పెద్దలందరికీ ప్రతి వారం 150 నిమిషాల మితమైన వ్యాయామం చేయాలని సిఫార్సు చేసింది. అనారోగ్య కొలెస్ట్రాల్ స్థాయిలతో గుండె జబ్బుల ప్రమాదం పెరుగుతుంది. ధూమపానం గుండె జబ్బులకు అత్యంత సాధారణ ప్రమాద కారకాల్లో ఒకటి. దీనిని మానేయడం హృదయ సంబంధ వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. అదే సమయంలో మొత్తం గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడుతుంది. ఆల్కహాల్ అధిక వినియోగం హృదయ సంబంధిత వ్యాధులకు దోహదం చేస్తుంది. రక్తపోటుకు కూడా దారితీస్తుంది.

**జనక మోహన రావు దుంగ**
**ఫోన్ 8247045230**

# రాహుల్ బాటే రాజకీయాలకు ఆదర్శం



**ఎండి.మునీర్**
సీనియర్ జర్నలిస్ట్, విశ్లేషకులు
9951865223



భారతదేశంలో ప్రస్తుతం రాజకీయాలకు కాంగ్రెస్ నేత, పార్లమెంట్ లో విపక్ష నాయకుడు రాహుల్ గాంధీ బాట ఆదర్శంగా మారుతున్నది. ఆయన ను ప్రముఖ బాలిఉడ్ నటుడు సైఫ్ అలీ ఖాన్ కూడ నాయకుడు అంటే రాహుల్ గాంధీ మాదిరి ఉండాలని అంటున్నాడు. ఆయనను ఒక గట్స్, ధైర్యం ఉన్న రాజకీయ నాయకుడు గా పేర్కొన్నారు. నిజానికి రాహుల్ గాంధీ మాదిరి చాలా ఓపెన్ గా పీడిత, తాడిత ప్రజలవైపు నిలబడి పోరాడుతున్న నేతగా పేర్కొనవచ్చు, మాజీ బీజేపీ నేత, ప్రస్తుత తృణముల్ కాంగ్రెస్ ఎంపీ, ప్రముఖ సీనియర్ బాలిఉడ్ నటుడు శత్రుఘన్ సిన్హా కూడ రాహుల్ గాంధీ చాలా ధైర్యం ఉన్న, నిజం చెప్పే నాయకుడిగా ఇటీవల పలు మార్లు పేర్కొన్నారు. ఇండియా కూటమిలోని దాదాపు అందరూ సీనియర్, జూనియర్ నేతలు కూడ రాహుల్ గాంధీ ని ఒక గట్స్ ఉన్న నేతగా పేర్కొనడం ను పలు మార్లు చూసాము. రాహుల్ గాంధీ ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా, మనదేశం వాళ్ళను, అక్కడ ఉద్యోగాలు చేస్తున్న వారి సాధక, బాధలను తెలుసుకోవడం, ఇండియాకు వచ్చిన తర్వాత వారి కుటుంబ సభ్యులను కలవడం, వారితో ముచ్చటించడం ఇటీవల హర్యాణ లో టాక్ అఫ్ ది స్టేట్ అయిపోయింది. రాహుల్ గాంధీ మీద అనవసర విమర్శలు, ఆరోపణలు చేస్తున్న వారి మాటలను జనం నమ్మే పరిస్థితుల్లో లేరంటే అతిషయోక్తి కాదు.ప్రస్తుతం ఆయన ఆచరణ కనులారా, చూస్తూ జనం ముఖ్యంగా పీడిత జనం రాహుల్ పని తీరు పై సంతోషంగా ఉన్నారు. పీఎం నరేంద్ర మోడీ మాటల మనిషి, చేతల మనిషి కాదని చాలా స్పష్టమైన నిర్ణయానికి, అభిప్రాయానికి జనం వచ్చేస్తున్నారు. రాహుల్ గాంధీ కేంద్రం లోని ప్రభుత్వం పది ఏండ్ల వైఫల్యాలను జనం ముందు పూసగుచ్చినట్లు పెడుతున్న తీరు అద్భుతంగా ఉంది.

**కార్పొరేట్ల తీరు బట్ట బయలు**

మరోవైపు గౌతమ్ అదాని లాంటి కార్పొరేట్ల నిజస్వరూపంను, దేశంను, ప్రభుత్వ మద్దతుతో లూటి చేస్తున్న విషయాలను రాహుల్ గాంధీ దేశం ముందు పెడుతున్నారు. విదేశాల్లో కోట్ల రూపాయల కాంట్రాక్టులు ఇప్పించడం, దేశంలోని దాదాపు అన్నీ కాంట్రాక్ట లు అదాని, అంబానీలకే ఇవ్వడం జనం చూస్తున్నారు. కార్పొరేట్ లకు 16 లక్షల కోట్ల రుణ మాఫీ ఇవ్వడమే కాదు, టాక్స్ లలోనూ వెసలు బాటు కల్పించడం, సెబీ చీఫ్ మాధవి బుచ్, అమె భర్త కుంబకోణాలు, అవినీతి, కక్కుర్తి, వీరితో అదాని లింకు, హిండెన్ బర్గ్ రిపోర్ట్ లు వెలుగు చూడడం, ప్రతీ విషయం లోనూ రాహుల్ గాంధీ చాలా చాక చక్యంగా బట్ట బయలు చేస్తున్నారు. డౌన్ టూ ఎర్త్ నేతగా ఆయన కు వచ్చిన పేరును ఎన్ని ప్రయాసలు చేసినా బీజేపీ వాళ్ళు చెరిపి వేయలేరు!రాహుల్ సామాన్య మైన బట్టలు, ఎక్కువ శాతం రెగ్యులర్‌గా టి షర్ట్‌తో బయటకు రావడం, ఎక్కడ బడితే అక్కడ, ఎవరితో బడితే వారితో సామాన్యుల్లో, సామాన్యుడు లా కలిసి పోవడం చూస్తున్నాం.

**సకల జనుల కష్టాల్లో..**

సకల జనుల కష్టాలు తెలుసుకోవడం, ముఖ్యంగా మణిపూర్ లాంటి 16 నెలలుగా మండుతున్న ప్రాంతానికి వెళ్లి పీడితులను పరామర్శించడం, మహిళల సమస్యలు, వారి మీద దేశంలో చర్విత చరణంగా జరుగుతున్న అత్యాచారాలు, హత్యాచారాలు, దాష్టికాల మీద రాహుల్ గాంధీ స్పందిస్తున్న తీరు, కనీసం ఇలాంటి సీరియస్ విషయాల మీద కూడ నోరు తెరవని పీఎం మోడీ కి ఇప్పుడు మింగుడు పడని విషయం అయిపోయింది. రాహుల్ గాంధీ కి ప్రజల్లో పెరుగుతున్న అభిమానం, గౌరవం కొన్ని అదాని, అంబానీ లాంటి కార్పొరేట్ ల జాతీయ ఛానల్స్ కు కూడ మింగుడు పడడం లేదు! అందుకే తన ముఖం ను వారు చూయించడం లేదు, అని ఇటీవల ఒక ఎన్నికల సభలో హర్యాణ లో అన్నారు. అంతే కదా నిజం చెప్పే వారిని చూయిస్తే, అబద్దాలు చెప్పేవారు, ఇచ్చే కోట్ల రూపాయల ప్రకటనలు బంద్ అయిపోతాయి, కదా!అందుకే వాళ్ళు రాహుల్ పేస్ చూయించరు! అయినా రాహుల్ కు జనంలో పెరుగుతున్న ఆదరణ ను ఆపలేక పోతున్నారు.




**రాహుల్ ఒక పారే నీరు**

రాహుల్ గాంధీ రాజకీయాల్లో ఇప్పుడొక పారే నీటి లాంటి వాడు,ఆయనను ఆపడం అంటే అర చేతిని అడ్డు పెట్టి సూర్య కాంతిని ఆపే వృధా ప్రయాస చేసినట్టే అవుతుంది! ఇక్కడ చివర ధర్మేంద్ర నటించిన ఆయన పై చిత్రీకరించిన 'హుకుమత్ ' చిత్రం లోని జుల్మ్ కర్నె సెబీ బురాహై! జుల్మ్ సహెన్ కర్నా! దర్కర్ జీనేసే అచ్చ హై! సామ్నే లడ్కర్ మర్నా!'నా జుల్మ్ నా జాలింక అధికార్ రహేగా! దునియామే కుచ్ రహేగాతో బస్ ప్యార్ రహేగా! ప్యార్ రహేగా. ఎస్ రాహుల్ కా ప్యార్ కా సందేశ్ రహేగా.

# తెలంగాణ గ్రూప్-1పై మళ్లీ నీలినీడలు?

నీళ్లు-నిధులు-నియామకాల ఎజెండాతో పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో నియామకాల విషయంలో రాష్ట్రం ఏర్పడ్డాక ఎనిమిదేండ్ల తర్వాత గత ప్రభుత్వం హయాములో 503 పోస్టులతో గతంలో ఎన్నడూ లేని విధంగా అతిపెద్ద గ్రూప్ 1 నోటిఫికేషన్‌ని ఏప్రిల్ 26 ,2022 న విడుదల చేసింది.ఉమ్మడి రాష్ట్రంలో 2011 తర్వాత గ్రూప్ 1 పై మళ్ళీ నోటిఫికేషన్ రాలేదు.దాదాపు పన్నేండ్ల తర్వాత ఎక్కువ పోస్టులతో నోటిఫికేషన్ రావడం వల్ల తెలంగాణ సమాజంలోని నిరుద్యోగులు,ఉద్యోగులు ఎంతోమంది అదృష్టంగా భావించారు.ఉన్నఫలంగా నిరుద్యోగులైతే అప్పుచేసుకొని ...ఉద్యోగులైతే చేస్తున్న ఉద్యోగానికి లీవులు పెట్టి కుటుంబాలను వదిలేసి తట్టబుట్ట సర్థుకొని అశోక్ నగర్ ,ఆర్టీసీ క్రాస్ రోడ్డు బాట పట్టింద్రు. గ్రూప్ 1 ఉద్యోగం అనేది సివిల్స్ రాసే స్థోమత లేని ఎంతోమంది నిరుపేద మధ్య తరగతి సామాన్యులకు సివిల్స్ స్థాయి పోస్టులకు చేరడానికి ఒక దారి.

**అనుకున్న ఉద్యోగం సాధించడానికి తిండి తిప్పలు మాని**

కుటుంబాలకు ...చివరకు తమకు తాముగా సామాజిక బహిష్కరణ చేసుకొని రాత్రింబవళ్ళు పోటాపోటీగ కష్టపడి చదివి అక్టోబర్,2022 లో ప్రిలిమ్స్ రాసారు.ప్రిలిమ్స్ రిజల్ట్ వచ్చి మెయిన్స్ ఎగ్జామ్స్ కి మరింత సీరియస్ గ ప్రిపేరవుతున్న సమయంలో ఫిబ్రవరి,2023 లో పేపర్ లీకేజ్ ల ఇష్యూ తో టీజీపిఎస్సీ ఆ ప్రిలిమ్స్ ఎగ్జామ్ ని రద్దుచేసి రెండోసారి ప్రిలిమ్స్ ని జూన్ 11,2023 న నిర్వహించింది.రెండోసారి ప్రిలిమ్స్ నిర్వహణలో బయోమెట్రిక్ తీసుకోలేదన్న కారణంతో హైకోర్టు మరోసారి ప్రిలిమ్స్ ని రద్దుచేసి రీఎగ్జామ్ పెట్టాలంటు తీర్పునిచ్చింది. ఆ తర్వాత వచ్చిన అసెంబ్లీ ఎన్నికలు ప్రభుత్వం మారడం కొత్త ప్రభుత్వం ఏర్పాటు కావడం జరిగింది. వచ్చిన కొత్త ప్రభుత్వం పాత నోటిఫికేషన్ ని రద్దుచేసి మరో 60 పోస్ట లను కలుపుతు మొత్తం 563 పోస్టులతో కొత్త నోటిఫికేషన్ ని ఇచ్చింది.అప్పటికే రెండుసార్లు ప్రిలిమ్స్ రాసి మానసికంగా, ఆర్థికంగా ఎంతో నష్టపోయిన అభ్యర్థులు కొత్త ఉత్సాహాన్ని పుంజుకొని మూడోసారి ప్రిలిమ్స్‌కి కూడా సిద్దమైపోయారు.జూన్ 9,2024 న ఎన్నో ఆశలతో ప్రిలిమ్స్ రాయడం జరిగింది.కానీ రాసినంక కొన్ని రోజులనుంచైతే అభ్యర్థులలో ఈ ఎగ్జామ్ మీద కూడా అనుమానాలైతె మొదలైనయి.ప్రిలిమ్స్ 'కీ'లో దాదాపు 10-12 ప్రశ్నలు తప్పులుండటం ...ఫైనల్ 'కీ' లో అభ్యర్థుల నుండి వచ్చిన ఆబ్జెక్షన్స్ ని పూర్తిస్థాయిలో తీసుకోకుండా కేవలం రెండు ప్రశ్నలను డిలీట్ చేసి ...మరొక ప్రశ్నకు 'కీ' ఆన్సర్ ని మార్చడం జరిగింది.ఫైనల్ 'కీ' లో తప్పుల మీద హైకోర్టులో చాలా కేసులు పడ్డాయి.



ఈ మూడో ప్రిలిమ్స్ ఫైనల్ 'కీ'లో తప్పులు మాత్రమే కాకుండా,గత ప్రభుత్వం లో వచ్చిన నోటిఫికేషన్ లో ...ఈ ప్రభుత్వం లో వచ్చిన నోటిఫికేషన్ లో జీవో ను మార్చడం పెద్ద ఇష్యూ గ మారిపోయింది.గత నోటిఫికేషన్ ప్రకారం జీవో నంబర్ 55 ద్వారా రూల్ ఆఫ్ రిజర్వేషన్ పద్దతి ద్వారా 1:50 నిష్పత్తిలో అభ్యర్థులను మెయిన్స్ కి సెలెక్ట్ చేసింద్రు.కానీ ఈ కొత్త నోటిఫికేషన్ లో జీవో 55 బదులుగా జీవో 29 ని తీసుకొచ్చింద్రు.ఈ జీవో 29 ప్రకారం అభ్యర్థులను 1:50 నిష్పత్తిలో ఓపెన్ మెరిట్ పద్దతిలో మెయిన్స్ కి సెలెక్ట్ చేయడం జరిగింది.ఈ జీవో ని ఛాలెంజ్ చేస్తు రిజర్వ్ డ్ అభ్యర్థులు భారత రాజ్యాంగంలోని 15(4),16(4) మరియు 335 నిబంధనలకు విరుద్దంగా ఉందని, రిజర్వేషన్ లను ఉల్లంఘించడం జరిగిందని కోర్టు మెట్లనెక్కింద్రు.గతంలో ఇదే జీవో 29 మీద వచ్చిన కేసును మధ్యప్రదేశ్ హైకోర్టు కొట్టివేయడం జరిగింది.యూపిఎస్సీ కూడా ప్రిలిమ్స్ లో రూల్ ఆఫ్ రిజర్వేషన్ ని పాటిస్తుంది.ఈ జీవో 29 కి వ్యతిరేకంగా చాలా బలంగానైతె కేసు ఉంది. ఇవేగాకుండా ఎస్టీ రిజర్వేషన్ మీద,ఈడబ్ల్యూఎస్ కోటా మీద,స్పోర్ట్స్ కోటా మీద ,పిహెచ్ కోటా మీద మొత్తంగా 30 కేసుల వరకు పడ్డయి.గత రెండు నెలల నుండి హైకోర్టు లో హియరింగ్ కి వస్తూనే ఉన్నాయి.కానీ టీజీపిఎస్సీ నాలుగైదు రోజుల క్రితమే కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేసింది...హైకోర్టు లో వాదోపవాదనలు చాలా బలంగా జరుగుతున్నయి.

మెయిన్స్ ఎగ్జామ్స్ అక్టోబర్ నెల 21 వ తేదీ నుండి 27 వరకున్నాయి.మెయిన్స్ కి క్వాలిఫై అయిన అభ్యర్థులు ఈ పలు విధాలైన కేసుల దృష్ట్యా మానసికంగా కృంగిపోతు ఫోకస్డ్ గ చదవలేక పోతున్నారు...వారిలో భయాందోళనలు కూడా మొదలైనయి! ఇప్పటికే మూడుసార్లు ప్రిలిమ్స్ రాసి మానసికంగా ...ఆరోగ్యపరంగా...ఆర్థికపరంగా ఎంతో నష్టపోయి ఉన్నారు.కోర్టు లో ఉన్న ఈ కేసులన్ని క్లియర్ అయిన తర్వాతనె మెయిన్స్ ఎగ్జామ్స్ ని నిర్వహించాలని కోరుకుంటున్నారు.

టీజీపిఎస్సీ మొండిగా పోయి మెయిన్స్ నిర్వహిస్తే, ఈ కోర్టు కేసుల దృష్ట్యా మళ్ళీ మెయిన్స్ 2.0 రాయాల్సి వస్తుందేమోననె భయమైతే మెయిన్స్ అభ్యర్థులలో నెలకొంది.గతంలో ఇలాగె ఉమ్మడి రాష్ట్రంలో 2011 గ్రూప్ 1 ప్రిలిమ్స్ ఎగ్జామ్ ఫైనల్ 'కీ' లో తప్పుడు 6 ప్రశ్నల మీద ఛాలెంజ్ చేస్తు ఇద్దరు అభ్యర్థులు ఆనాడు కోర్టు లో కేసు వేసింద్రు. ఆ కేసు నడుస్తుండగానే పబ్లిక్ సర్వీస్ కమీషన్ కోర్టు నిబంధనలను ఖాతరు చేయకుండ మెయిన్స్ ని ...ఇంటర్వ్యూలను కూడా నిర్వహించింది.కానీ సుప్రీంకోర్టు మెయిన్స్ ని,ఇంటర్వ్యూలని రద్దుచేసి,ఆరు ప్రశ్నలని డిలీట్ చేసి కొత్త లిస్ట్ ప్రకారం మెయిన్స్ నిర్వహించాలని తుది తీర్పునిచ్చింది.రాష్ట్ర విభజనోద్యమం వల్ల ఆ నోటిఫికేషన్ పోస్టులను కొత్తగా ఏర్పడిన రెండు రాష్ట్రాలు నిష్పత్తి ప్రకారం పంచుకొని,2015 లో రాష్ట్రాల వారిగ 144 ప్రశ్నలకు గాను ప్రిలిమ్స్ క్వాలిఫైడ్ లిస్ట్ తీసి మెయిన్స్ ని నిర్వహించడం జరిగింది.ఈ నోటిఫికేషన్ లో మొదటి సారి మెయిన్స్ ,ఇంటర్వ్యూలు వచ్చిన చాలా మంది అభ్యర్థులు తదుపరి లిస్ట్ లో లేకుండపోయారు.ఆ మిస్సైన అభ్యర్థుల మనోవేదన వర్ణనాతీతం.ఎవరు చేసిన తప్పిదాలకు ఎవరు బలైపోతున్నరు...?? ఇప్పుడు కూడా అదే పునరావృతం కాదన్న గ్యారెంటీ ఏమున్నదనే ఆందోళన, భయమైతె మెయిన్స్ అభ్యర్థులలో నెలకొంది. దాదాపు మూడేండ్ల నుండి ఈ ఎగ్జామ్ కోసం అన్ని వదులుకొని ప్రిపేరవుతూ ఉన్నరు.ఇప్పటి వరకు సపోర్ట్ ఇచ్చిన కుటుంబాలు కూడా విసిగిపోయి ఇక సపోర్ట్ చెయ్యలేని పరిస్థితిలోకి వెళ్లిపోయినయి.బలంగ కనబడుతున్న ఈ పలు కేసుల వలన మెయిన్స్ అభ్యర్థులందరిలో గత నెల రోజుల నుంచైతే మానసికంగా ప్రశాంతంగా చదవలేని పరిస్థితులు నెలకొన్నాయి.ఈ కేసులన్నీ ఒక కొలిక్కి వచ్చినంకనె మెయిన్స్ ని నిర్వహించాలని మెయిన్స్ అభ్యర్థులందరు కోరుకుంటున్నారు.

**గట్టు రాధిక మోహన్**
**హన్మకొండ**

# మతం చుట్టూ లడ్డు వివాదం



ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న లడ్డు వివాదం చిలికి చిలికి గాలివానలా తయారైంది సామాన్య ప్రజలకు మతం రంగు పులిమి వినోదాన్ని పంచుతున్నాయి భారత రాజ్యాంగం పౌరులకు 25 నుంచి 28 వరకు నిబంధనలు మత స్వాతంత్ర్యపు హక్కును దేశ ప్రజల కల్పించింది 25 వ నిబంధన ప్రకారం ప్రతి వ్యక్తి తన అంతరాత్మ ప్రకారం నచ్చిన మతాన్ని స్వేచ్ఛగా సేకరించి అనుసరించవచ్చు 26వ నిబంధన ప్రకారం మత నిర్వహణ కోసం స్థిర చరాస్తులను కలిగి ఉండవచ్చు వాటి నిర్వహించుకోవచ్చు 27వ నిబంధన మతం ఆధారంగా ఏ వ్యక్తిపై పన్ను విధించరాదు 28వ నిబంధన ప్రకారం ప్రభుత్వ పాక్షిక సహాయం కానీ పూర్తి సహాయం కానీ పొందే సంస్థలలో మత బోధ చేయరాదు 1976 వ సంవత్సరం 42వ రాజ్యాంగ సవరణలో లౌకిక అనే పదం చేర్చుకుందాం దీని అర్థం మతం నుండి వేరు అని అర్థం సామాజిక ఆర్థిక మరియు జీవితంలోని సాంస్కృతిక అంశాల నుండి మతాలను వేరు చేయడం మతం స్థానంలోనే మానవత్వాన్ని శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలి ఇక్కడ విషయాన్ని ప్రస్తావించడానికి గల కారణం లడ్డు వివాదం తారస్థాయికి చేరుకోవడం ఒక ఎత్తు అయితే మెజార్టీ ప్రజల మనోభావాలు దెబ్బతీసే వారిని విచారణ చేసి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలి కానీ రాజకీయ ప్రయోజనాలకు వాడకూడదు. ఇక్కడ ప్రధానమైన సమస్య తటస్థంగా ఆలోచిస్తే ఐదు సంవత్సరాలు ముఖ్యమంత్రిగా ఉన్న జగన్మోహన్ రెడ్డి వెంకటేశ్వర స్వామికి పట్టు వస్త్రాలు సమర్పించారు ప్రతిపక్ష నేతగా కూడా వెంకటేశ్వర స్వామిని చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో దర్శనం చేసుకున్నారు ఇక్కడ కొత్తగా డిక్లరేషన్ ఇవ్వడం అనేది సంశయం అన్యమతస్తులు మత ప్రచారం చేయడం హిందూ మనోభావాలకు వ్యతిరేకంగా ఎవరైనా ప్రవర్తిస్తే అది క్షమించరాని నేరం కానీ ఒక వ్యక్తి నీ మతమాతరంగా నిషేధించుట సభ మైనది కాదు ఎవరైనా లౌకిక రాజ్యంలో పరస్పరం ఒకరి మత విశ్వాసాలను మరొకరు గౌరవించడం భారతీయ సంస్కృతిలో ఒక భాగం లడ్డు ప్రసాదంలో తప్పు ఎవరు చేసినా అది క్షమించరాని నేరం ఇక్కడ చాలా సున్నితమైన అంశం మతాన్ని భావోద్వేగాలకు ఉపయోగించకూడదు భారతదేశ లౌకిక రాజ్యం అనే భావాన్ని పకడ్బందీగా మనం అమలు చేసుకోవాలి వాస్తవంగా దేవాలయాల నిర్వాహనలో రాజకీయ జోక్యం లేకుండా స్వాతంత్ర ప్రతిపత్తితో లౌకిక విలువలకు విరోధం కలగకుండా నిర్వహించుకునే ఏర్పాట్లను చేయాలి మాకే వెల్లి అనే పండితుడు చెప్పినట్టు మతాల నుండి రాజకీయాలను వేరు చేయాలి అవి రెండు ప్రత్యేక కోణంలో చూడాలి.



**ఉమాశేషారావు వైద్య**
**లెక్చరర్ ఇన్ పొలిటికల్ సైన్స్**
**కామారెడ్డి**

## షహీద్ భగత్ సింగ్‌కు విప్లవ జోహార్లు

బ్రిటిష్ వలస సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా సమరశీల స్వతంత్ర యోధుడుగా 'ఇంక్విలాబ్' అంటే గుర్తుకు వచ్చే పేరు షాహిద్ భగత్ సింగ్.గదర్ వీరుల స్ఫూర్తితో రాజీ, కుమ్ముక్కు, ఊగిసలాట లేని వర్గ దృక్పథంతో కూడిన ఖచ్చితమైన పోరాట వైఖరితో చిరునవ్వుతో ఉరికంబాన్ని ముద్దాడిన త్యాగశీలి షహీద్ భగత్ సింగ్. రష్యా అక్టోబర్ సోషలిస్టు విప్లవ ప్రేరణతో భారత ప్రజల విముక్తి మార్గం పై స్పష్టమైన శాస్త్రీయమైన దృక్పథాన్ని అనుసరించిన సోషలిస్టు విప్లవ నాయకుడు కామ్రేడ్ భగత్ సింగ్.అసమానతలు లేని కుల మతాలు లేని భారత నవ సమాజం కోసం భగత్ సింగ్ రచనలు పదునైన మార్గదర్శకాలు.భారత చరిత్రలో యువకులకు విద్యార్థులకు అశేష పీడత ప్రజానీకానికి నిరంతరం విప్లవ ఉత్తేజ ప్రేరణ కలిగించే విప్లవ ఐకాన్ భగత్ సింగ్.



**జంపన్న**

## మాయా జూదం

పేక ముక్కలు
మూడు ముక్కలు
ఆకులు కుదిరితే
ఆస్తులు పెరుగుతాయి
ఆకులు తప్పితే
అప్పులు మిగులుతాయి...
జూదం మంచి వినోదం
దారి తప్పితే దుఃఖ దాయం
అడవులు పట్టవచ్చు
భిక్షాటనకు దారి కావచ్చు...
ఒక వైపు జూదం నిషేదం
ఒక వైపు జూదానికి అనుమతులు
ఇదొక ద్వంద్వ వైఖరి
ఎటుతేలని కిరికిరి
పతనానికి దారి

**రేడియమ్**
**9291527757**

# కంచె చేను మేసిందోచ్..!

- పంచుకో-పెంచుకో అంటున్న పంచాయతీరాజ్ అధికారులు
- ఇచ్చుకో-పుచ్చుకో అంటున్న ఇరిగేషన్ శాఖ
- దొరికితే దొంగ లేదంటే దొర అనే చందంగా కబ్జా దారులు
- సాహసం చేయరా డింభకా అని ప్రోత్సహిస్తున్న ప్రభుత్వ అధికారులు






**సంగారెడ్డి, సెప్టెంబర్ 28 (జనం సాక్షి)**

సంగారెడ్డి జిల్లా, సదాశివపేట మండలం, నాగ్సన్‌పల్లి గ్రామం పరిధిలో, జాతీయ రహదారి ప్రక్కన క్రోవ్, సి అండ్ కె, పేరిట 'శిల్పా మోహన్ రెడ్డి' గ్రూప్ వారు డీటీసీపీ కార్యాలయం సంగారెడ్డి జిల్లా ద్వారా 2019 లో 'టిఎల్ పి' నంబర్ పొంది తద్వారా ప్లాట్స్ చేసి అమ్మడానికి 'వెంచర్' పనులు మొదలుపెట్టారు. ఇటీవల తెలంగాణ రాష్ట్రంలో ఏర్పాటు చేసిన 'హైడ్రా' రాష్ట్రంలో ప్రతి ఒకరిని చైతన్యం వంతుల్ని చేసింది. ఆ క్రమంలోలోనే ఈ 'వెంచర్' కు సంబంధించిన నిజా, నిజాలులు బయటకి వచ్చాయి. గడిచిన 5 సవత్సరాలు అనగా 2019 నుండి 2024 వరకు నాగ్సన్‌పల్లి గ్రామం పరిధిలోని 'నల్లవాగు కాలువ'ను దాదాపుగా 600 మీటర్లు ఒకరి ద్వారా 500 మీటర్లు వేరొకరి ద్వారా మొత్తం 1100 మీటర్ల పొడువు విస్తీర్ణం మరియు 10 మీటర్ల వెడల్పు విస్తీర్ణంలో ఆక్రమించబడినదని, ఆ క్రమంలోనే ఈ 'వెంచర్' ఆక్రమణ చేసినట్లు గత వారం రోజుల క్రితమే అధికారులు గుర్తించారు. ఈ ఆక్రమణలో ప్రభుత్వ అధికారుల పరోక్ష పాత్ర చాల ప్రాముఖ్యమైనదిగా, 'కంచె చేను మేసింది' అన్న చందంగా వున్నదని అక్కడి స్థానికులు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. తాయిలాలు పంచుకో ఆక్రమణలు పెంచుకో అనే పద్ధతిలో అప్పటి అధికారులు వ్యవహరించారని, మాకు ఏమాత్రం సంబంధం లేదని ప్రస్తుతం పనిచేస్తున్న పంచాయత్ రాజ్ శాఖ ఉద్యోగులు వారికి పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. టేబుల్ క్రింద నుండి తీసుకువడం అలవాటు పడిన కొంతమంది ఇరిగేషన్ శాఖ ప్రభుత్వ ఉద్యోగుల నిర్వాకం వల్ల కూడా ఈ వ్యవహారం అంత గాడితప్పి 'తాయిలాలు ఇచ్చుకో- భూమి కబ్జా పుచ్చుకో' అనే చందంగా వ్యవహారం కొనసాగింది అని కొంతమంది ప్రభుత్వ ఉద్యోగుల మొసలి కన్నీరు కార్చారు. రాష్ట్రంలో ఎటు చూసినా భూ కబ్జా, అక్రమ నిర్మాణాలు, అవినీతి, అడ్డదారులు రాజ్యమేలుతున్న ఈ క్రమంలో భూ ఖబ్జా దారులు సమయాన్ని అనుకూలంగా చేసుకొని 'దొరికితే దొంగ లేదంటే దొర అనే' చందంగా వ్యవహరిస్తున్నారు. ఈ భూ కబ్జాదారుల పట్ల కొంత మంది ప్రభుత్వ ఉద్యోగులు 'తగిన చర్యలు తీసుకొంటాము' అనే ముసుగు ధరించి నామమాత్రపు ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇంకొకవైపు సాహసం చేయరా డింభకా అని భూ కబ్జాదారులను సహకారాన్ని అందచేస్తు, ప్రోత్సహిస్తున్న ప్రభుత్వ అధికారులు పరోక్ష పాత్ర కూడా పోషిస్తున్నారని అక్కడి ప్రజలు బహిరంగంగానే మాట్లాడుకుంటున్నారు. ఏపీ మాజీ మంత్రి, వైసీపీ నేత శిల్పా మోహన్ రెడ్డికి హైడ్రా నోటీసులు జారీ చేసింది. ఆయన సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం నాగ్సన్‌పల్లిలోని నల్లవాగును ఆక్రమించి వెంచర్ వేసినట్లు హైడ్రా అధికారులు గుర్తించారు. జిల్లా అధికారి 'డిపిఓ' పంచాయత్ రాజ్ చట్టాన్ని వుపయోగించి 'టిఎల్‌పి' రద్దు చేసి తన శాఖాపరమైన అధికార స్వచిలత ప్రదర్శిస్తారో, లేక మరేమైనా సాకులు వెతుకుతారో.! వేచిచూస్తే సమయమే సమాధానం ఇస్తుందని స్థానికులు మాట్లాడుకొన్నారు.



## ఉజ్వల భవిష్యత్తు విద్యతోనే సాధ్యం

### ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మిరాజ్

**చంపాపేట్ (జనం సాక్షి):**

ఉజ్వల భవిష్యత్ విద్య తోనే సాధ్యమని యాకుత్ పురా నియోజకవర్గం ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మిరాజ్ అన్నారు. శనివారం నియోజకవర్గ పరిధిలోని సీరాత్ మౌసిం-ఈ-ఇన్సనీయత్ (ఎస్ఏడబ్ల్యూఎస్) పాఠశాల విద్యార్థులతో ఎస్సే రైటింగ్ కాంపిటీషన్ ప్రతిభవంతులకు ఎమ్మెల్యే ప్రశంసా పత్రాన్ని అందజేశారు. విద్యార్థులతో ఎమ్మెల్యే మాట్లాడారు. ఉన్నత లక్ష్యాలు పెట్టుకొని ఇష్టపడి చదివి ప్రయోజకులు కావాలని పిలుపునిచ్చారు. నవ సమాజ అభివృద్ధి విద్యతోనే సాధ్యమన్నారు. ఉజ్వల భవిష్యత్తు ఆర్థిక సామాజిక దేశ అభివృద్ధి అన్ని రంగాల్లో రాణించాలంటే విద్యతోనే సాధ్యమన్నారు. నియోజకవర్గం విద్యాలయాల అభ్యున్నతికి ఎల్లప్పుడూ కృషి చేస్తానన్నారు.ప్రభుత్వ బడుల బలోపేతానికి అందరూ ముందుకు రావాలన్నారు.

ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సిబ్బంది సభ్యులు అభిమానులు నాయకులు పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



## విదేశీ బంగారం స్మగ్లింగ్..!

### రూ.3.71 కోట్ల విలువైన బంగారం స్వాధీనం

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 28 (జనంసాక్షి) :**

కోయంబత్తూరు నుంచి కారులో తరలిస్తున్న రూ.3.71 కోట్ల విలువైన విదేశీ స్మగ్లింగ్ బంగారాన్ని రంగారెడ్డి జిల్లా శివార్లలో స్వాధీనం చేసుకున్నామని, దీనికి సంబంధించి ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) తెలిపింది. కోయంబత్తూరు నుంచి హైదరాబాద్‌కు విదేశీ స్మగ్లింగ్ చేసిన బంగారం తరలింపుపై నిర్దిష్ట నిఘాతో డీఆర్ఐ అధికారులు శనివారం సెప్టెంబర్ 24 రంగారెడ్డి శివార్లలో రాయికల్ టోల్ ప్లాజా వద్ద కారులో బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. హ్యాండ్‌బ్రేక్‌కు దిగువన ప్రత్యేకంగా తయారు చేసిన క్యావిటీలో దాచిపెట్టి విదేశీ స్మగ్లింగ్ బంగారాన్ని తీసుకెళ్తున్నట్లు విచారణలో వెల్లడైంది. అప్పుడు వారిలో ఒకరు స్టీరింగ్ వీల్ క్రింద ఒక గొళ్ళెం లాగి, బ్రౌన్ టేప్/పేపర్‌తో చుట్టబడిన నాలుగు ప్యాకెట్లను తీసి, మొత్తం 18(పద్దెనిమిది) 24 క్యారెట్ బంగారు కడ్డీలు/99.9% స్వచ్ఛత కలిగిన 4778.00 గ్రాముల బరువున్న, రూ. 3,71,25,060/- స్వాధీనం చేశారు. వాహనంతో పాటు రికవరీ చేసిన బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. కారులో ప్రయాణిస్తున్న 3 (ముగ్గురు) వ్యక్తులను కస్టమ్స్ చట్టం, 1962 నిబంధనల ప్రకారం అరెస్టు చేసి, జ్యూడీషియల్ కస్టడీకి రిమాండ్ చేశారు.



## సమస్యల పరిష్కారానికి ముందుంటా

### కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి

**శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 28 (జనంసాక్షి) :**

శేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలి డివిజన్ పరిధిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంతోపాటు డివిజన్ సమగ్రాభివృద్ధికై నిజాయితీగా కృషి చేస్తానని కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి అన్నారు. ఈ మేరకు గౌలిదొడ్డిలో 50 లక్షల రూపాయలతో నిర్మించ తలపెట్టిన సిసి రోడ్డు నిర్మాణం పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని ఆయా కాలనీలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి, చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులపై రాజులేని పోరాటం చేస్తానన్నారు. గచ్చిబౌలి డివిజన్ సమగ్ర అభివృద్దే ధ్యేయంగా ముందుకు వెళుతున్నామని, ఉన్నతాధికారుల సహకారంతో దశలవారిగా అభివృద్ధి పనులు చేపడుతామని, అసంపూర్తిగా మిగిలిపోయిన పనులు త్వరలోనే పూర్తి చేస్తామని కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి హామీని ఇచ్చారు. డివిజన్ పరిధిలోని ప్రతి కాలనీలో నెలకొన్న సమస్యలను పరిగణలోకి తీసుకోవడంతోపాటు స్వయంగా ఇంటిటికి తిరుగుతూ ప్రజల నుండి ఇబ్బందులను తెలుసుకొని సత్వర పరిష్కారమే ధ్యేయంగా ముందుకు సాగుతామన్నారు. డివిజన్ అభివృద్ధికి కృషిచేస్తానని, ప్రతి కాలనీని అన్ని రంగాలలో అభివృద్ధి పథంవైపు నడిపిస్తానని, రోడ్లు, డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతానని ఆశ భావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గచ్చిబౌలి డివిజన్ ఉపాధ్యక్షులు తిరుపతి, సీనియర్ నాయకులు బిక్షపతి, శేఖర్, బాలకృష్ణ, హనుమంతు, గణేష్, సుమన్, ప్రసాద్, శ్రీను, రాజు, గోవింద, నగేష్, ఆనంద్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలతో మానకోల్లాసం పెంపొందుతుంది

### జిల్లా అదుపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

**మెదక్ బ్యూరో, సెప్టెంబర్ 28(జనం సాక్షి):**

క్రీడలతో మానసికోల్లాసం పెంపొందుతుందని.. స్నేహభావానికి దోహదపడుతుందని జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం రోజున స్థానిక అవుట్డోర్ స్టేడియంలో జిల్లా స్థాయి యువజన క్రీడోత్సవాల్లో అదనపు కలెక్టర్ పాల్గొని ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..జిల్లా యువజన మరియు క్రీడా శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి యువజనోత్సవాలను ఘనంగా నిర్వహించడం జరిగిందన్నారు. వివిధ సాంస్కృతిక పోటీలను ప్రదర్శించడం జరిగిందని వివరించారు. యువత అన్ని రంగాల్లో రాణించాలని క్రీడలు మానసిక శారీరక వ్యక్తిగత ఆరోగ్యానికి దోహదం చేస్తాయని ప్రతి వ్యక్తి దైనందిక జీవితంలో క్రీడలను అలవర్చుకుని తన ఆరోగ్య రక్షణ పై చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు పాల్గొని గెలుపొందిన వారికి బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల నిర్వహణ అధికారి దామోదర్ రెడ్డి సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## హైడ్రాతో అమాయకులు బలి

### హైడ్రా బడా బాబులకు కొమ్ముకాస్తూ పేద ప్రజలపై ప్రతాపం చూపుతోంది



మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్

**కుకట్ పల్లి సెప్టెంబర్ 28(జనంసాక్షి):**

హైడ్రా బడా బాబులకు కొమ్ముకాస్తూ పేద ప్రజలపై ప్రతాపం చూపుతోందనీ ఈ కారణంగా అమాయకులు బలవుతున్నారని మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ ఆందోళన వ్యక్తం చేశారు. మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావుతో కలిసి శనివారం కూకట్పల్లికి చెందిన బుచ్చమ్మ మరణం పట్ల సంతాపం తెలియజేసి నివాళులర్పించారు. కూకట్ పల్లి యాదవబస్తీలో నివాసముంటున్న బుచ్చమ్మ అనే మహిళ తన పిల్లలకు ఇచ్చిన ఇళ్లను హైడ్రా కూల్చేస్తారన్న భయంతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. స్థానిక నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటేల రాజేందర్ బుచ్చమ్మ నివాసానికి విచ్చేసి ఆమె పార్థివదేహానికి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఎవరికి భయపడాల్సిన అవసరం లేదని మీకు అండగా మేము ఉన్నామని భరోసా ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హైడ్రా అనవసరంగా ఒక ఆడబిడ్డ నిండు ప్రాణాన్ని తీసుకుందని, ప్రభుత్వం యొక్క పనితీరు పేద మధ్యతరగతి ప్రజల విషయంలో కక్షపూరితంగా, నిరంకుశంగా ఉందని, బడా బాబులకు కొమ్ము కాస్తున్నారని పక్షపాత ధోరణి వహిస్తుందని హైడ్రా పై మండి పడ్డారు. హైడ్రా బాధితులకు మేము అండగా ఉంటామని వారికి న్యాయం జరిగే వరకు పోరాడుతామని ఈటెల రాజేందర్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి మేడ్చల్ జిల్లా నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రతతోనే మెరుగైనా వాతావరణం

### మున్సిపల్ చైర్ పర్సన్ స్వప్న పరిమళ్

**తాండూరు సెప్టెంబర్ 28(జనంసాక్షి)**

పరిసరాల పరిశుభ్రత తోనే మెరుగైన వాతావరణం లభిస్తుందని మున్సిపల్ చైర్ పర్సన్ స్వప్న పరిమళ్ పేర్కొన్నారు. శనివారం తాండూరు పట్టణం భద్రేశ్వర చౌక్‌లో నర్సింగ్ కళాశాల తాండూర్ వారి ఆధ్వర్యంలో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమం సోషల్ సర్వీస్ పై ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్ పర్సన్ స్వప్న కమిషనర్ విక్రమ్ సింహరెడ్డి హాజరయ్యారు. నర్సింగ్ కళాశాల విద్యార్థులు చెత్తాపై నాటక రూపంలో ప్రదర్శన ఇచ్చారు. అనంతరం మున్సిపల్ అధికారులు స్వచ్ఛత హి సేవపై ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని విద్యార్థులచే నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ స్వప్న మాట్లాడుతూ స్వచ్ఛభారత్ మిషన్ కేంద్ర ప్రభుత్వం నరేంద్ర మోడీ తలపెట్టి నేటికి పది సంవత్సరాలు పూర్తయిందని అన్నారు. సెప్టెంబర్ 17 తారీకు నుంచి అక్టోబర్ 2 వరకు రోజువారిగా తాండూర్‌లో మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లుగా తెలిపారు. అయినా ప్రజలలో మార్పు రావాలని చెత్త ఎక్కడపడితే అక్కడ వెయ్యరాదని ప్రజలందరూ సహకరించినప్పుడే తాండూర్ స్వచ్ఛతంగా ఏర్పడుతుందని అన్నారు. ప్రజలందరూ ఇందుకు సహకరించి ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని ప్రజలు ముందుండి చెత్తపై సమరం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ నరేందర్ రెడ్డి, కౌన్సిలర్ విజయ్ దేవి, మున్సిపల్ సిబ్బంది నర్సింగ్ కళాశాల విద్యార్థులు తదితరులు ఉన్నారు.

## 'ప్రాజెక్ట్ గో కురిన్‌తో పర్యావరణ పరిరక్షణ వైపు మంథన్ పాఠశాల అడుగులు



**హైదరాబాద్ సెప్టెంబర్ 28 (జనంసాక్షి)**

మంథన్ పాఠశాలకు చెందిన విద్యార్థులు 'ప్రాజెక్ట్ గో కురిన్'తో పర్యావరణ పరిరక్షణ వైపు అడుగులు వేశారు. ఐఎస్పీ చేంజ్ మేకర్స్ ప్రోగ్రామ్‌లో భాగంగా 9వ తరగతి ఐజీసీఎస్ఈలో చదువుతున్న ఆరుగురు విద్యార్థులు పేపర్ రీసైక్లింగ్, సస్టైనబిలిటీపై దృష్టి సారించారు. పాఠశాలలో ఉన్న కాగితపు వ్యర్థాలను తగ్గించడంలో భాగంగా రీసైకిల్ ద్వారా వస్తువులుగా మార్చాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ ప్రాజెక్టులో భాగంగా గౌలిదొడ్డిలో ఉన్న కేశవ్ నగర్ ప్రభుత్వ పాఠశాలలో పిల్లల కోసం విరాళాల డ్రైవ్, వర్క్‌షాప్ నిర్వహించారు. విద్యార్థులు కాగితపు వ్యర్థాలు సేకరించి.. వాటిని ముక్కలు చేసి గుజ్జుగా మార్చారు. ఆ గుజ్జు తర్వాత కాగితంగా రూపాంతరం చెందింది. ఈ కాగితం బొమ్మలు, శిల్పాలు, అలంకార వస్తువులు తయారు చేయడానికి మూల పదార్థంగా పని చేసింది. ఈ బొమ్మలను కేశవ్ నగర్ పాఠశాల విద్యార్థులకు అందజేశారు. ఈ వర్క్‌షాప్లో పేపర్ రీసైక్లింగ్ కళను పిల్లలకు నేర్పించారు. 'పేపర్ వ్యర్థాలను రీసైక్లింగ్ చేయడం బాగుంది. చిన్న చిన్న విరాళాలు కూడా పర్యావరణానికి ఎలా ఉపయోగపడతాయో? తెలుసుకున్నాం. రీసైకిల్ చేసిన మెటీరియల్‌తో బొమ్మలు తయారు చేయడం, అంగన్‌వాడీ పిల్లలు వాటిని అందుకోవడం చూసిన ఆనందం మాటల్లో చెప్పలేను. ఇది మరింత బాధ్యతగా, స్పృహతో ఉండాలని మాకు నేర్పింది' అని ఈ ప్రాజెక్టులో పాల్గొన్న ఒక విద్యార్థి తెలిపారు. ఈ సందర్భంగా మంథన్ స్కూల్ ప్రిన్సిపాల్ సుర్జీత్ సింగ్ మాట్లాడుతూ విద్యార్థుల అంకితభావం ప్రశంసనీయమన్నారు. సృజనాత్మకత, పర్యావరణంపై బాధ్యతను ప్రోత్సహించే అర్థవంతమైన ప్రాజెక్ట్‌లను మా విద్యార్థులు చేపట్టడం ఆనందదాయకం అన్నారు. 'ప్రాజెక్ట్ గో కురిన్' కింద విద్యార్థులు చేసిన ఈ పని సానుకూల మార్పును సృష్టిస్తుందనడంలో ఎటువంటి సందేహం లేదన్నారు. పచ్చదనం, స్థిరమైన ప్రపంచానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## అండర్ పాస్ బ్రిడ్జి సమస్యకు శాశ్వత పరిష్కారం

### ఎమ్మెల్యే అరికెపూడి

**శేరిలింగంపల్లి సెప్టెంబర్ 28 (జనంసాక్షి) :**

శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జివద్ద 4 కోట్ల రూపాయల అంచనావ్యయంతో జరుగుతున్న నాల విస్తరణ పనులను, పలు రోడ్లను జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డితో కలిసి స్థానిక ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ శనివారం పరిశీలించారు. ఇందులో భాగంగా ఆయా ప్రాంతాలలో డ్రైనేజీ సమస్యలను సైతం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జివద్ద వరద ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా 4 కోట్ల రూపాయల నిధులతో బాక్స్ కల్వర్ట్ మరియు వరద నీటి కాల్వ నిర్మాణం పనులను చేపట్టడం జరుగుతుందన్నారు. మరమ్మత్తు పనులు తుది దశలో ఉన్నాయని, అసంపూర్తిగా మిగిలిపోయిన పనులు త్వరితగతిన చేపట్టాలని ఈ సందర్భంగా అధికారులకు ఆయన సూచించారు. రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి పనులను త్వరలోనే పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి



తీసుకువస్తామని అరికపూడి భరోసాను వ్యక్తం చేశారు. ప్రజలు, ప్రయాణికుల అవసరాలను దృష్టిలో పెట్టుకొని బ్రిడ్జి మరమ్మత్తు పనులను త్వరితగతిన పూర్తి చేయాల్సిన అవసరం ఉందని, పనుల విషయంలో అలసత్వం ప్రదర్శించకూడదని, పనుల నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని కాంట్రాక్టర్లకు ఆదేశాలను జారీ చేశారు. సమస్య పునరావృతం కాకుండా కల్వర్ట్ నిర్మాణము విషయంలో అధికారులకు పలు సలహాలు, సూచనలను ఎమ్మెల్యే అందజేశారు. ఎన్నో ఏండ్ల సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు వేయడం జరుగుతుందని, ఎంతో మంది ప్రయాణికులకు, వాహన దారులకు సాంత్వన చేరే అవకాశం ఉందని ఎమ్మెల్యే గాంధీ తెలియ చేశారు. శేరిలింగంపల్లిలో అనేక రోడ్లు, లింక్ రోడ్లు, ఫ్లై ఓవర్ లు, అండర్ పాస్ లు నిర్మించి ప్రజలకు సుఖవంతమైన ట్రాఫిక్ రహిత సమాజాం కోసం నిజాయితీగా కృషి చేశామని ఎమ్మెల్యే గాంధీ తెలియచేశారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి శేరిలింగంపల్లి జోన్ ఈఈ జికెడి ప్రసాద్, డిఈ లు ఆనంద్, దుర్గాప్రసాద్, ఏఇ లు భాస్కర్, సంతోష్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ విరేశంగౌడ్, జనార్దన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ వృత్తి ఎంతో గౌరవప్రదమైనది



### గండీడ్ మండల విద్యాధికారి జనార్ధన్

**గండేడ్ సెప్టెంబర్ 28 (జనం సాక్షి)**

సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో గౌరవప్రదమైందని గండీడ్ మండల విద్యాధికారి ఆర్ జనార్ధన్ అన్నారు. మండలంలోని రెడ్డిపల్లి మండల ప్రాథమిక పాఠశాలలో పనిచేసే పదవి విరమణ పొందిన ఉపాధ్యాయులు కే కొండయ్య ను, బదిలీపై వెళ్లిన మండల విద్యాధికారి వెంకటయ్యను శనివారం ఉపాధ్యాయులు, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి. సుధాకర్ రెడ్డి, పిఆర్టియు టిఎస్ మహబూబ్నగర్ జిల్లా అధ్యక్షులు మదన్ మోహన్ యాదవ్, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు జైపాల్ రెడ్డి, జిల్లా సలహాదారు రవీందర్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు మోహన్ రెడ్డి, కార్యదర్శి శ్రీకాంత్, జిల్లా పిఆర్టియు ఉపాధ్యక్షులు కొండయ్య, టిఎస్ సిపిఎస్ ఈయు జిల్లా ప్రధాన కార్యదర్శి కేఎం చంద్రకాంత్, టిజియుఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి హరిలాల్, గండేడ్ మండల పిఆర్టియుటిఎస్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసరెడ్డి, కృష్ణయ్య, గౌరవ అధ్యక్షులు రాజేందర్రెడ్డి, మండల యుటిఎఫ్ అధ్యక్షులు గంట శ్రీనివాస్, టిపిఆర్టియు మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు- మహిపాల్ రెడ్డి సంజీవరెడ్డి, టిజిఎస్ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రవీందర్, లక్ష్మణ్, టీఎస్‌సిపిఎస్‌ఈయు మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్ రెడ్డి ,లక్ష్మయ్య మహమ్మదాబాద్ మండల పిఆర్టియుటిఎస్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు భీమ్ రెడ్డి , శ్రీనివాస్, మాజి ఎంపీపీ శాంతి రంగ్యా, మాజీ జెడ్పిటిసి శ్రీనివాస్ రెడ్డి, సంజీవరెడ్డి, కృష్ణారెడ్డి, కృష్ణయ్య, రవి తదితరులు మరియు మండలంలోని వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# బాలికల ఆత్మరక్షణకు కరాటే అవసరం



## జిల్లా కలెక్టర్ సిక్త పట్నాయక్

**నారాయణపేట జిల్లా బ్యూరో(జనం సాక్షి):**
నేటి సమాజంలో బాలికల ఆత్మరక్షణ కోసం కరాటే ఎంతో అవసరమని నారాయణపేట జిల్లా కలెక్టర్ సిక్త పట్నాయక్ అన్నారు. శనివారం నారాయణపేట మండలం సిగారం క్రాస్ రోడ్‌లో ఉన్న ద్వారక సెంట్రల్ స్కూల్ డ్రాగన్ షోటోకన్ కరాటే క్లాస్‌ను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం అమ్మాయిల పైన జరుగుతున్న అత్యాచారాల నుండి ఎలా రక్షించుకోవాలంటే కరాటేలో చాలావరకు ఉపయోగపడుతుందని అన్నారు. ఆత్మ రక్షణ కోసం ప్రతి బాలిక కరాటే నేర్చుకోవాలని సూచించారు. నారాయణపేట జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలోని బాలికలకు మూడు నెలలపాటు కరాటే శిక్షణ అతి త్వరగా ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ రవీందర్ గౌడ్, ఉపాధ్యాయ బృందం కరాటే వ్యవస్థాపకులు డ్రాగన్ షోటోకన్ కరాటే స్పోర్ట్స్ ఇండియా చీఫ్ సలాంబిన్ ఉమర్, టోర్నమెంట్ ఇంచార్జ్ మొహమ్మద్ సలీం కరాటే శిక్షకులు ధర్మేంద్ర అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# పథకాలకు పాతరేసి ఫోటోలతో జాతరా..?

- బతుకమ్మ చీరలు నిలిపేసి నేతన్నల బతుకుల్లో మన్ను
- ఇదేనా ముఖ్యమంత్రి దసరా కానుక
- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి



**వనపర్తి, సెప్టెంబర్ 28 (జనంసాక్షి):**
గత ప్రభుత్వం అమలు చేసిన ప్రజా సంక్షేమ పథకాలను పాతరేసిన ముఖ్యమంత్రి కేవలం ఫోటోల జాతరతో ఊరేగుతున్నాడని మాజీ వ్యవసాయ శాఖా మంత్రి సింగిరెడ్డి ధ్వజమెత్తారు. ప్రతీ కార్యాలయంలో సీఎం రేవంత్ ఫోటో అక్టోబర్ 7 లోపు పెట్టాలని ఆదేశాలు ఇవ్వడం అందుకు నిదర్శనం అన్నారు. శనివారం ఆయన వనపర్తిలో విలేకరులతో మాట్లాడారు . బతుకమ్మ చీరల పంపిణీ నిలిపేసి నేతన్నల బతుకుల్లో మన్నుపోశారని అన్నారు. అన్ని శాఖల అనుమతులతో కట్టుకున్న ఇళ్ళను హైడ్రా పేరుతో కూల్చి వేస్తూ పేదల కంటిమీద కునుకు లేకుండా చేయడం ఎలాంటి ప్రజాస్వామ్యమో చెప్పాలని డిమాండ్ చేశారు. తన సోదరుడు అక్రమంగా కట్టుకున్న అతి పెద్ద బిల్డింగును ఉద్దేశపూర్వకంగా కూల్చి వేయకుండా కోర్టు డైరెక్షన్ వచ్చే వరకు ఎందుకు వ్యవధి ఇచ్చారని, . ఇది ముఖ్యమంత్రి బంధు ప్రీతి, ఆశ్రిత పక్షపాతానికి నిదర్శనం కాదా అంటూ ప్రశ్నించారు. పేదల బతులకును ఛిద్రం చేసి,రాష్ట్రాన్ని అధోగతి పాలు చేశారని, కాంగ్రెస్ కు అధికారమిస్తే మార్పు తీసుకొస్తామని గొప్పలు చెప్పారని, అన్ని వర్గాల ప్రజల ను మోసం చేయడమే వాళ్ళు తెచ్చిన మార్పు ఇదేనా అని దుయ్యబట్టారు.ఇంత వరకు ప్రభుత్వ ఉద్యోగుల డీఎలకు దిక్కు లేదని,పీఆర్సీ గురించిన ఊసు లేదని అన్నారు. అన్నదాతలను బ్యాంకులు, కార్యాలయాల చుట్టూ తిప్పుతు, అరకొర రుణమాఫీతో చేతులు దులుపుకున్నారని,ఎకరాకు రూ.7500 రైతు భరోసా మాటెత్తడం లేదని,వరి ధాన్యానికి క్వింటాలుకు రూ.500 ఇస్తానన్న బోనస్ ను బోగస్ వాగ్దానంగా మార్చారని,రైతన్నలను ఆగం చేసి,వ్యవసాయ రంగాన్ని భ్రష్టుపట్టిస్తున్నారని ఘాటుగా విమర్శించారు. రూ.4000, 6000కు ఆసరా పెన్షన్ పెంపు ఎప్పటి నుండో చెప్పడం లేదని, మహిళలకు గృహలక్ష్మి కింది రూ.2500 హామీ అటకెక్కించారని,కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్‌లకు తులం బంగారం ఏమందో తెలియడం లేదని , ఆడబిడ్డలకు అమ్మవడి కింది రూ.12 వేలు, రూ.13 వేలు, కేసీఆర్ కిట్ మాయం చేశారని, గర్భవతులకు న్యూట్రిషన్ కిట్ కట్ చేశారని ఎద్దేవా చేశారు. ప్రభుత్వం వచ్చి 10 నెలలైనా, 6 గ్యారంటీల అమలుకు మాత్రం ఆదేశాలు లేవని,కానీ ఆరు గ్యారంటీల అమలును పట్టించుకోని ప్రభుత్వం ఆగమేఘాల మీద సీఎం ఫోటో ప్రభుత్వ కార్యాలయాల్లో పెట్టాలన్న ఆదేశాలు ఇవ్వడం హాస్యాస్పదం అన్నారు. వెంటనే ఆరు గ్యారంటీలు అమలు చేయాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి డిమాండ్ చేశారు.

# ఎస్సీ, ఎస్టీల చట్టాలపై అవగాహన కల్పించాలి

- ఎస్సీ, ఎస్టీ పెండిగ్ కేసులు సమస్యలు పరిష్కరించాలి
- ఎస్సీ, ఎస్టీలపై దాడులు అరికట్టాలి
- ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య



**మెదక్ బ్యూరో, సెప్టెంబర్ 28(జనం సాక్షి):**
అట్రాసిటీ కేసుల పరిహారం నిబంధనల ప్రకారం సకాలంలో అందించాలని..ఎస్సీ ఎస్టీలపై దాడులను అరికట్టాలని రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. కలెక్టరేట్లో శనివారం ల్యాండు, అట్రాసిటీ కేసులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఎస్సీ ఎస్టీ చైర్మన్ బక్కి వెంకటయ్య,కమిషన్ సభ్యులు రాంబాబు నాయక్, లక్ష్మీనారాయణ ,శంకర్,జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్,జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి,అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు,ఎస్సీ అభివృద్ధి అధికారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ మాట్లాడుతూ..ఎస్సీ, ఎస్టీల చట్టాలపై అవగాహన కల్పించాలని, ఎస్సీ,ఎస్టీ ల పెండింగ్ కేసుల పరిష్కరించాలని ,ఎస్సీ, ఎస్టీ లపై దాడులు అరికట్టలని, బాధితులకు నష్ట పరిహారం త్వరిత గతిన అందించాలని,ప్రతి నెలలో పౌర హక్కుల దినోత్సవం జరుపాలని, మెదక్ పట్టణంలో ఎస్సీ, ఎస్టీ దుకాణ సముదాయాలపై దృష్టి సారించాలన్నారు. మెదక్ పట్టణంలో అంబేద్కర్ విగ్రహాన్ని తిరిగి పున:ప్రతిష్టించాలన్నారు. అంబేద్కర్ విగ్రహాల దాడులను సహించేది లేదన్నారు. గౌతోజీగుడ లో జరిగిన సంఘటనలో నిందితులను అరెస్టు చేయాలని, అక్కడ సహపంక్తి భోజనం ఏర్పాటు చేయాలన్నారు. ఎస్సీ ఎస్టీ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ చట్టాలను పగడ్బందీగా అమలు చేయడానికి జిల్లా యంత్రాంగ తరఫున విశేష కృషి చేస్తున్నట్లు ఎందుకుగాను సివిల్ రైట్స్ డే నిర్వహించి ప్రజల్లో అవగాహన పెంపొందించి తద్వారా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ సమావేశంలో ప్రజలనుంచి వినతులు, దళిత సంఘాల సభ్యులు పలు అంశాలపై అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పారు. అన్ని సమస్యలను వారం లో పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమం లో జిల్లా అదికారులు, ఆర్డీవోలు, మానిటరింగ్ కమిటీ సభ్యులు, దళిత సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మాతా శిశు సంక్షేమం పట్ల అంగవాడిలు శ్రద్ధ చూపాలి



## ఎమ్మెల్యే చిట్టెం పర్ణిక

**నారాయణపేట జిల్లా బ్యూరో (జనం సాక్షి):**
మాతా శిశు సంక్షేమం పట్ల అంగన్వాడీ కేంద్రాల కార్యకర్తలు శ్రద్ధ చూపాలని నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణిక రెడ్డి అన్నారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా పిల్లలకు పౌష్టికాహారాన్ని అందజేయడంలో అంగన్వాడీ టీచర్లు చురుకైన పాత్ర పోషించాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. శనివారం నారాయణపేటలోని ఎస్ఆర్ గార్డెన్ పోలేపల్లి ఫంక్షన్ హాల్‌లో పోషణ అభియాన్ కార్యక్రమంలో ఎమ్మెల్యే పర్ణిక రెడ్డితో కలిసి జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. సెప్టెంబర్ 1 నుండి 30 వరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సెప్టెంబర్ 1 నుండి 30 వరకు నిర్వహించిన పోషణ అభియాన్ రోజువారి షెడ్యూల్ ప్రకారం జరిగిందని తెలిపారు. మన జిల్లాకు మెడికల్ కళాశాల వచ్చిందని ప్రభుత్వ ఆసుపత్రి జిజి హెచ్ అప్గ్రేడ్ అయినదని తెలిపారు. శ్యామ్ అండ్ మామ్ పిల్లల కొరకు సిబ్బందికి శిక్షణ ఇవ్వడం జరిగిందని ప్రతి బుధవారం ఐసిడిఎస్ ప్రోగ్రామ్స్ నడుస్తున్నావని తెలిపారు. ఈ నెలలో పోషణ అభియాన్ నిర్వహించామని మిల్లెట్స్‌పై కాన్సన్ట్రేషన్ చేయాలన్నారు. ప్రి స్కూల్‌కి హాజరు అవుతున్న పిల్లలు 3 నుండి 6సంవత్సర పిల్లలు 12624 ఉన్నారు అని తెలిపినారు. ఎమ్మెల్యే పర్ణిక రెడ్డి మాట్లాడుతూ ఈ నెలరోజులలో పోషణ అభియాన్ ద్వారా విద్యార్థులకు పౌష్టికాహారం అందజేయడం వారి ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపడం గర్భిణీ స్త్రీలు జాగ్రత్తలు పాటించాలి సరైన ఆహారం తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్వో సౌభాగ్య లక్ష్మి, డిడబ్ల్యు ఓ జయ, ఐసిడిఎస్ సిడిపిఓ సిబ్బంది మార్కెట్ చైర్మన్ సదా శివారెడ్డి, కౌన్సిలర్ సలీం,ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# సిసి రోడ్డు పనులు ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్

**తూప్రాన్ సెప్టెంబర్ 28( జనం సాక్షి):**
తూప్రాన్ మున్సిపాలిటీకి ఒక కోటి యాభై లక్షల రూపాయలు ఎస్‌డిఎఫ్ నిధులు నుండి వివిధ వార్డుల అభివృద్ధికి నిధులు మంజూరు అయినట్లు తూప్రాన్ మున్సిపల్ చైర్మన్ మామి ండ్లజ్యోతి కృష్ణ తెలిపారు. 6వ వార్డు కౌన్సిలర్ పల్లెర్ల జ్యోతి రవీందర్ గుప్తా ఆధ్వర్యంలో మారుతీ నగర్ నందు సీసీ రోడ్ పనులు ప్రార ంభించారు. రోడ్లు సరిగా లేక ఇబ్బంది పడు తున్న మారుతీ నగర్ కాలనీ వాసులు కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాల తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ నందాల శ్రీనివాస్ మున్సిపల్ కమిషనర్ కాజా మొయిజుద్దీన్ కౌన్సిలర్లు, జిన్న భగవాన్ రెడ్డి, బాణాపురం రాజు కుమ్మరి రఘుపతి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నాగరాజు గౌడ్, ఉమర్, అనిల్ మారుతి నగర్ కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# బీసీల రిజర్వేషన్ల కొరకై బీసీలంతా ఏకం కావాలి

- రాబోయే రోజుల్లో బీసీ ముఖ్యమంత్రి అవడం ఖాయం
- కాంగ్రెస్ పార్టీ పట్టభద్రుల ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న
- కాంగ్రెస్ ఎన్నికల హామీలో ఇచ్చిన కామారెడ్డి బిసి డిక్లరేషన్ అమలుచేసి తీరాల్సిందే
- బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్



**కల్వకుర్తి సెప్టెంబర్ 28(జనం సాక్షి)**
తెలంగాణ రాష్ట్రంలో బీసీలంతా ఏకం కావాలని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పిలుపునిచ్చారు. తెలంగాణలో ఒకే ఒక ఉద్యమం మిగిలి ఉందని అది కేవలం బిసిల రిజర్వేషన్ మాత్రమేనని బీసీ రిజర్వేషన్ల సాధనకై బీసీలంతా ఏకమవాలని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పిలుపునిచ్చారు. కల్వకుర్తి పట్టణ కేంద్రంలో తెలంగాణ బీసీ మహాసభ వ్యవస్థాపక అధ్యక్షులు కొమ్ము శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో జరుగుతున్న బీసీ మహా ధర్నా కార్యక్రమనికి ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్, హాజరయ్యారు. ఈ సందర్భంగా తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ.. స్వాతంత్రం వచ్చి నాటి నుండి ఇప్పటివరకు బీసీలను కేవలం ఓటు బ్యాంకుగానే వాడుకున్నారని దేశంలో కుక్కలకు నక్కలకు లెక్కలు ఉన్నాయి కానీ బీసీల జనాభా లెక్కలు లేవని అన్నారు. ఇప్పటివరకు ప్రతి రాజకీయ పార్టీ ఎన్నికలకు ముందు అనేక హామీలు ఇచ్చి మోసం చేశాయని ఇకముందు ఎన్నికల అప్పుడుప్రజలు కూడా రాజకీయ పార్టీలను మోసం చేస్తారని ప్రతి రాజకీయ పార్టీకి తెలిసి వచ్చేలా బుద్ధి చెప్పాలన్నారు. తెలంగాణ రాష్ట్రానికి అగ్రవర్ణానికి చెందిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చివరి సీఎంగా కొనసాగుతారని తదుపరి బీసీ వర్గానికి చెందిన వ్యక్తి సీఎంగా రాబోతున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ తరుపున బీసీ కుల గణన జరిపి 42 శాతం రిజర్వేషన్లను ప్రవేశ పెడతామని అదికార పార్టీకి చెందిన నేతగా తాను హామీ ఇస్తున్నట్లు తీన్మార్ మల్లన్న తెలిపారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ..బీసీలంతా ఐక్యతగా ఏర్పడి రాజ్యాంగం కల్పించిన ప్రజాస్వామ్య హక్కులను సాధించుకోవాలని అన్నారు. కెసిఆర్ కేటీఆర్ నాయకత్వంలో బిసి నాయకులను తమిళనాడు రాష్ట్రనికి బిసి రిజర్వేషన్ ఏ విధంగా అమలవుతున్నాయో తెలుసుకోవడానికి 40 మంది బిసి నాయకులను పంపించారని ఆ రాష్ట్రంలో బీసీలకు 69 శాతం రిజర్వేషన్ అమలు చేయడం ఏ విధంగా జరుగుతుందో స్టడీ చేయడానికి పంపించడం జరిగిందని అందుకు కేసీఆర్‌కు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ బీసీల ధర్నా పార్టీలకతీతంగా జరుగుతా ఉందని కామారెడ్డిలో కాంగ్రెస్ పార్టీ బీసీ డిక్లరేషన్ పేరుతో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని చెప్పిందని కానీ ఇప్పటివరకు ప్రభుత్వం వచ్చి పది నెలలు అవుతున్న బీసీల రిజర్వేషన్ గురించి పట్టించుకోవడంలేదని అన్నారు. ఈ యొక్క ధర్నా బీసీల హక్కుల కోసం జరుగుతున్న బిసి ధర్నా కార్యక్రమం అని అన్నారు. 42 శాతం రిజర్వేషన్ ఇస్తే 24 వేల మంది కొత్త బీసీ నాయకులు వస్తారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మాట్లాడిన విధంగా కామారెడ్డి లో మాట్లాడిన ప్రతి మాటను తూచ తప్పకుండా అమలు చేయాలని ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బిసి ఉద్యమ నాయకులు జర్నలిస్టు కల్లుగీత కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లా రవికుమార్, బిఆర్ఎస్ పార్టీ నాయకురాలు దాసరి ఉష, కల్వకుర్తి మండల సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షులు ఎముక జంగయ్య, తెలంగాణ బీసీ ఉద్యమ నాయకులు సదానందం గౌడ్, రాజేందర్, గోపాల్, పట్టపర్ల పాండు గౌడు, ధరమోని గణేష్, బీసీలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# గ్రామపంచాయతీ ఎన్నికలపై స్పష్టత లేదు

- ఓటర్ జాబితా ముసాయిదాపై అధికారుల కసరత్తు
- బీసీ జనగణ తర్వాతే ఎన్నికలు



**వనపర్తి బ్యూరో సెప్టెంబర్ 28 (జనంసాక్షి)**
గత సంవత్సరం కాలం నుంచి రాష్ట్రాల్లోని గ్రామపంచాయతీలో సర్పంచుల పదవీకాలం ముగిసిన నేపథ్యంలో గ్రామపంచాయతీ ఎన్నికల కోసం గ్రామాలలో రాజకీయ పార్టీల నాయకులు ఎదురుచూస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం మాత్రం పంచాయతీ ఎన్నికల గురించి ఇప్పటివరకు ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. కేవలం ఓటర్ జాబితా ముసాయిదా ప్రకటించడం అభ్యంతరాలు స్వీకరించి తుది జాబితాను విడుదల చేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఆదేశాలు మాత్రమే వచ్చినట్లు జిల్లా పంచాయతీ అధికారులు తెలిపారు. ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తున్నది ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు లేకపోయినా ముందు జాగ్రత్తగా పంచాయతీ ఎన్నికల నిర్వహణ కోసం కసరత్తు ప్రారంభిస్తున్నట్లు తెలిసింది. కానీ ఓటర్ల జాబితా కోసం రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో గ్రామాలలో స్థానిక సంస్థల ఎన్నికల హడావుడి ఆశావాహుల లో నెలకొన్నది, దాదాపు సంవత్సరకాలం నుంచి గ్రామపంచాయతీ ఎన్నికలు జరగకపోవడం మూలంగా గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడి పోతుందని రాష్ట్ర ప్రభుత్వం గ్రామపంచాయతీ ఎన్నికల కోసం సిద్ధమవుతున్నప్పటికీ మరో పక్క రాష్ట్రంలో బీసీ జనాభా లెక్కలు తేల్చాలని మరోపక్క బీసీ సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం కూడా బీసీ జనగణమన పూర్తి చేసిన తర్వాత ఎన్నికలు నిర్వహిస్తామని స్వయంగా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఇటీవల సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకల సందర్భంగా రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి స్పష్టంగా తెలియజేశారు. ప్రభుత్వం గ్రామపంచాయతీ ఎన్నికలు సాధ్యమైనంత త్వరగా నిర్వహించాలని ఆలోచన ఉన్నప్పటికీ ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో గ్రామపంచాయతీలకు రావాల్సిన నిధులకు ఆటంకాలు ఏర్పడతాయని నిధులు దారిమళ్లించే ప్రమాదం ఉంటుందని అందుకోసం గ్రామపంచాయతీ ఎన్నికలను సకాలంలో నిర్వహిస్తే కేంద్ర ప్రభుత్వం గ్రామపంచాయతీలకు న్యాయంగా రావలసిన నిధులు వస్తాయని ప్రభుత్వం ఒకపక్క భావిస్తుంది. అయినా అధికార కాంగ్రెస్ ఈ రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లే ముందు బీసీ జన గణ పూర్తి చేయడంతో పాటు రాష్ట్రంలో ప్రధానమైన అతిపెద్ద సంక్షేమ పథకం రైతు 2 లక్షల రుణమాఫీ పథకం పూర్తిచేసే దిశలో పయనిస్తుంది. రుణమాఫీలో ప్రతిపక్షం చేస్తున్న తప్పుడు ప్రచారానికి తిప్పి కొట్టడానికి 31 వేల కోట్ల రూపాయలు రెండు లక్షల రుణమాఫీకి ఖర్చు చేస్తామని అర్హత కలిగిన ప్రతి ఒక్క రైతుకు రెండు లక్షల రూపాయల రుణమాఫీని వర్తింప చేస్తామని కుండబద్దలు కొట్టి ఆ దశలో ముందుకు సాగుతుంది. అందుకే సంక్షేమ పథకాలు అమలు చేసి గ్రామపంచాయతీ ఎన్నికలకు వెళ్లడానికి కాంగ్రెస్ పార్టీ సిద్ధమైనట్టు తెలుస్తుంది.



# అంబేద్కర్ అందరివాడు

## ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి

**కంగ్టి, సెప్టెంబర్ 28 (జనం సాక్షి)**
అంబేద్కర్ అందరివాడని ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి తెలిపారు. కంగ్టి మండల పరిధిలోని చాప్ట(బి) గ్రామంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ నూతన విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ గొప్ప నాయకుడు వారు మన దేశానికి చేసిన సేవ ఏప్పుడు మర్చిపోలేనిది మనం ప్రతి ఒక్కరం వారిని స్ఫూర్తిగా తీసుకొని మనం ముందుకు వెళ్లాలని ప్రతి ఒక్కరిని కోరారు. ఈ కార్యక్రమంలో దామా నాగన్న, మాజీ ఎంపీపీ,అశోక్ రావు పటేల్, అబరావ్ పటేల్, నౌనాథ్ పటేల్, యం. సంగమేశ్వర్, నాగ్నాథ్ రావ్, వెంకట్ రావ్, గౌతమ్, పండరి రజినీకాంత్, మాలిపటేల్ యాదవ్ రావ్, మదు పాటిల్, పల్లవి పరశురాం, తాజా మాజీ సర్పంచ్, జైపాల్ రెడ్డి, డేవిడ్ తదితరులున్నారు.

# ఇందిరమ్మ రాజ్యంలోనే గ్రామ స్వరాజ్యం సిద్ధిస్తుంది

### రామన్న పల్లిలో గ్రామ పంచాయతీ కార్యాలయ భవనం ప్రారంభం

## ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి



**మహబూబ్ నగర్ బ్యూరో (జనం సాక్షి)**
ఇందిరమ్మ రాజ్యంలోనే గ్రామ స్వరాజ్యం సిద్ధిస్తుందని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డి అన్నారు. శనివారం మహబూబ్ నగర్ నియోజకవర్గం హన్వాడ మండలంలోని రామన్న పల్లి గ్రామంలో 20 లక్షల రూపాయలతో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ కార్యాలయ భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి గ్రామస్థాయి లోనే బీజం పడాలనే ఉద్దేశంతో ప్రజా ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని ఆయన స్పష్టం చేశారు. గ్రామంలో పదవతరగతి, ఇంటర్ మరియు డిగ్రీ చదివిన యువతకు త్వరలో మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో నిర్వహించే స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ లో చేర్పించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ యశోద, పిఆర్ఎఇ సురేష్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహేందర్, మహబూబ్ నగర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పెద్ద విజయ్ కుమార్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వై. అచ్చన్న , డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, కార్యదర్శి టంకర కృష్ణయ్య యాదవ్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లక్ష్మణ్ యాదవ్, నాయకులు శ్రీశైలం యాదవ్, రఘుపతి రెడ్డి, యాదన్న యాదవ్, గోపాల్, కృష్ణయ్య, అంజి, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

**భవిష్యత్తు బాగుండాలంటే బాగా చదువుకోవాలి**

భవిష్యత్తు బాగుండాలంటే బాగా చదువుకోవాలని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శనివారం రామన్న పల్లి గ్రామంలో 41.05 లక్షలతో నిర్మించిన అదనపు తరగతి గదులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పాఠశాల నిర్వహణ విషయంలో పార్టీలకు, రాజకీయాలకు ముడిపెట్టడం సరికాదని, గ్రామ ప్రజలంతా పాఠశాల అభివృద్ధికి కలిసికట్టుగా కృషి చేయాలని సూచించారు.




# రాజీ మార్గమే రాజ మార్గం

## జిల్లా జడ్జి రఫీ

**నారాయణపేట జిల్లా బ్యూరో(జనం సాక్షి):**
రాజీ మార్గమే రాజ మార్గం అని నారాయణపేట జిల్లా జడ్జి అబ్దుల్ రఫీ అన్నారు.శనివారం జిల్లా కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జడ్జి అబ్దుల్ రఫీ ప్రారంబించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక కారనాలచేత ఒకరిపై ఒకరు కేసులు పెట్టుకుని సతమతం అవుతున్నారనీ అన్నారు.దాంతో ఎన్నో వ్యయప్రయసాలకు గురై ఇబ్బందులు పడుతున్నారని దాంతో మణశాంతి లేకుండా గడుపుతున్నారని అన్నారు.ఇలాంటి ఇబ్బందులు పడకుండా వాస్తవాన్ని గుర్తించి రాజీ పడితే సుఖంగా జీవిస్తారని అన్నారు. ప్రజల కోసమే న్యాయ సాధికారత జాతీయ లోక్ అదాలత్ నిర్వహించి రాజీ కుదురుస్తున్నదని అన్నారు. ఈ లోక్ అదాలత్‌లో ఏళ్ళతరబడి పెండింగ్‌లో ఉన్న అనేక కేసుల్లో కక్షిదారులు రాజీ పడ్డారు. ఈ కార్యక్రమంలో న్యాయ మూర్తులు శ్రీనివాస్, ఉమర్, జకియా, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దామోదర్ గౌడ్, ఉపాధ్యక్షుడు నందు నామాజీ, పిపిలు ఆకుల బాలప్ప, సురేష్, న్యాయవాదులు, కక్షిదారులు పాల్గొన్నారు.




# మహిళా స్వరాజ్యం

తెలంగాణ

ఆదివారం
29 సెప్టెంబర్ 2024

జనంసాక్షి
www.janamsakshi.org




## ప్రభుత్వ సంక్షేమ పథకాలలో 5 శాతం వికలాంగులకు కేటాయించాలి

- పెన్షన్ ఆరు వేలు వెంటనే అమలు చేయాలి
- ఎన్ ఆర్ పి డి రాష్ట్ర అధ్యక్షుడు కె.వెంకట్







**కాప్రా, సెప్టెంబర్ 28 (జనంసాక్షి)**
వికలాంగుల ఉద్యోగ నియామకాల్లో శరీరక వికలాంగుల రోస్టర్ 10 లోపు తగ్గించాలని, వికలాంగుల పెన్షన్ 6000 లకు పెంచి, వెంటనే అమలు చేయాలని, ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న బ్యాక్ లాగ్ పోస్టుల భర్తీ కోసం, ప్రత్యేక నోటిఫికేషన్ విడుదల కోసం ఉద్యమిస్తామని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కె.వెంకట్ హెచ్చరించారు. వికలాంగుల హక్కుల జాతీయ వేదిక మేడ్చల్ జిల్లా 3వ మహాసభ కమలానగర్ భాస్కర్ రావు భవన్ లో చంద్రమోహన్ అధ్యక్షతన నిర్వహించినమహాసభకు ముఖ్య అతిథిగా హాజరైన ఎన్ పి ఆర్ డి రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శి కె.వెంకట్, అడివయ్య లు హాజరయ్యారు. ముందుగా సంఘం జెండాను రాష్ట్ర అధ్యక్షులు వెంకట్ ఆవిష్కరించారు. అనంతరం జరిగిన మహాసభల్లో అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా వికలాంగుల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లో అక్రమాలు ఉన్నాయని, ఆర్థిక నిర్వహణ సక్రమంగా అమలు చేయడం లేదని, నిధుల పర్యవేక్షణ చేయడంలో వికలాంగుల సంక్షేమ శాఖ విఫలం చెందుతుందని, కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ రిపోర్ట్ వెల్లడించింది అన్ని వారు అన్నారు. ఆర్థిక సంవత్సరం చివర్లో నిధులు విడుదల చేయడం ద్వారా, లబ్ధిదారులకు అందకుండా పోతున్నాయి. వికలాంగుల పెన్షన్ నిధులను ప్రధానమంత్రి ఆవాస్ యోజన వంటి అనేక పథకాల ప్రచారానికి వినియోగిస్తున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కల ప్రకారం, ప్రపంచ జనాభాలో 16% మంది వికలాంగులు ఉన్నారని, దేశంలో 10-15 శాతం మంది వికలాంగులు ఉన్నారని అంచనా. పాలకులు అనుసరిస్తున్న విధానాల మూలంగా వికలాంగుల సంఖ్య రోజురోజుకు పెరుగుతుంది. డిపార్ట్మెంట్ ఆఫ్ ఎంపవర్మెంట్ పర్సన్ విత్ డిజేబులిటీ 2021- 22 వార్షిక రిపోర్ట్ ప్రకారం 67,09,894 మందికి యూడిఐడి కార్డులు జారీచేసింది. దేశవ్యాప్తంగా 1,74,25,094 మందికి వైకల్య ధ్రువీకరణ పత్రాలు జారీ అయితే 67.09 లక్షల మందికి యూడిఐడి కార్డులు జారీ చేసినారు. పాఠశాలలకు వెళుతున్న వైకల్యం కలిగిన విద్యార్థులను గుర్తించేందుకు, ప్రతి ఐదేండ్లకు ఒకసారి సర్వే చేయాల్సి ఉన్న, దేశంలో ఎక్కడా కూడా ఇటువంటి సర్వేలు చేయడం లేదు. గ్రామపంచాయతీ, అంగన్వాడీ, ఆశా వర్కర్ల ద్వారా వికలాంగుల వివరాలను గ్రామ స్థాయిలో సేకరిస్తే, వికలాంగుల సమగ్ర సమాచారం సేకరించాలని డిమాండ్ చేశారు. 2016 వికలాంగుల హక్కుల పరిరక్షణ చట్టం అమలులో లోపం ఉందని, సుప్రీం కోర్టు చెప్పిన కేంద్ర ప్రభుత్వం స్పందించక పోవడం సిగ్గుచేటని అన్నారు. 2011 నుండి కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న ప 300 రూపాయలు వాటాతో, ఎట్లా బ్రతుకుతారని ధరల పెరుగుదలకు అనుగుణంగా పెన్షన్ పెంచాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలలో ఖాళీగా ఉన్న వికలాంగుల పోస్టుల భర్తీ కోసం, ప్రత్యేక నోటిఫికేషన్ విడుదల చేయాలన్నారు. తెలంగాణ డిసేబుల్డ్ స్టడీ ఇండియా రిపోర్ట్ ప్రకారం 43.02 లక్షల మంది తెలంగాణ రాష్ట్ర జనాభాలో 12.2 శాతం వికలాంగులున్నారు. రాజకీయ పార్టీలు వికలాంగుల సంక్షేమం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వం కులాలకు ఇస్తున్న ప్రాధాన్యత, సమాజంలో అత్యంత వెనుకబడిన వికలాంగులకు ఇవ్వడం లేదు అన్నారు. రాజకీయ పార్టీలు వికలాంగుల సంక్షేమం కోసం అనేక కొత్త పథకాలు ప్రకటిస్తున్నారని, ఎలాంటి పథకాలు ప్రవేశపెట్టడం లేదని ప్రశ్నించారు.

పెన్షన్ 6000 పెంచి వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉచిత విద్యుత్ ప్రయాణ సౌకర్యం, శరీరక వికలాంగుల రోస్టర్ 10 లోపు తగ్గించాలని,2016 ఆర్ పి డబ్ల్యూ డి చట్టం అమలు కోసం, నామినేటెడ్ పదవులలో రిజర్వేషన్స్ అమలు కోసం అసెంబ్లీలో చట్టం చేయలని డిమాండ్ చేశారు. చట్టం అమలుకు కో ఆర్డినేషన్ కమిటీలను రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిలో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మేడ్చల్ జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా కురునెల్లి వెంకట్, అధ్యక్షులుగా చంద్రమోహన్, ప్రధాన కార్యదర్శిగా కడలి నాగలక్ష్మి, కార్యనిర్వక అధ్యక్షులుగా సుల్తాన్ రమేష్, కోశాధికారి మల్లేష్, ఉపాధ్యకులు లక్ష్మీపతిరావు, బాలయ్య, సహాయ కార్యదర్శి విజయలక్ష్మి, వెంకటయ్య, గంగారెడ్డి, కమిటీ సభ్యులు రమేష్, నవ్య, మోజెష్, కృష్ణగౌడ్, రజిత, నాగయ్య, వెంకటేష్, అనిల్, శివ కుమార్ ఎన్నుకున్నారు.



## దీర్ఘకాలిక రుణాలు సద్వినియోగం చేసుకోవాలి

- కీసర పిఎసిఎస్ చైర్మన్ రామిడి ప్రభాకర్ రెడ్డి
- ప్రాధమిక వ్యవసాయ సహకార సంఘం మహాజనసభ పలు తీర్మానాలు

**కీసర, సెప్టెంబర్ 28 (జనంసాక్షి) :** ప్రాధమిక వ్యవసాయ సహకార సంఘం మహాజనసభ సమావేశము కీసర లోని సంఘం కార్యాలయంలో చైర్మన్ రామిడి ప్రభాకర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. గత అర్ధ సంవత్సర సహకార సంఘం లావాదేవీలను నివేదిక చదివి వినిపించారు. అదేవిధంగా సహకార సంఘం ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి, దొడ్డు రకం వడ్లకు కూడా రూ.500 రూపాయల బోనస్ ఇవ్వాలని తీర్మానం చేశారు. లోన్ మాఫీ అయినా సభ్యులకు రుణాలు ఇవ్వాలని, దీర్ఘకాలిక రుణాలు ఇవ్వాలని తీర్మానం చేశారు. ఈ సమావేశంలో ఉపాధ్యక్షులు పన్నాల బుచ్చి రెడ్డి, డైరెక్టర్లు మాలోత్ ధర్మా, మచ్చాని మల్లేష్ , కందాడి పోచిరెడ్డి, కౌకుట్ల చిన్నఅంజిరెడ్డి, కామసాని మల్లారెడ్డి, మాదిరెడ్డి భూపాల్ రెడ్డి, సిఈఓ పి.కిష్టారెడ్డి రైతులు తదితరులు పాల్గొన్నారు.



## నేటితరం విద్యార్థులు భావితరాలకు మార్గదర్శకులు

**సిద్ధార్థ కళాశాల అధ్యక్షులు గొట్టిముక్కుల పెద్ద భాస్కరరావు**

**కూకట్ పల్లి సెప్టెంబర్ 28(జనంసాక్షి):**
అన్ని రంగాలలో రాణిస్తున్న నేటితరం విద్యార్థులు భావితరాలకు మార్గదర్శకులని సిద్ధార్థ ఉమెన్స్ కళాశాల అధ్యక్షులు గొట్టిముక్కల పెద్ద భాస్కరరావు పేర్కొన్నారు. కూకట్పల్లిలోని సిద్ధార్థ ఉమెన్స్, కోయెడ్ కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకలు శనివారం కూకట్పల్లి అశోక గార్డెన్ లో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా స్నాతకోత్సవ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన సిద్ధార్థ కళాశాల చైర్మన్ జి నాగయ్య, కళాశాల ప్రెసిడెంట్ గొట్టిముక్కల పెద్ద భాస్కరరావు, డైరెక్టర్లు



మధుసూదన్ రావు, అరవింద్ రావు, విష్ణువర్ధన్, కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ భరత్, కళాశాల ప్రిన్సిపాల్స్ పద్మప్రియ, చంద్రశేఖర రావు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా గొట్టేముక్కల పెద్ద భాస్కర్ రావు మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా విద్య వ్యవస్థలో పెను మార్పులు చోటుచేసుకున్నాయి అన్నారు. నేటి విద్యార్థులు సైతం అన్ని రంగాలలో రాణిస్తూ ఉత్తమ ప్రతిభను కనబరుస్తూ ముందుకు వెళ్లడం అభినందనీయమని చెప్పారు. విద్యార్థులు తమ అనుకున్న లక్ష్యాలను చేరుకొని భావిత రాలకు ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సిద్ధార్థ ఉమెన్స్ విద్యార్థిని విద్యార్థులు పలు రకాల సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.



## ప్రభుత్వ భూమిని కాపాడాలని గ్రామస్తుల డిమాండ్

**శంకర్ పల్లి, సెప్టెంబర్ 28 (జనంసాక్షి) :**
కొండకల్‌లోని బిలా దాఖలా భూమి ఆక్రమణకు గురవుతున్న నేపథ్యంలో కొండకల్ గ్రామస్తులు శనివారం ముకుమ్మడిగా బిలా దాఖల భూమి వద్దకు వెలుచుండగా పోలీసులు అడ్డుకు న్నారు. దీంతో గ్రామస్తులు రోడ్డుపై బైఠాయించి పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సర్వే నెంబర్ లేని 48 ఎకరాల బిలా దాఖలా భూమి ఆక్రమణకు గురైనా,అధికారులు పట్టిం చుకోకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఆక్రమణలకు ప్రభుత్వ అధికారులే వత్తాసు పలుకుతున్నారని గ్రామస్తులు ఆరోపించారు. కోట్ల విలువ చేసే భూమిని కబ్జా చేస్తున్న రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. భూమి కోర్టు పరిధిలో ఉండగా రెవెన్యూ అధికారులు అక్రమార్కులకు ఎలా రిజిస్టర్ చేస్తారని ప్రశ్నించారు.కాగా గ్రామస్తులు ఆందోళన చేస్తుండగా నార్సింగి ఏసిపి రమణ గౌడ్ అక్కడికి చేరుకున్నారు. భూమి విషయం మై జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేయాలని సూచించారు. పరిష్కారం కానీ యెడల కోర్టును ఆశ్రయిస్తే న్యాయం జరుగు తుందని అన్నారు.రోడ్డుపై బయట ఇస్తే శాంతి భద్రతలకు విఘాతం కలుగుతుందని ఆందోళనకారులకు ఆయన నచ్చచెప్పారు.

## తెలంగాణ ఉద్యమకారుల సమస్యలు పరిష్కరించాలి

- తెలంగాణ ఉద్యమకారుల(ఏజిటేటర్స్) సమితి (టియుఎస్) డిమాండ్

**జవహర్ నగర్ సెప్టెంబర్ 28 (జనంసాక్షి ) :**
జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ లో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో వెల్లడి. పాల్గొన్న వివిధ ప్రజాసంఘాలకు చెందిన నేతలు,ఉద్యమ కారులు. తెలంగాణ తొలి,మలి దశ ఉద్యమకారుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ఉద్యమ కారుల సమితి(టియుఎస్) ఉద్యమ కారులు ప్రజాసంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశాన్ని శనివారం రోజున నిర్వహించారు. భహుజన సత్త నాయకుడు,టియుఎస్ నేత బండకింది సింగరాయ గౌడ్ అధ్యక్షతన ఎస్సీ దళిత సంక్షేమ భవనంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు.

తెలంగాణ రాష్ట్రం కోసం తొలి దశలో 369 మంది,మలి దశలో సుమారు 1200 మంది అమరులైనారని, ఇంకా 400 మంది ఆచూకి తెలియలేదని అన్నారు. గత ప్రభుత్వం ఉద్యమకారులను, కళాకారులను బాగా వాడుకొని,అతి ఘోరంగా వారిని తొక్కివేశారని అన్నారు. 600 మంది ఉద్యమకారులకు కొన్ని సదుపాయాలు కల్పించి,మిగతా 600 మందిని గాలికి వదిలేశారని ఆరోపించారు. అందుకే ఉద్యమకారులు శ్రమించి బిఆర్ఎస్ ను ఓడగొట్టడానికి



కీలకపాత్ర పోషించారని స్పష్టం చేశారు.ఆర్థిక భారం పడకుండా పరిష్కరించే సమస్యలలో ఉద్యమకారులను,కళాకారులను గుర్తించి, వారికి తామ్ర పత్రాలు అధికారికంగా అందజేయాలని, ఉద్యమ కారుల బోర్డును విస్తృత ప్రాతిపదికన అధికారికంగా ఏర్పాటు చేయాలని, ఉచిత బస్ పాసులు (భార్యాభర్తలకు) ఇవ్వాలని, ప్రభుత్వం ప్రకటించే పథకాల్లో మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని, ఉద్యమకారుల కుటుంబాలకు ప్రభుత్వం అన్ని భర్తీల్లో 2% రిజర్వేషన్ కల్పించాలని అదేవిధంగా ఆర్థిక భారం పడే సమస్యలలో ఇస్తామన్న 250 గజాల ఇంటి స్థలాల్లో 4 గదుల ఇల్లు నిర్మించి ఇవ్వాలని, ఇతర రాష్ట్రాల్లో ఉద్యమకారులకు ఇస్తున్న విధంగా రూ.30,000/-గౌరవ వేతనాన్ని, పెన్షన్గా ప్రతి నెల ఇవ్వాలని,అమరవీరుల స్మృతి వనం 100 ఎకరాలలో ఏర్పాటు చేయాలని, ఉద్యమకారులకు ఆరోగ్య భీమా 20 లక్షల వరకు ఇవ్వాలని ఉద్యమకారులు ఏదైనా వ్యాపారం/వృత్తి చేసుకోవడానికి 1 కోటి రూపాయలు ఆర్థిక సహాయం అందించాలని తధితర డిమాండ్లతో పాటు స్థానిక ఉద్యమకారులు,ప్రజాసంఘాల నేతలు ప్రతిపాదించిన కొన్ని ప్రజలకు సంబందించిన మౌలిక సమస్యలు,తప్పుడు కేసులపై వెల్లడించిన న్యాయమైన, ప్రజా స్వామికమైన డిమాండ్లను టియుఎస్ నేత కల్వెపు చంద్రన్న ప్రకటించారు.

కాని ఇల్లు నిర్మించుకునే స్థితిలో ఏ ఉద్యమకారుడు లేదని, ఉద్యమంలో శారీరకంగా, మానసికంగా, ఆర్థికంగా, ఉద్యోగ పరంగా ఎంతో నష్టపోయారని పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే పరిష్కరించగలరని సూచించారు. సమావేశంలో పిడిఎం చంద్రమౌళి,పికెఎం జాన్, చైతన్య మహిళా సంఘం అల్లూరి సావిత్రి, టివిఐవి మబ్బుబాలు, ఐపిఓడబ్ల్యూ పి.సునిత,పెల్లూరి సీతక్క, జి.ఉపేంద్ర, అభ్యుదయ, కవి, కళాకారుడు ఎస్.కె.మీరా,ఇఫ్టూ శివబాబు,ఇఫ్టూ శ్రామిక స్పందన షేక్ షావలి,బీఎస్పీ యాకస్వామి,బీసినేత వడ్డెర నర్సన్న,ఏ.ఆశయ్య,పాత్రికేయ మిత్రులు విష్ణు,వేణు తధితురులు పాల్గొన్న వారిలో ఉన్నారు.

## నాగారం మున్సిపల్ సమగ్రాభివృద్ధికి కృషి : చైర్మన్ చంద్రారెడ్డి

**6కోట్ల 50 లక్షల అభివృద్ధి పనులకు కౌన్సిల్‌లో తీర్మానం**





**కీసర, సెప్టెంబర్ 28 (జనంసాక్షి) :** నాగారం మున్సిపల్ సమగ్రాభివృద్ధికి పార్టీలకతీతంగా కృషి చేస్తున్నానాని చైర్మన్ చంద్రారెడ్డి అన్నారు. శనివారం నాగారం పురపాలక సంఘం కార్యాలయం నందు మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అధ్యక్షతన సాదరణ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో 20 వార్డులలో అభివృద్ధి పనులకు గాను 6కోట్ల 50 లక్షలకు సిసి రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, ఇతర పనులకు తీర్మానం చేశామని చైర్మన్ తెలిపారు. ఈ సమావేశం నందు మున్సిపాలిటీ చైర్మన్ మాట్లాడుతూ.. కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, ప్రతి ఒక్కరూ నాగారం పురపాలక సంఘ అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ మల్లేష్ యాదవ్, మున్సిపల్ కమిషనర్ జి.రాజేందర్ కుమార్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ మేనేజర్ కె.చంద్రశేఖర్, డిప్యూటీ ఇంజనీర్ సుదర్శనం రఘు, అసిస్టెంట్ ఇంజనీర్ నరేష్ మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## మియాపూర్ డివిజన్ అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టండి : కార్పొరేటర్ శ్రీకాంత్

**శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 28 (జనంసాక్షి) :**
నియోజకవర్గం మియాపూర్ డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాల్సిన అవసరం ఉందని డివిజన్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ పేర్కొన్నారు. ఇందులో భాగంగా పలు ప్రాంతాలలో పరిష్కరించవలసిన పలు సమస్యలు, చేపట్టాల్సిన పలు అభివృద్ధి



కార్యక్రమాల నిమిత్తం శనివారం జలమండలి కార్యాలయానికి వెళ్లి అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా జలమండలి డిజిఎం వెంకటేశ్వరరావు, మేనేజర్ సునీతను కలసి హలో అంశాలనుగూర్చి వివరించారు. మియాపూర్ డివిజన్లో డ్రైనేజీ సమస్యలు చాలా కాలంగా పెండింగ్ లో ఉన్నాయని, వాటిని పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. డివిజన్ పరిధిలో పెరుగుతున్న ప్రజానీకానికి అనుగుణంగా డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో నూతన డ్రైనేజీ వ్యవస్థను పునరుద్ధరించడం, పాత వాటిని మరింత మెరుగుపరచాల్సిన అవసరం ఉందని అన్నారు. చాలా ప్రాంతాలలో తాగునీటి సమస్య కూడా ఉందని, దీనిపై కూడా ప్రత్యేక దృష్టిని సారించడం ద్వారా నేటి సరఫరాకు అనుగుణంగా నూతన పైప్ లైన్ వ్యవస్థ, పాతపాటి స్థానంలో మరమ్మతులు చేపట్టి కొత్త పైప్ లను అమర్చాల్సిన అవసరాన్ని తెలియజేశారు. మియాపూర్ డివిజన్ పరిధిలో తాగునీటి అవసరం పెరిగిపోయిందని, రోజువారి అవసరాలకు అనుగుణంగా నీటి సరఫరాను పునరుద్ధరిస్తే బాగుంటుందని కార్పొరేటర్ జలమండలి అధికారులను కోరారు.



### ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ నుండి బెస్ట్
## పెర్ఫార్మన్స్ అవార్డు అందుకున్న కొల్లు అశోక్ రెడ్డి

**శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 26 (జనంసాక్షి) :** ప్రముఖ మోటివేటర్ గంప గోవర్ధన్ నేతృత్వంలో స్థాపించబడిన ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ సంస్థ నుండి హాలియా మండలం పులిమామిడి గ్రామానికి చెందిన కొల్లు కొండల్ రెడ్డి తనయుడు కొల్లు అశోక్ రెడ్డి బెస్ట్ పెర్ఫార్మెన్స్ అవార్డును గురువారం అందుకున్నాడు. మాస్టర్ మోటివేటర్ అండ్ ఇంపాక్ట్ ఫౌండర్ గంప నాగేశ్వర్ రావు ఫౌండేషన్ లో నిర్వహించిన ట్రెయిన్ ద ట్రైనర్ వర్క్ షాప్ 170 బ్యాచ్ లో కొల్లు అశోక్ రెడ్డి ఆన్లైన్ ద్వారా శిక్షణ తీసుకొని 30 రోజులు, ఆఫ్ లైన్ లో రెండు రోజులు ( సెప్టెంబర్ 21, 22న) శిక్షణను స్వీకరించడం ద్వారా కోర్సును విజయవంతంగా పూర్తి చేసుకొని సర్టిఫికెట్ తో పాటు బెస్ట్ పర్ఫార్మెన్స్ అవార్డును ఎఫ్2 మూవీ ఫేమ్ ప్రదీప్ చేతులమీదుగాఅందుకోవడం జరిగింది. భవిష్యత్తులో హాలియా మండలంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో పిల్లలకు ఉచితంగా వ్యక్తిత్వ వికాస తరగతులు బోధిస్తానని ఈ సందర్భంగా అశోక రెడ్డి మాటిచ్చారు. ఈ అవార్డు అందుకోవడానికి సహకరించిన ఇంపాక్ట్ స్ఫూర్తి ఫౌండర్ శ్యామ్ రాథోడ్ కు, మెంటార్స్ అయిన వెంకటేష్ ప్రసాద్ (హెడ్ కానిస్టేబుల్ ఎల్బి నగర్), హైమావతి మేడం, ఇతర మెంటర్స్, ఇంచార్జ్‌లకు, ప్రత్యేకించి సంస్థ ఫౌండర్ గంప నాగేశ్వరరావుకు అశోక్ రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

### ఓటర్ జాబితా విడుదల

**కొడంగల్:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు గ్రామపంచాయతీ ఓటర్ల ముసాయిదా జాబితాఫోటోలతో కూడిన తుది ఎన్నికల ఓటర్ జాబితాను 26 తేదిన వివిధ గ్రామ పంచాయ తీలకు సంబంధిం చినవి విడుదల చేయడం జరిగిందని ఎంపీడీవో ఉషశ్రీ తెలిపారు.

## కమిషనర్ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలి

- యూనియన్ సీనియర్ నాయకులు నాగార్జునపు రాం
- కమిషనర్ ఆమ్రపాలి గోడలపై పెయింటింగ్ వాల్ రైటింగ్స్ పై నిషేధించడం సబబు కాదు
- తెలంగాణ గ్రేటర్ హైదరాబాద్ పెయింటింగ్ ఆర్టిస్ట్ యూనియన్ ఆవేదన

**ఎల్బీనగర్, సెప్టెంబర్ 28 (జనం సాక్షి) :**
..గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో గోడలపై పెయింటింగ్ వాల్ రైటింగ్స్ పై నిషేధంవిధించడంపై ఎల్బీనగర్ కు చెందిన ప్రముఖ సీనియర్ చిత్రకారులు తెలంగాణ ఆర్టిస్టు యూనియన్ నాయకులు నాగార్జునపు రాము ఆవేదన వ్యక్తం చేశారు ..ఆ పెయింటింగ్ చిత్రకారులకు ఫ్లెక్సీ, డిజిటల్ మీడియా వలన పనులు లేకఅప్పుడప్పుడు ఏదో ఒక పని చేసుకుంటూ వచ్చిన అరకొర ఆదాయంతోకుటుంబాన్నిపోషించుకుంటున్న ఈ సమయంలో కమిషనర్ కఠిన నిర్ణయంతో మాలో భయాందోళనలు మొదలయ్యాయి అని ఆవేదన వెలిబుచ్చారు. గోడలపై వాల్ పెయింటింగ్స్, రైటింగ్ పై నిషేధం విధిస్తే మేము ఏం చేయాలి మాకు రోడ్లపై అడుక్కునే పరిస్థితి వస్తుందని తీవ్ర ఆవేదన వ్యక్తపరిచారు ఈ సందర్భంగా యూనియన్ నాయకులు తదుపరి



కార్యాచరణ పై చర్చ గోష్టికార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు వర్కింగ్ ప్రెసిడెంట్ డివి రమణ, అధ్యక్షులు యాకయ్య ,అల్వాల్ రెడ్డి, నాగరాజు, కమల్, పర్వేజ్, కందుకూరు నవీన్, తదితర యూనియన్ నాయకులు కళాకారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ కమిషనర్ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని లేనియెడల కమిషనర్ ఆఫీస్ ఎదుట ధర్నా చేయడానికి నిర్ణయం తీసుకుంటామని తెలియజేశారు.

## వికారాబాద్ రైల్వే ఆసుపత్రి దగ్గర ఎండిన గంజాయి స్వాధీనం

### ఒకరి అరెస్టు రిమాండ్

**వికారాబాద్ జిల్లా బ్యూరో (జనం సాక్షి):** విశ్వంయ సమాచారం మేరకుజిల్లా మధ్య నిషేధ మరియు అబ్కారీ అధికారి విజయభాస్కర్ ఆదేశాల మేరకు అసిస్టెంట్ ఎక్సైజ్ సూపర్డెంట్ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం దాడులు నిర్వహించారు సాయంత్రం సమయంలో రైల్వే హాస్పిటల్ పరిసర ప్రాంతంలో వికారాబాద్ (విఎం) ఎండు గంజాయి అమ్ముచున్నారూ విశ్వ సనీయమైన సమాచారం మేరకు వికారాబాద్ జిల్లా ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్, మరియు ఎక్సైజ్ స్టేషన్ వికారాబాద్ బృందాలు దాడులు



నిర్వహించారు ఇట్టి దాడులలో వజీద్ ,తండ్రి గఫార్,వయసు ( 32) వాడి తాలూక కర్ణాటక రాష్ట్రం వ్యక్తి దగ్గర సోదాలు నిర్వహించగ 176 గ్రాముల ఎండు గంజాయి లభించినది తదుపరి ఇట్టి వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు డిస్ట్రిక్ట్ టాస్క్ ఫోర్స్ సీఐ శ్రీనివాస్, సీఐ రాఘువీణ , తెలిపినారు ఇట్టి దాడులలో ఎస్సైలూ బి.ప్రేమ్ కుమార్ రెడ్డి . శ్రీనివాస్ మరియు వారి యొక్క సిబ్బంది విష్ణువర్ధన్ రెడ్డి,హనుమంతు, శివ ప్రసాద్ పాల్గొన్నారు

# సమస్యల పరిష్కారానికే.. పదవి అధికారాన్ని ఉపయోగిస్తా..

## ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం



**సూర్యాపేట ప్రతినిధి(జనంసాక్షి):** ఎమ్మెల్సీ పదవి అనేది అధికార దర్పణం కొరకు కాకుండా సమస్యల పరిష్కారానికి ఉపయోగకరంగా ఉంటుందని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని జె ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన ప్రజా పౌర సంఘాలు, ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలు, ఉద్యమకారులతో జరిగిన ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. వివిధ వర్గాల ప్రజలు, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.ఎమ్మెల్సీగా అయిన నాటి నుంచి అందరూ శాలువలు పుష్పగుచ్చాలతో సన్మానాలు చేస్తున్నారని, అలాంటి సన్మానాలు కాకుండా దస్రాలతో తనతో చర్చించాలని కోరారు.ఈ ప్రభుత్వంలో తెలంగాణ ఉద్యమకారులకు ప్రత్యేక గుర్తింపు వస్తుందని,గత కొన్నేళ్లుగా తెలంగాణ నేను మాత్రమే తెచ్చానని చెప్పుకొని రావడం వలన ఉద్యమకారులంతా కనుమరు అయిపోయారని, మరలా ఇప్పుడు అందరం.. ఇలా ఉద్యమకారులుగా చెప్పుకునే అవకాశం ఈ ప్రభుత్వంలో కలిగిందన్నారు. ఖచ్చితంగా మలిదశ, తొలిదశ ఉద్యమకారులందరికీ ప్రభుత్వం నుండి ప్రత్యేక గుర్తింపు వచ్చే విధంగా కృషి చేస్తానన్నారు.తెలంగాణ విద్యావంతుల వేదిక జిల్లా బాధ్యులు, మలిదశ తెలంగాణ ఉద్యమకారులు తండు నాగరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షులు అంబటి నాగయ్య, ఉపాధ్యాయ సంఘం నాయకులు రేపాక లింగయ్య, సింహాద్రి, పేరం ముత్తయ్య, ముప్పాని కృష్ణారెడ్డి, పుప్పాల వీరన్న, 1969 తొలి దశ ఉద్యమకారుల సంఘం అధ్యక్షులు బొమ్మిడి లక్ష్మి నారాయణ, టీఎన్జీవోస్ జనరల్ సెక్రటరీ శ్యామ్, సామాజిక ఉద్యమకారులు డాక్టర్ ఊర రామ్మూర్తి యాదవ్ , మలిదశ ఉద్యమకారుల సంక్షేమ సంఘం నాయకులు రమేష్, అమర వీరుల కుటుంబాల వేదిక నాయకులు, సిద్ధారెడ్డి, మాల మహానాడు రాష్ట్ర నాయకులు తలమల్ల హుస్సేన్, లెక్చరర్ ఫోరం జిల్లా అధ్యక్షులు తన్నీరు ఉపేందర్, వివిధ సంఘాల నాయకులు పాల్గొని పలు సమస్యలపై ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాంతో చర్చించి వినతి పత్రాలు సమర్పించారు.

# ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఆకస్మిక పరిశీలన

## సీడీఎస్ కొరకు స్థల పరిశీలన...

## సదరన్ సర్టిఫికెట్ల అక్రమాలపై విచారణకు ఆదేశం

## జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్





**సూర్యాపేట ప్రతినిధి(జనంసాక్షి):** జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ శనివారం ఆకస్మికంగా సందర్శించారు.ఓపి రిజిస్టర్, ఏఎంసి వార్డులను పరిశీలించారు. టీ హబ్ పరిశీలించి సిబ్బంది వివరాలు, రక్త పరీక్షల కేంద్రాన్ని, రేడియాలజీ ఆల్ట్రా స్కాన్ రోజుకు ఎన్ని జరుగుచున్నవో వివరాలను అడిగి తెలుసుకున్నారు. సెంట్రల్ డ్రగ్ స్టోర్ కొరకు స్థలాన్ని పరిశీలించారు.త్వరలో సూర్యాపేటలో కూడా సెంట్రల్ డ్రగ్ షోరూం ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు.సదరన్ క్యాంప్ సర్టిఫికెట్ల విషయంలో పలు ఆరోపణలు వస్తున్నాయని, అక్రమాలపై విచారణకు ఆదేశించినట్టు తెలిపారు.సదరన్ క్యాంపు నిర్వహణ సర్టిఫికెట్ల జారీ రిజిస్టర్ ను పరిశీలించారు.

# మాదకద్రవ్యాల రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

## నల్లగొండ జిల్లా గంజాయి,మాదక ద్రవ్యాల వినియోగ నిర్మూలనే లక్ష్యంగా మిషన్ పరివర్తన్ కార్యక్రమం ద్వారా సత్ఫలితాలు: జిల్లా యస్పీ శరత్ చంద్ర పవార్



**నల్గొండటౌన్, సెప్టెంబర్ 28(జనంసాక్షి)** నల్లగొండ జిల్లాను డ్రగ్ రహిత సమాజమే లక్ష్యంగా జిల్లాలో జరుగుతున్న నేరాలపై సమగ్ర విశ్లేషణ చేసి వాటికి మూలమైన గంజాయిని సమూలంగా నిరోధించాలని దృఢ సంకల్పంతో మాదక ద్రవ్యాల నిర్మూలనలో భాగంగా నల్లగొండ జిల్లా పోలీస్ మిషన్ పరివర్తన్ అనే వినూత్న కార్యక్రమం చేపట్టి గంజాయి రహిత నల్లగొండగా తీర్చిదిద్దాలని గంజాయి అక్రమ రవాణా,విక్రయం మరియు వినియోగంపై దృష్టి సారించి జిల్లా సరిహద్దు మార్గాలలో మరియు అంతరాష్ట్ర, అంతర్ జిల్లా చెక్ పోస్టు లు ఏర్పాటు చేసి గంజాయి పై గట్టి నిఘా పెట్టి కట్టడి చేయడం జరిగింది. ప్రతి పోలీసు స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టుల మాదిరిగా గాంజా టెస్టింగ్ కిట్లు ద్వారా టెస్టుల చాలా మందికి టెస్టులు చేయగా వీరిలో గంజాయి సేవించి పట్టుబడిన దాదాపు 327 మంది పట్టుబడ్డారు. వీరందరికి సైకియాట్రిస్ట్ డాక్టర్ల ద్వారా గాంజా సేవించడం వల్ల కలిగే అనర్ధాలు నష్టాలు, ఆర్థిక,ఆరోగ్యం పై పడే ప్రభావం ల గురించి వారిలో మార్పు తీసుకురావడం కొరకు వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సిలింగ్ ఇచ్చి మళ్ళీ వీరందరికి రెండవ సారి పరీక్ష నిర్వహించగా 321 మందికి నెగిటివ్ వచ్చింది. మిగతా 6 గురికి మాత్రమే పాజిటివ్ రాగా వీరికి కామినేని హాస్పిటల్ నందు డి అడిక్షన్ సెంటర్ కి పంపి ట్రీట్మెంట్ మరియు కౌన్సిలింగ్ ఇవ్వడం జరుగుతుంది.మిషన్ పరివర్తన్ కార్యక్రమంలో బాగంగా నల్లగొండ జిల్లాను గంజాయి/ మాదకద్రవ్యాల వినియోగ నిర్మూలనే లక్ష్యంగా చేపడుతున్న కార్యక్రమాలు గంజాయి/ మాదక ద్రవ్యాల పైన అవగాహన సదస్సు, మిషన్ పరివర్తన్ కార్యక్రమంలో బాగంగా గంజాయి/ మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్ధాలు నష్టాలు, దుష్పరిణామాలపై షార్ట్ ఫిల్మ్ ద్వారా జిల్లా వ్యాప్తంగా 471 పాఠశాలలు, కళాశాలలో దాదాపు 20 వేల మంది విద్యార్థిని, విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహించడం జరిగింది.గంజాయి వినియోగ దారులు పైన నిఘా,గంజాయి వినియోగదారులు/ చిరు వ్యాపారులు పైన నిఘా పెడతూ, 327 మందిని పట్టుకొని వారిలో అలవాటుగా వ్యాపారం చేస్తూ సరఫరా చేసే 21 మంది పైన కేసు నమోదు చేసి జైలుకి తరలించి హిస్టరీ షీట్ ఓపెన్ చేయడం జరిగింది. విలేజ్ పోలీసు ఆఫీసర్ ద్వారా గ్రామీణ ప్రాంతాలలో అవగాహన,జిల్లాలో మారుమూల ప్రాంతాల్లో గంజాయి వినియోగం పై కలిగే నష్టాలు పైన జిల్లాలోని ఇప్పటి వరకు 1783 గ్రామాలలో సందర్శించి పాఠశాల విద్యార్థులకు మరియు ప్రజలకు పోలీసు కళా బృందాల ద్వారా, వీడియోలు, వాల్ పోస్టర్స్ ద్వారా అవగాహన కల్పించడం జరిగింది.గంజాయి అక్రమ రవాణా పైన ఉక్కుపాదం,జనవరి 2024 నుండి ఇప్పటివరకు 31 కేసులలో 131 మందిని జైలుకి తరలించి ఒక కోటి తొంబై లక్షల విలవ గల 771 కేజీల గంజాయిని సీజ్ చేయడం జరిగింది. అంతే కాకుండా గతం లో సీజ్ చేసిన గంజాయి ని జిల్లా డ్రగ్ డిస్ట్రక్షన్ కమిటీ ఆధ్వర్యంలో 5036 కేజీల గంజాయిని నిర్వీర్యం చేయడం జరిగింది.

# వాల్టా చట్టం పై అవగాహన చర్యలు చేపట్టాలి

- క్వాలిటీతో వేగంగా పరిష్కరించాలి
- ధరణి దరఖాస్తులలో అన్ని వివరాలను పరిశీలించాలి
- కలెక్టర్ హనుమంత్ కె జెండగే



**భువనగిరి కలెక్టరేట్ , సెప్టెంబర్ 28 (జనం సాక్షి)** భూగర్భ జలాల పరిరక్షణలో భాగంగా వాల్టా చట్టంపై అవగాహన చర్యలు చేపట్టాలి, అని జిల్లా కలెక్టర్ హనుమంతు కే.జండగే ఆదేశించారు.శనివారం నాడు కాన్ఫరెన్స్ హాలులో ఆయన రెవిన్యూ డివిజనల్ అధికారులు, తహసీల్దారులు, మున్సిపల్ కమిషనర్లతో ధరణి, ప్రజావాణి దరఖాస్తులు, వాల్టా చట్టంపై సమీక్షించారు. ధరణి దరఖాస్తులలో అన్ని వివరాలను పరిశీలిస్తూ క్వాలిటీతో వేగంగా పరిష్కరించాలని సూచించారు.ధరణి ఫైళ్ల పరిష్కారం క్వాలిటీతో పూర్తి కావాలని, మీయొక్క రిమార్కులు, రికమెండేషన్లు క్లియర్ గా ఉండాలని, ప్రతి దరఖాస్తుకు సంబంధించిన సర్టిఫికెట్లతో ఫైల్స్ సర్క్యూలేట్ చేయాలని సూచించారు. కుల, ఆదాయ ధృవీకరణ పత్రాల జారీ విషయంలో పెండింగ్ లేకుండా చూడాలని, ప్రజలకు, విద్యార్థులకు కావలసిన పత్రాల జారీలో ఎలాంటి అలసత్వం, ఆలస్యం కావద్దని, కింది స్థాయి సిబ్బంది పనులను పర్యవేక్షించాలని ఆదేశించారు. రాష్ట్ర స్థాయి ప్రజాభవన్ నుండి వచ్చిన ప్రజల సమస్యలను, జిల్లా స్థాయిలో వచ్చిన ప్రజావాణి దరఖాస్తులను నిబంధనల ప్రకారం తక్షణ పరిష్కారం చేపట్టాలని, పెండింగ్ లేకుండా చూడాలన్నారు. మండలాలలో కొత్తగా గుర్తించిన విద్యుత్ సబ్ స్టేషన్ల కోసం, అలాగే ఆరోగ్య కేంద్రాలకు సంబంధించిన సబ్ సెంటర్ల కోసం స్థలాలను గుర్తించాలని తహసీల్దార్లకు సూచించారు.భూగర్భ జలాల పరిరక్షణ వాల్టా చట్టంపై గ్రామాలు, అర్బన్ ప్రాంతాలలో అవగాహన కలిగించాలని జిల్లా కలెక్టరు తెలిపారు.లి భూగర్భ జలాల పరిరక్షణ దిశగా 2002 సంవత్సరంలో వచ్చిన వాల్టా చట్టం ననుసరించి వ్యవసాయం, పరిశ్రమలు, ఇండ్ల అవసరాలు, కమర్షియల్ అవసరాలకు బోరుబావులు వేయాలంటే తప్పనిసరి అనుమతులు పొందాలని, గ్రామాలకు సంబంధించి తహశీలుదారు, అర్బన్ స్థాయిలో మున్సిపల్ కమీషనర్ల నుండి అనుమతులు పొందాలని తెలిపారు. పరిశ్రమలు, అపార్ట్మెంట్లలో నీటి వినియోగం నిబంధనల మేరకు నడుచుకోవాలని, నీరు వాడుకునే విధానంపై నియంత్రణ ఉండాలని, అవసరమైన రుసుము ప్రభుత్వానికి జమ చేయాలని తెలిపారు.కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ పి.బెన్ షాలోమ్, భువనగిరి రెవిన్యూ డివిజనల్ అధికారి అమరేందేర్, చౌటుప్పల్ రెవిన్యూ డివిజనల్ అధికారి శేఖర్ రెడ్డి, జిల్లా భూగర్భజల శాఖ డిప్యూటీ డైరెక్టర్ జ్యోతి కుమార్, తహసీల్దార్లు, మునిసిపల్ కమీషనర్లు అధికారులు పాల్గొన్నారు.

# రాజీ మార్గమే.. రాజ మార్గం..

## ఫర్హీన కౌసర్.. జూనియర్ సివిల్ జడ్జి



**తుంగతుర్తి సెప్టెంబర్ 28 (జనంసాక్షి):** కక్షిదారులకు లోకదాలత్ లో రాజీమార్గమే రాజ మార్గంగా ఉపయోగపడుతుందని కక్షిదారులు ఆ దిశగా అడుగు వేయడం సంతోషకరమని తుంగతుర్తి జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఫరిహీన కౌసర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో జూనియర్ కోర్టులో మండల న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో మాట్లాడారు. లోక్ అదాలత్ అందరికీ రాజీ మార్గాన్ని కుదిరించే ఒక ఆయుధమని అన్నారు. సమాజంలో కొన్ని పరిస్థితుల్లో చిన్నచిన్న గొడవలు జరగడం సహజమని వాటిని పరిష్కరించుకోవడం కోసం పంథాలకు పోవద్దని అన్నారు. దీనివల్ల వ్యక్తులలో వైరుధ్యాలు ఏర్పడతాయని దీనివల్ల వ్యక్తుల మనసులకు ప్రశాంతత కొరవడుతుందని అన్నారు. లోకదాలతో ఇరువురు రాజీమార్గం అనుసరించినట్లయితే కేసులు పరిష్కరింపబడి అందరూ కలిసిమెలిసిగా స్నేహపూర్వకంగా ఉండటానికి అవకాశం ఉంటుందన్నారు దీనివల్ల మనుషులకు ప్రశాంతతమైన జీవితాన్ని కొనసాగించవచ్చని అన్నారు లోకదాలతో రాజీ పడడం వల్ల డబ్బులు సమయాన్ని వృధా చేయకుండా సామరస్యంగా కక్షిదారులు సమస్యను పరిష్కరించుకోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు తాళ్లపల్లి సత్యనారాయణ. సభ్యులు బానోతు సతీష్. అనిల్ కుమార్ యాదవ్. న్యాయవాదులు కారింగుల వెంకటేశ్వర్లు. చంద్రమౌళి. గుగులోతు రాజారాం. మల్లెపాక రవికుమార్. వజీర్. నాగరాజు. మహేష్ సిఐలు శ్రీను నాయక్. రఘువీర్ రెడ్డి. ఎస్సై ఏడుకొండలు. కోర్టు సూపరింటెంట్ శ్రీనివాస్ బెంచ్ క్లర్క్ అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

# బాధితులకు అండగా ఉంటా..

## మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి



**సూర్యాపేట ప్రతినిధి (జనంసాక్షి):** సద్దుల చెరువు బాధితులందరికి అండగా ఉంటామని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి అన్నారు.శనివారం జిల్లా కేంద్రంలోని 42, 43వ వార్డులలో పర్యటించి మాట్లాడారు. ఎంతో కష్టపడి ఇల్లులు కట్టుకున్న పేదవాళ్ల ఇండ్లను కూలగొట్టడం సీఎం రేవంత్ రెడ్డికి కరెక్టు కాదని అన్నారు.పేదవాళ్లు రూపాయి రూపాయి వెనకేసుకుని సొంత నివాసాన్ని ఏర్పాటు చేసుకున్నారని అన్నారు. పేదవాళ్ల ఇండ్లు కూలగొడుతుంటే చూస్తూ ఊరుకోమన్నారు.ఇవన్నీ కూడా గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఇండ్లేనని, మరలా అదే ప్రభుత్వం వచ్చి ఇళ్లను కూలగోడుతున్నారని అన్నారు. ఇండ్లు రిజిస్ట్రేషన్ చేయించుకుని, మున్సిపల్ నల్ల కలెక్షన్లు ఏర్పాటు చేసుకొని, రోడ్లు వేయించుకొని ఒక వీధినే ఏర్పాటు చేసుకున్న వాళ్లను హైడ్రా పేరుతో రోడ్డున పడేయడం సరికాదన్నారు. త్వరలోనే ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని, వారితో మాట్లాడి భాదిత వార్డ్ ప్రజలకు ఎటువంటి అన్యాయం జరగకుండా చూస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ పెరుమాళ్ళ అన్నపూర్ణ,వైస్ చైర్మన్ పుట్ట కిషోర్ కుమార్,మున్సిపల్ కో ఆప్షన్ మెంబర్ బత్తుల ఝాన్సీ రమేష్,కౌన్సిలర్ పల్సా మహాలక్ష్మి మాల్సూర్,నాయకులు జీడి బిక్షం, గండూరి ప్రకాష్, సంజీవ్ నాయక్, అంగిరేకుల నాగార్జున, గాలి సాయి, భాష, జహీర్, గుర్రం సత్యనారాయణ రెడ్డి, వంగాల శ్రీనివాస్ రెడ్డి, జీవన్ రెడ్డి, అనిల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# వరదలతో నగరవాసుల కష్టాలు నష్టాలపరిష్కార దిశ..

## హైడ్రా బావి తరాలకు భవిష్యత్తు

- నిర్వాసితులకు జీవనోపాధి కల్పన 15 రోజులలో కార్యాచరణ ప్రణాళిక
- వరదలతో నష్టపోయి ప్రభుత్వ సహాయం కోసం ఎదురు చూస్తే దౌర్భాగ్య పరిస్థితి రావద్దు
- విద్యార్థుల చదువులకు ఆటంకం లేకుండా చూస్తాం
- ఆ రోజు కేసీఆర్ చెప్పి చేయలేనిది.. రేవంత్ రెడ్డి చేస్తున్నారు..
- హరీష్ రావు, కె టి ఆర్ ల వి పచ్చి అబద్దాలు
- భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి

**భువనగిరి కలెక్టరేట్, సెప్టెంబర్ 28 (జనంసాక్షి):** ప్రతి యేడు వరదలతో హైదరాబాద్ నగరము నష్టాలు ఇబ్బందులు ల పరిష్కారం దిశలోనే సీఎం రేవంత్ రెడ్డి హైడ్రా తీసుకువచ్చారని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.హైడ్రా పనితీరుపై 80 శాతం ప్రజలు స్వాగతిస్తున్నట్లు తెలిపారు. గత పది సంవత్సరాలుగా రాజకీయ అండతో కబ్జా చేసిన 20 శాతం మాత్రమే వ్యతిరేకిస్తున్నారు అన్నారు.నాళాలు, చెరువుల మీద 28 వేల అక్రమ కట్టడాలు ఉన్నట్లు తెలిపారు .వాటిని కూల్చితే తప్ప హైదరాబాద్ మనుగడ సాగించలేదని, అందుకు మీడియా తో పాటు, ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. సమస్య పట్లనాడు సీఎం హోదాలో కేసీఆర్ మాట్లాడగా, ప్రస్తుతం ఆయన కొడుకు కేటీఆర్, అల్లుడు హరీష్ రావ్ మాట్లాడుతున్న తీరు విడ్డూరంగా ఉందన్నారు. అధికారంలో ఉన్న పదేండ్ల కాలంలో మూసీ ప్రక్షాళన కోసం పట్టించుకోలేదు అని చెరువులు కుంటలు అక్రమణ ల నుంచి కాపాడ లేకపోయారు విమర్శించారు.కేసీఆర్ ఆనాడు అసెంబ్లీలో అక్రమ కట్టడాల పర్మిషన్లు లేని భవనాల పట్ల కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని అసెంబ్లీలో మాట్లాడిన తీరును గుర్తు చేశారు. కేసీఆర్ కి రేవంత్ రెడ్డి కి ఉన్న తేడా ఏమిటో తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారు అన్నారు.ప్రజల ముందు ప్రగల్భాలు పలకడం నాలుగు గోడల మధ్యలో చర్చలు పెట్టడం కాదు చెప్పిన పనిని ఇచ్చే హామీని నెరవేర్చడమే మా మా ప్రభుత్వం లక్ష్యం అన్నారు.అందుకు ఉదాహరణగా నాడు దేవతలు అమృతం కోసం పాలసముద్రాన్ని చిలికే క్రమంలో ముందుగా విషం వచ్చింది విషం రాగానే దేవతలు చిలకడ ఆపలేదు అమృతం వచ్చేవరకు క్షీరసాగర మధనం చేశారు అనే కథ అంశాన్ని వివరించారు.చరిత్ర లో హైదరాబాదును లేక్ సిటీ గానే ఉంచాలనేదే సీఎం లక్ష్యం. భాగ్యనగరం లో నివసిస్తున్నటు వంటి ప్రజలు ప్రతి సంవత్సరం వర్షాకాలంలో వరదలతో ఇబ్బందులు ఎదుర్కొని, ఇంట్లో వస్తువులు కరవై ప్రభుత్వం చేసే సహాయం కోసం ఎదురుచూసే దౌర్భాగ్య. పరిస్థితి రావద్దని ముఖ్యమంత్రి ముందుచూపుతో సంకల్ప దీక్ష అభివర్ణించారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ పది సంవత్సరాలలో ప్రతి సంవత్సరం వరదలతో తీవ్ర నష్టం ఎదుర్కొంటుందన్నారు. దీనికి ఒక పరిష్కార మార్గం చూపాలని సీఎం రేవంత్ రెడ్డి ఆలోచన ఉన్నారు.వర్షాలతో వరదలతో హైదరాబాద్ ప్రజలు నష్టపోవద్దని ఉద్దేశంతోనే హైడ్రాను తీసుకొచ్చారు సీఎం తీసుకున్న సాహసోపేతమైన నిర్ణయం ప్రజల స్వాగతిస్తున్నారు అన్నారు.

గత పది ఏండ్లు మీరు చిత్తశుద్ధితో పరిపాలన చేస్తే ఈరోజు ఈ పేద ప్రజలు అన్యాయ మయ్యే వాళ్ళు కాదు ఆవేదన చెందారు.హైడ్రా వల్ల రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని భయంతోనే బి ఆర్ ఎస్ ఇలా చేస్తున్నారు. హైదరాబాద్ భవిష్యత్తు గురించి ఆలోచన చేయాలని ప్రతిపక్షాలు సూచించారు.

**మూసి ప్రక్షాళన గురించి..**

మూసీ ప్రక్షాళన కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందని తెలిపారు.

ఇప్పటికే 15 వేల దాకా డబుల్ బెడ్రూం ఇండ్ల కేటాయింపు నది పరివాహక ప్రాంతాల్లోని చారిత్రక కట్టడాలను టూరిస్టు ప్లేసులుగా తీర్చు దిద్దుతాం అన్నారు.

మూసీ నది ప్రక్షాళన కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్నది

మూసి నిర్వాసితులకు 15 రోజుల్లోగా ఉపాధి కల్పిస్తాం

నది పరివాహక ప్రాంతంలోని చారిత్రాక భవనాలను టూరిస్టు ప్లేసులుగా తీర్చిదిద్దుతాము

హైదరాబాద్ సంస్కృతిని ప్రతిబింబించే కట్టడాల పరిరక్షణ చేస్తాం తెలిపారు.

మూసి నిర్వాసితులకు జీవనోపాధి కల్పన కు 15 రోజుల్లో కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేస్తున్నం వివరించారు.

విద్యార్థుల చదువులకు ఆటంకం లేకుండా తగిన చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.

రాష్ట్రంలో సంక్షేమంతో పాటు పర్యాటక రంగాన్ని కూడా ముందుకు తీసుకెళ్తామని మా సీఎం కృత నిశ్చయంతో ఉన్నట్లు వివరించారు .

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కార్పొరేషన్లను టై అప్ చేసి అర్హులకు పథకాలు స్టూడెంట్లకు అకడమిక్ ఇయర్ డిస్టర్బ్ కాకుండా తరలింపు ప్రక్రియ ఎన్జీవోల సహకారంతో స్కూళ్లమ్యాపింగ్.. స్టూడెంట్లకు అడ్మిషన్స్ అత్యంత పారదర్శకంగా తరలింపు.. పునరావాస ప్రక్రియ పూర్తి చేరినట్లు వెల్లడించారు.

జీవనోపాధి కల్పన పై ప్రత్యేక దృష్టి ప్రతి నిర్వాసిత కుటుంబం జీవనోపాధుల పై సర్వే చేపట్టినట్లు పేర్కొన్నారు.

మహిళలకు బ్యాంకుల ద్వారా వడ్డీలేని రుణాలు అందేలా చూస్తాము అని

ఇష్టమైన వృత్తి చేప ట్టేందుకు సహకారం అందిస్తాము ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది అన్నారు.

హైదరాబాద్ భవిష్యత్తు కోసం ప్రభుత్వం చేపడుతున్న ఈ ప్రాజెక్టు అమలుకు నిర్వాసిత కుటుంబాలు సహకారం అందించాలి

నిర్వాసిత కుటుంబాల్లో విద్యార్థులు ఉంటే వారి విద్యా సంవత్సరానికి ఆటంకం లేకుండా తరలింపు ప్రక్రియ చేపడతాము

సోషల్ మీడియా ద్వారా కొంత మంది ప్రజలను రెచ్చగొడుతున్నారని, ఆందోళనలు, అల్లర్లు సృష్టించేలా పోస్టులు పెడ్తున్నారని, అలాంటివాళ్లపై కఠిన చర్యలు తప్పవు హనీ హెచ్చరించారు

హైదరాబాద్ లోని పలు పురాతన మెట్ల బావుల పునరుద్ధరణ కోసం సీఐఐతో రాష్ట్ర పర్యాటక శాఖ ఒప్పందం కుదుర్చుకుంది అన్నారు .

గత ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా నగరం లోని అనేక చారిత్రక కట్టడాలు శిథిలావస్థకు చేరుకున్నాయి

నగరంలో పురాతన మెట్ల బావులను పునరుద్ధరించాలని పారిశ్రామికవేత్తలు దత్తత తీసుకున్నట్లు తెలిపారు.పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దడానికి పారిశ్రామికవేత్తలు ముందుకు వచ్చారు అని సీఎం రేవంత్ రెడ్డికి వారు ఒప్పంద పత్రాలు అందజేశారు వెల్లడించారు.



# మీరు ఆధార్ అప్డేట్ చేశారా!?

- ఆధార్ అప్డేట్ చేయకపోతే ఇకపై పనిచేయవా!?
- డిసెంబర్ 14తో అప్డేట్ చేయని ఆధార్ కార్డులు తొలగించబడతాయా!?



**బయ్యారం, సెప్టెంబర్28(జనంసాక్షి):** ఆధార్ కార్డుకు సంబంధించి ఇప్పుడు ఒక వార్త చక్కర్లు కొడుతోంది.డిసెంబర్ 14 లోపు ఆధార్ కార్డు వివరాల్ని అప్డేట్ చేసుకోకుంటే..అవి పనిచేయబోవని వార్తలు సోషల్ మీడియాలో వ్యాప్తి చెందుతున్నాయి.అయితే ఇది నిజమేనా? ఆలోపు అప్డేట్ చేసుకోకుంటే ఆధార్ కార్డులు పనిచేయవా? దీనిపై యూఐడీఏఐ (ఉడాయ్) వివరణ ఇచ్చింది. భారతీయులకు ఆధార్ కార్డు ఎంతో ముఖ్యమైన డాక్యుమెంట్ అన్న సంగతి తెలిసిందే. ఇది గుర్తింపు కార్డుగా పనిచేస్తుంది. ఇంకా అడ్రస్ ప్రూఫ్‌గానూ ఇది ఉపయోగపడుతుంది.ఎన్నో ప్రభుత్వ ప్రయోజనాలు అందుకోవాలంటే కూడా ఇది తప్పనిసరి. అలాంటి ఆధార్ కార్డులో వివరాలన్నీ సరిగా ఉండాలి.పేరు, పుట్టిన తేదీ సహా ఏదీ తప్పులేకుండా చూసుకోవాల్సిన అవసరం ఉంటుంది. అయితే ఇప్పుడు ఆధార్ కార్డుకు సంబంధించి సామాజిక మాధ్యమాల్లో ఒక వార్త చక్కర్లు కొడుతుందన్న సంగతి చాలా మందికి తెలుసు. దీనిపై తెగ చర్చ నడుస్తోంది. డిసెంబర్ 14 లోపు వ్యక్తిగత వివరాలు అప్డేట్ చేయకుంటే.. ఆధార్ కార్డు పనిచేయదని వార్తలు వస్తున్నాయి. అయితే దీనిపై ఇప్పుడు భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ(యూఐడీఏఐ) కొట్టిపారేసింది.ఆధార్ కార్డుకు సంబంధించి ఏదైనా ఉచితంగా అప్డేట్ చేసుకునేందుకు మాత్రమే డిసెంబర్ 14 ఆఖరి తేదీ అని తెలిపింది.మార్చుకోకపోయినప్పటికీ ఆధార్ కార్డు యథావిధిగా పనిచేస్తుందని స్పష్టం చేసింది.ఆ తర్వాత కూడా ఎప్పుడైనా వివరాలు మార్చుకోవచ్చని పేర్కొంది.దీని కోసం ఆధార్ కేంద్రాలు లేదా కామన్ సర్వీస్ సెంటర్లకు వెళ్లి నిర్దేశిత రుసుము చెల్లించాల్సి ఉంటుందని వివరించింది.

ఆధార్ కార్డు ఫ్రీ అప్డేట్‌కు సంబంధించి ఉడాయ్ పలుమార్లు గడువు పొడిగించుకుంటూ వస్తోంది.మొదటగా 2023 డిసెంబర్ 14 వరకు అవకాశం ఇచ్చింది.తర్వాత దీనిని మార్చి 14 వరకు ఒకసారి,మళ్లీ 3 నెలలు పొడిగించి తర్వాత జూన్ 14 వరకు చేసింది.అనంతరం మరో మూడు నెలల వరకూ అంటే సెప్టెంబర్ 14 వరకు పొడగించగా తాజాగా మరో మూడు నెలల వరకూ సమయమిచ్చింది. తాజాగా డిసెంబర్ 14 వరకూ నిర్దేశిత రుసుముతో ఎలాంటి అపరాద రుసుము చెల్లించకుండా అప్డేట్ చేసుకునే వెసులుబాటు కల్పించింది.ఆ సమయంలోగా ఆన్‌లైన్లో మైఆధార్ వెబ్‌సైట్ ద్వారా ఉచితంగా డీటెయిల్స్ అప్డేట్ చేసుకోవచ్చు.ఆధార్ కార్డులో పేరు నమోదు చేసుకున్న నాటి నుంచి పదేళ్లు పూర్తయి ఇంకా అప్డేట్ చేసుకోని వారు ఉంటే కూడా అప్డేట్ చేసుకోవాలని ఉడాయ్ గతంలో సూచించింది. ఇది ఆదేశం మాత్రం కాదు. ఏదైనా వివరాలు మారి ఉంటాయి ఇన్నేళ్లలో కాబట్టి అప్డేట్ చేసుకోమని అవకాశం కల్పించింది.

కనీసం 10 సంవత్సరాలకు ఒకసారి గుర్తింపు కార్డు, అడ్రస్ ప్రూఫ్ సమర్పించి కేంద్ర గుర్తింపు సమాచార నిధి (సెంట్రల్ ఐడెంటిటీస్ డేటా రిపాజిటరీ–సీఐడీఆర్) లోని డీటెయిల్స్ అప్డేట్ చేసుకోవాలని పేర్కొంది ఉడాయ్.ఈ ప్రాసెస్ వల్ల పౌరుల సమాచారం సీఐడీఆర్ వద్ద ఎప్పటికప్పుడు అప్డేట్ అవుతుంటుందని వివరించింది. దీంతో కచ్చితమైన సమాచారం నిక్షిప్తం అయ్యేందుకు దోహదం చేస్తుందని తెలిపింది.

ఇక ఈ వివరాలు అప్డేట్ చేసుకునేందుకు ఉడాయ్ వెబ్‌సైట్లోకి లాగిన్ అయ్యాక.. లేటెస్ట్ గుర్తింపు కార్డు, అడ్రస్ డీటెయిల్స్ సబ్మిట్ చేయాల్సి ఉంటుంది. ఓటర్ ఐడీ, రేషన్ కార్డు, పాస్‌పోర్ట్ వంటివి గుర్తింపు, అడ్రస్ రెండింటి కోసం ప్రూఫ్స్‌గా వినియోగించుకోవచ్చు. టీసీ , పాన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, మార్కు షీట్ వంటివి గుర్తింపు కార్డుగా, కరెంట్, వాటర్, టెలిఫోన్ బిల్స్ అడ్రస్ ప్రూఫ్‌గా సమర్పించవచ్చు.

| నెక్ గుడ్ల ధరలు | ఫామ్‌గేట్ | డజన్ |
|---|---|---|
| హైదరాబాద్ | ₹ 512 | ₹ 61 |
| వరంగల్ | ₹ 512 | ₹61 |

**బంగారం ధరలు** (10 గ్రాములు)

హైదరాబాద్

| | |
|---|---|
| ₹75,110 (24 క్యారెట్లు) | ₹ 68,850 (22 క్యారెట్లు) |

చెన్నై

| | |
|---|---|
| ₹68,850 (22 క్యారెట్లు) | ₹75,110 (24 క్యారెట్లు) |

**వెండి ధరలు (కేజీ)**

హైదరాబాద్

₹97,500




## త్వరలో లక్ష పాయింట్లకు సెన్సెక్స్!

- చార్జీలను సవరించిన ఎన్‌ఎస్‌ఈ, బీఎస్‌ఈ




**ముంబై, సెప్టెంబర్ 28 (జనంసాక్షి) :** దేశీయ స్టాక్ మార్కెట్లు కొన్ని నెలలుగా తమ ప్రతాపాన్ని చూపిస్తున్నాయి. ఈ క్రమంలో బుల్ జోరును కొనసాగిస్తూ సరికొత్త జీవితకాల గరిష్ఠాలకు ఎగబాకుతున్నాయి. ఈ క్రమంలో బెంచ్ మార్క్ సూచీ సెన్సెక్స్ ఇటీవల 85000 మార్కును అధిగమించింది. మార్కెట్లో రోజురోజుకూ కొత్త కంపెనీల ఐపీవోలు రావటం కూడా మార్కెట్ బెంచ్ మార్క్ సూచీల పెరుగుదలకు కారణంగా కొందరు నిపుణులు చెబుతున్నారు. అయితే ప్రస్తుతం మార్కెట్లో ఇన్వెస్టర్లు, నిపుణులు త్వరలోనే సెన్సెక్స్ సూచీ 1 లక్ష పాయింట్ల మార్కును తాకుతుందని భావిస్తున్నారు. అయితే ఈ ఏడాదే సూచీ మార్కును అందుకోవటంలో విజయం సాధిస్తుందా లేక ఇంకా సమయం పడుతుందా అనే దానిపై మార్కెట్లో పెద్ద చర్చ కొనసాగుతోంది. వాస్తవానికి భారతీయ స్టాక్ మార్కెట్లు క్రమంగా పెరగటానికి గల కారణాలను పరిశీలిస్తే.. బలమైన ఆర్థిక అంచనాలు, ప్రపంచ మార్కెట్ పరిస్థితులను మెరుగుపరచడం, సహాయక విధాన నిర్ణయాలు, దేశీయ స్థాయిలో పెట్టుబడులను పెంచడం వంటి కీలక కారణాలు తోడ్పాటును అందిస్తున్నాయి. దీనికి తోడు భారీగా రిటైల్ ఇన్వెస్టర్లు రాకతో లిక్విడిటీ, డిమాండ్ పెరిగిందని నిపుణులు చెబుతున్నారు.

సెన్సెక్స్‌ను ట్రాక్ చేస్తున్న కొందరు నిపుణులు వచ్చే ఏడాది ప్రారంభంలో సెన్సెక్స్ సూచీ లక్ష పాయింట్లకు చేరుకోవచ్చని భావిస్తున్నారు. కాబట్టి కొంతమంది నిపుణులు ఈ విషయంలో భిన్నమైన అభిప్రాయాలను కలిగి ఉన్నారు. వారు మాత్రం బెంచ్ మార్క్ సూచీ లక్ష పాయింట్ల స్థాయికి చేరుకోవటానికి దాదాపు మూడేళ్లు పట్టొచ్చని వాదిస్తున్నారు. ఇదిలా ఉండగా భారతీయ స్టాక్ ఎక్స్ఛేంజీలు ఎన్‌ఎస్‌ఈ, బీఎస్‌ఈ శుక్రవారం కరెన్సీ, ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ డీల్స్ కోసం తమ లావాదేవీల ఛార్జీలను సవరించాయి. అక్టోబరు 1 నుంచి నగదు విభాగంలో రెండు వైపులా వాణిజ్య విలువలో లక్షకు రూ. 2.97 ఛార్జీ విధించబడుతుంది. ఈక్విటీ ఫ్యూచర్‌లలో రేటు లక్షకు రూ. 1.73 ఉంటుంది. అయితే ఈక్విటీ ఎంపికలు ప్రీమియం విలువలో లక్షకు రూ. 35.03 రుసుమును చూస్తాయి. ఈ ఛార్జీలు అమ్మినప్పుడు, కొన్నప్పుడు రెండు వైపులా వర్తిస్తుందని ప్రకటించబడ్డాయి. ఎన్‌ఎస్‌ఈ, బీఎస్‌ఈ సవరించిన లావాదేవీ ఛార్జీలు అక్టోబర్ 1 నుంచి వర్తిస్తాయని స్టాక్ ఎక్స్ఛేంజీలు వేర్వేరు సర్క్యులర్‌లలో తెలిపాయి. సెబీ స్టాక్ ఎక్స్ఛేంజీలతో సహా మార్కెట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌తో వ్యవహరించే సంస్థల సభ్యులందరికీ ఒకే విధమైన రుసుము నిర్మాణాన్ని తప్పనిసరి చేసిన తర్వాత ఈ చర్య వచ్చింది. ఛార్జీలు సవరించిన తర్వాత కోటి ప్రీమియం ట్రేడ్‌కు రూ. 3,250 చెల్లించాల్సి ఉంది. మార్కెట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్‌స్టిట్యూషన్‌ల చార్జీలకు సంబంధించి సెబీ జూలైలో సర్క్యులర్‌ను జారీ చేసింది. ప్రస్తుతం ఉన్న ట్రేడింగ్ వాల్యూమ్ ఆధారిత వ్యవస్థ స్థానంలో ఎంఐఐ సభ్యులందరికీ ఒకే విధమైన రుసుమును కలిగి ఉండాలని పేర్కొంది. అలాగే డెట్ సెక్యూరిటీల పబ్లిక్ ఇష్యూ లిస్టింగ్ కాల పరిమితిని ఆరు పనిదినాల నుండి మూడు పని దినాలకు తగ్గించాలని మార్కెట్ రెగ్యులేటర్ సెబీ ఇటీవల నిర్ణయించింది.

## ఒక్కో షేరుపై రూ.40 డివిడెండ్..

ముంబై, సెప్టెంబర్ 28 (జనంసాక్షి) : దేశీయ స్టాక్ మార్కెట్లలో ఒకపక్క ఐపీవోలు భారీ లాభాలను అందిస్తూ ఇన్వెస్టర్లను సంతోషంలో ఉంచుతున్నాయి. ఇదే క్రమంలో కొత్తి కంపెనీల కార్పొరేట్ చర్యలు సైతం దీర్ఘకాలిక ఇన్వెస్టర్లకు కాసుల పంట కురిపిస్తున్నాయి. దీంతో పెట్టుబడిదారులు అటు లాంగ్ టర్మ్ పోర్ట్ ఫోలియోతో పాటు షార్ట్ టర్మ్ లోనూ బంపర్ లాభాలను అందుకుంటున్నారు. ఇప్పుడు మనం మాట్లాడుకోబోతున్నది డివిడెండ్ అందించే షేర్ల కోసం వెతుకున్న ఇన్వెస్టర్ల కోసం అందుబాటులో ఉన్న కంపెనీ షేర్ల గురించే. వాటిపై బెట్టింగ్ వేయాలని చూస్తున్న వారికి యాక్సెల్యా సొల్యూషన్స్ ఇండియా లిమిటెడ్ కంపెనీ షేర్లు మంచి సదవకాశాన్ని మార్కెట్లో అందుబాటులోకి తెచ్చాయి. ఈ క్రమంలో కంపెనీ అర్హులైన ఇన్వెస్టర్లకు ఒక్కో షేరుపై ఏకంగా రూ.40 డివిడెండ్ చెల్లించనున్నట్లు ప్రకటించింది. ఈ ఏడాది కంపెనీ తన ఇన్వెస్టర్లకు డివిడెండ్ అందించటం ఇది రెండోసారి కావటం గమనార్హం.

ఈ క్రమంలో కంపెనీ నుంచి డివిడెండ్ అందుకోవాలని చూస్తున్న చాలా మందికి ఇంకా సమయం మిగిలే ఉందని చెప్పుకోవచ్చు. అవును ఇందుకోసం కంపెనీ అక్టోబర్ 4ను రికార్డు తేదీగా ప్రకటిస్తూ అవకాశం కల్పిస్తోంది. అంటే ఈ రోజున కంపెనీ పుస్తకాల ప్రకారం షేర్లను కలిగి ఉండే వ్యక్తులకు మాత్రమే ఒక్కో షేరుపై రూ.40 డివిడెండ్ చెల్లించబడుతుంది. అందువల్ల డివిడెండ్ ఆదాయం కావాలని భావిస్తున్నట్లయితే రానున్న వారంలో రికార్డు తేదీ నాటికి డీమ్యాట్ ఖాతాలా షేర్లు ఉండేలా చూసుకోవాల్సి ఉంటుంది. ఈ ఏడాది జనవరిలో కంపెనీ తన ఇన్వెస్టర్లకు డివిడెండ్ ఒక్కో షేరుపై రూ.25 ప్రకటించింది. కంపెనీ తొలిసారిగా 2007లో పెట్టుబడిదారులకు డివిడెండ్ చెల్లించటం ప్రారంభించింది. గత ఏడాది కాలంలో కంపెనీ షేర్ల ధరలు 16 శాతం పెరిగాయి. అలాగే గడచిన ఆరు నెలల కాలంలో కంపెనీ షేర్లు 7 శాతం వృద్ధిని చూశాయి. గత నెలలో ఈ స్టాక్ ధర 3.5 శాతం పెరిగింది. ఈ క్రమంలో కంపెనీ షేర్లు బీఎస్‌ఈలో 52 వారాల గరిష్ఠ ధర రూ.2128.25గా ఉండగా, 52 వారాల కనిష్ఠ ధర రూ.1038.80 వద్ద ఉంది. ప్రస్తుతం కంపెనీలో ప్రమోటర్ల వాటా 74.66 శాతం ఉండగా మార్కెట్ క్యాప్ రూ.2760 కోట్లుగా కొనసాగుతోంది.

# జాతీయం అంతర్జాతీయం

## నేపాల్ వరదలు.. 60కి చేరిన మృతుల సంఖ్య



**ఖాట్మండు, సెప్టెంబర్ 28 (జనంసాక్షి) :** పొరుగుదేశం నేపాల్‌ను భారీ వర్షాలు, వరదలు అతలాకుతలం చేస్తున్నాయి. గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా వరదలు పోటెత్తాయి. ఈ వరదలకు రాజధాని ఖాట్మండు సహా ఎనిమిది జిల్లాల్లో పెద్ద ఎత్తున మరణాలు సంభవించాయి. శనివారం సాయంత్రానికి నేపాల్ వరద మృతుల సంఖ్య 60కి చేరింది.

స్థానిక మీడియా నివేదిక ప్రకారం.. ఖాట్మండు వ్యాలీలో 34 మంది, బాగ్మతి ప్రావిన్స్‌లోని ఐదు జిల్లాల్లో 19 మంది, కోసి ప్రావిన్స్‌లో ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. మరో 12 మంది గల్లంతయ్యారు. వారి ఆచూకీ కోసం సెర్చింగ్ కొనసాగుతోంది. భారీ వర్షాలకు దాదాపు అన్ని నదులు ప్రమాదకరస్థాయిని మించి ప్రవహిస్తున్నాయి. ఆ నీరంతా సమీపంలోని గ్రామాల్లోకి పోటెత్తింది. దాంతో అనేక ప్రాంతాలు వరద గుప్పిట్లో చిక్కుకుపోయాయి. దాదాపు 1,244 ఇళ్లు పూర్తిగా నీట మునిగాయి. దేశవ్యాప్తంగా 44 జిల్లాల్లో వరదలు బీభత్సం సృష్టించినట్లు సదరు మీడియా పేర్కొంది. పలు చోట్ల కొండచరియలు విరిగిపడటం లాంటి ఘటనలు చోటు చేసుకున్నాయి.

పలు చోట్ల రోడ్లు ధ్వంసమయ్యాయి. ఈ కారణంగా అధికారులు 39 జిల్లాల్లో రహదారులను పూర్తిగా మూసివేశారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో అధికారులు సహాయక చర్యలు చేపట్టినట్లు స్థానిక మీడియా తెలిపింది. దాదాపు 3 వేల మంది భద్రతా సిబ్బంది సహాయక చర్యల్లో పాల్గొంటున్నట్లు పేర్కొంది. ఇప్పటి వరకు వెయ్యి మంది వరకు బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

## కల్తీ నెయ్యిపై విచారణ

- తిరుపతి చేరుకున్న సిట్ బృందం

**తిరుపతి, సెప్టెంబర్ 28 (జనంసాక్షి) :** తిరుమల లడ్డూ ప్రసాదానికి వినియోగించే నెయ్యి కల్తీ విచారణ కోసం ఏర్పడిన ప్రత్యేక దర్యాప్తు బృందం సిట్ తిరుపతికి చేరుకుంది. సిట్ అధిపతి, ఐజీ సర్వ శ్రేష్ఠ త్రిపాఠి రేణిగుంట విమానాశ్రయం నుంచి నేరుగా తిరుమల వెళ్లనున్నారు. ఇప్పటికే విశాఖ డీఐజీ గోపినాథ్ జెట్టి, కడప ఎస్పీ హర్షవర్ధన్ రాజు తిరుపతికి చేరుకున్నారు. వందే భారత్ రైలులో ఇద్దరు డీఎస్పీలు సీతారామారావు, శివనారాయణ స్వామి, ఉమా మహేశ్వర్ (విజయవాడ), సూర్యనారాయణలు సీఐ సత్యనారాయణ (అన్నమయ్య జిల్లా) తిరుపతికి చేరుకున్నారు. సిట్‌లో సభ్యుడు తిరుపతి అడ్మిన్ ఎఎస్పీ వెంకటరావు స్థానికంగా ఉంటూ విచారణకు సహకరించనున్నారు. ముందుగా పోలీసు గెస్టు హౌస్‌కు చేరుకున్న సిట్ బృందం.. ఆపై తిరుపతి పోలీస్ గెస్ట్ హౌస్ నుంచి తిరుమలకు బయలుదేరి వెళ్లారు. తిరుమలకు వెళ్లి టీటీడీ ఈవో, అడిషనల్ ఈవోలని సిట్ బృందం కలువనుంది. ఆపై తిరుమలలో శ్రీవారిని సిట్ బృందం సభ్యులు దర్శించుకోనున్నారు. ఆ తరువాత తిరుమల అన్నమయ్య భవన్ సిట్ సమావేశం కానుంది. కాగా... తిరుమల లడ్డూ వివాదాన్ని సీరియస్‌గా తీసుకున్న సర్కార్ నెయ్యి కల్తీపై విచారణకు సిట్‌ను నియమించిన విషయం తెలిసిందే. గుంటూరు రేంజ్ ఐజీగా ఉన్న సర్వ శ్రేష్ఠ త్రిపాటిని సిట్ అధిపతిగా నియమించింది. సిట్ డీఐజీగా విశాఖ రేంజ్‌లో పనిచేసిన గోపీనాథ్ జెట్టిని ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు నియమించారు. సిట్ ఎస్పీగా కడప ఎస్పీ హర్షవర్ధన్ రాజును నియమించారు. మరి కాసేపట్లో ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేయనుంది. ఈ సిట్ టీమ్‌లో మరి కొంతమంది డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలను ఏపీ ప్రభుత్వం నియమించనుంది. కాగా.. వైసీపీ ప్రభుత్వ హయాంలో తిరుమల లడ్డూ తయారీలో జంతువుల కొవ్వు వినియోగించినట్లు ఎన్‌డీడీబీ తన నివేదికలో స్పష్టం చేసింది. దీంతో ప్రపంచవ్యాప్తంగా ఉన్న శ్రీవారి భక్తుల్లో తీవ్ర కలకలం రేగింది. ఈ నేపథ్యంలో అందుకు సంబంధించిన నిజనిజాలు వెలుగులోకి తీసుకువచ్చేందుకు చంద్రబాబు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. వెంటనే చంద్రబాబు ప్రభుత్వం సిట్‌ను ఏర్పాటు చేసింది.

## 80 టన్నుల బాంబులతో నస్రల్లాను అంతమొందించిన ఇజ్రాయెల్!



**జెరూసలాం, సెప్టెంబర్ 28 (జనంసాక్షి) :** ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో హిజ్‌బొల్లా అధినేత హస్సన్ నస్రల్లా హతమైన విషయం తెలిసిందే. హిజ్‌బొల్లా చీఫ్‌ను అంతమొందించేందుకు ఇజ్రాయెల్ ఏకంగా 80 టన్నులకుపైగా బాంబులను వాడినట్లు స్థానిక మీడియా నివేదించింది. నస్రల్లాను అంతమొందించడమే లక్ష్యంగా లెబనాన్ రాజధాని బీరుట్‌పై శుక్రవారం ఇజ్రాయెల్ భీకర దాడులకు తెగబడిన విషయం తెలిసిందే. బీరుట్ లో ఉన్న బిల్డింగ్‌లపై వైమానిక దాడులకు పాల్పడింది. ఆ సిటీలో ఉన్న హిజ్‌బొల్లా కమాండ్ సెంటర్‌పై తీవ్ర స్థాయిలో వైమానిక దాడి జరిగింది. దక్షిణ లెబనాన్‌లోని దాహియాలోని భూగర్భంలో ఉన్న హిజ్‌బొల్లా ప్రధాన కార్యాలయంపై బాంబుల వర్షం కురిపించింది. సుమారు 80కిపైగా బాంబులను హిజ్‌బొల్లా ప్రధాన కార్యాలయంపై వేసినట్లు స్థానిక మీడియా వెల్లడించింది. బంకర్లలోకి చొచ్చుకెళ్లేంత బరువు ఉన్న బాంబులను ఐడీఎఫ్ వాడినట్లు పేర్కొంది. ఇందుకోసం ఉపయోగించిన ఒక్కో బాంబు సగటున ఒక టన్ను బరువు ఉంటుందని తెలిపింది.

మరోవైపు తమ దాడుల్లో హిజ్‌బొల్లా చీఫ్ హతమైనట్లు ఇజ్రాయెల్ సైన్యం శనివారం ధ్రువీకరించింది. 'హసన్ నస్రల్లా ఇకపై ప్రపంచాన్ని భయభ్రాంతులకు గురిచేయలేరు' అంటూ ఐడీఎఫ్ ట్వీట్ చేసింది. ఇదిలా ఉండగా.. నస్రల్లా హతం వేళ ఇరాన్ అప్రమత్తమైంది. భద్రతా కారణాల దృష్ట్యా తన సుప్రీమ్ లీడర్ అయతుల్లా అలీ ఖమేనీని సురక్షిత ప్రాంతానికి తరలించినట్లు తెలుస్తోంది. ఈ మేరకు సంబంధిత అధికారులు వెల్లడించినట్లుగా అంతర్జాతీయ మీడియా పేర్కొంది. అదే సమయంలో నస్రల్లా హతం వేళ తదుపరి కార్యాచరణ విషయంలో హిజ్‌బొల్లా, ఇతర సంస్థలతో ఇరాన్ నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నట్లు సరదు అధికారులు వెల్లడించినట్లు అంతర్జాతీయ మీడియా నివేదించింది.

## పాకిస్తాన్‌లో కూలిన హెలికాప్టర్..

- ఏడుగురు దుర్మరణం



**ఇస్లామాబాద్, సెప్టెంబర్ 28 (జనంసాక్షి) :** పొరుగు దేశం పాకిస్తాన్‌లో ఘోర హెలికాప్టర్ ప్రమాదం చోటుచేసుకుంది. ఖైబర్ ఫఖ్తుంఖ్వా ప్రావిన్సులోని ఉత్తర వజీరిస్తాన్‌లో హెలికాప్టర్ కుప్పకూలి ఏడుగురు మృతిచెందారు. మరో 8 మంది తీవ్రంగా గాయపడ్డారు. చార్టర్డ్ విమానం ఆయిల్ కంపెనీకి చెందిన ఉద్యోగులను తరలిస్తుండగా ప్రమాదం జరిగింది. హెలికాప్టర్ టేకాఫ్ అయిన కొద్దిసేపటికే ఇంజిన్ ఫెయిల్ అయింది. పైలట్ ఎమర్జెన్సీ ల్యాండింగ్ కోసం ప్రయత్నిస్తున్న సమయంలోనే హెలికాప్టర్ కుప్పకూలింది. మరణించిన వారిలో ముగ్గురు రష్యా జాతీయులు, ఇద్దరు పైలట్లు, ఒక క్రూ మెంబర్ ఉన్నట్లు తెలుస్తోంది.

## 'న్యూ ఆర్డర్' పేరుతో ఆపరేషన్.. యాంటీషిప్ మిస్సైళ్లు ధ్వంసం



**గాజా, సెప్టెంబర్ 28 (జనంసాక్షి) :** లెబనాన్‌లోని హిజ్‌బొల్లా నేత హస్సన్ నస్రల్లాను ఇజ్రాయిల్ దళాలు హతమార్చాయి. బీరుట్‌పై శుక్రవారం రాత్రి జరిగిన వైమానిక దాడిలో అతను మృతిచెందినట్లు ఇవాళ ఇజ్రాయిల్ మిలిటరీ ప్రకటించింది. అయితే నస్రల్లా టార్గెట్‌తో చేపట్టిన ఆపరేషన్‌కు 'న్యూ ఆర్డర్' అని పేరు పెట్టారు. బీరుట్‌పై జరిగిన దాడులకు చెందిన ఫోటోలను ఇజ్రాయిల్ వైమానిక దళం రిలీజ్ చేసింది. శుక్రవారం రాత్రి నుంచి హిజ్‌బొల్లా చీఫ్ హస్సన్ నస్రల్లా ఆచూకీ తెలియడంలేదని, అతనితో కాంటాక్ట్ తెగిపోయినట్లు ఆ గ్రూపునకు చెందిన కొందరు వెల్లడించారు. హిజ్‌బొల్లా అధికారి పూర్తి వివరాలు వెల్లడించేందుకు నిరాకరించారు. తమ దేశాన్ని, పౌరుల్ని ఎవరు బెదిరించినా, వాళ్లను ఇజ్రాయిల్ వదిలి పెట్టదని ఐడీఎఫ్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ లెఫ్టినెంట్ జనరల్ హెర్జీ హలేవీ తెలిపారు. శుక్రవారం జరిపిన దాడిలో .. అండర్‌గ్రౌండ్ బిల్డింగ్‌ల్లో దాచిన డజన్ల కొద్దీ యాంటీ షిప్ మిస్సైళ్లు పూర్తిగా ధ్వంసమైనట్లు ఇజ్రాయిల్ పేర్కొన్నది. చైనాకు చెందిన సీ–704, సీ802 మిస్సైళ్లు హిజ్‌బొల్లా వద్ద ఉన్నట్లు గుర్తించామని ఇజ్రాయిల్ తెలిపింది. 200 కిలోమీటర్ల దూరం ప్రయాణించే ఇరాన్ క్షిపణి గదార్ కూడా హిజ్‌బొల్లా వద్ద ఉన్నట్లు ఇజ్రాయిల్ మిలిటరీ తెలిపింది. హిజ్‌బొల్లాకు చెందిన ఓ యూనిట్.. ఆ క్షిపణులను స్టోర్ చేసి ఆపరేట్ చేస్తున్నట్లు తెలిసింది. ఫైటర్ విమానాలు చేపట్టిన ఆపరేషన్‌కు చెందిన వీడియోలను రిలీజ్ చేశారు.

## స్వర్ణాంధ్రకు సలహాలు ఇవ్వండి

- సిఎం చంద్రబాబు



**అమరావతి, సెప్టెంబర్ 28 (జనంసాక్షి) :** స్వర్ణాంధ్ర సాధనకు ప్రజల నుంచి సూచనలు ఆహ్వానిస్తున్నట్లు సీఎం చంద్రబాబు తెలిపారు. ఈమేరకు ఆయన 'ఎక్స్'లో పోస్టు చేశారు. ప్రజలు తమ అభిప్రాయాలు, సూచనలను పంపవచ్చన్నారు. ఇలా చేసిన అనంతరం అభినందనలను ఇ–సర్టిఫికెట్ ద్వారా అందుకోవచ్చని చెప్పారు. 2047 నాటికి మెరుగైన వృద్ధిరేటు సాధనే లక్ష్యమని తెలిపారు. స్వర్ణాంధ్రప్రదేశ్ 2047 వైపు ప్రయాణాన్ని ప్రారంభించామని చెప్పారు. ఏపీ భవిష్యత్తు రూపకల్పనకు పౌరుల సూచనలు ఆహ్వానిస్తున్నట్లు చంద్రబాబు పేర్కొన్నారు. ప్రతి సూచనను పరిగణనలోకి తీసుకుంటూ సమష్టిగా స్వర్ణాంధ్రను నిర్మించుకుందామన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
29.09.2024

## సంక్షిప్తంగా..

పత్తి పంటపై రైతులకు అవగాహన
బిచ్కుంద/జుక్కల్ సెప్టెంబర్ (జనంసాక్షి):కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గ పరిధిలోని జుక్కల్ మండలంలో గల లాడేగావ్ గ్రామంలో శుక్రవారం నాడు వానాకాలంలో సాగు అవుతున్న పత్తి పంటను వ్యవసాయ విస్తరణ అధికారి సతీష్ చిద్రావర్ పరిశీలించి రైతులకు సలహాలు సూచించారు. పత్తి పంటలో ముఖ్యంగా రసం పీల్చే పురుగులయిన తెల్లదోమ, పచ్చ దోమ, పెను బంక ఉధృతిని గమనించి నివారణకు ఫ్లూనోకామిడ్ 80 గ్రాములు ఎకరాకు లేదా డిఫెంథియురాన్+ఎసిటమిప్రిడ్ (హెర్క్యులస్ ) 200 గ్రాములు ఎకరాకు పిచికారి చేయాలని పేర్కొన్నారు. అదే విధంగా నల్ల మచ్చ తెగులు నివారణకు ప్లాంటోమైసిన్ 0.2 గ్రాములు లీటర్ నీటికి లేదా స్ట్రెప్టోమైసిన్ 0.2గ్రాములు లీటర్ నీటికి మరియు కాపర్ అక్సీ క్లోరైడ్ 3 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాజశేఖర్ పటేల్, పండరి, పాండ్రే సందీప్ మరియు రైతులు తదితరులు పాల్గొన్నారు.

### పారిశుధ్య కార్మికులకు ఆరోగ్య పరీక్షలు

నిజాంసాగర్ (జనంసాక్షి) మండల కేంద్రంలో ని ప్రభుత్వ ఆస్పత్రిలో శనివారం నాడు అన్ని గ్రామాల పంచాయితీ పారిశుధ్య సిబ్బందికి,కార్మికులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. బీపీ,షుగర్, కంటి చూపు పరీక్షలు నిర్వహించి సమస్య ఉన్న వారికి తగు మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో గంగాధర్, ఎంపీఒ అనిత,ఆస్పత్రి వైద్యులు,సిబ్బంది పాల్గొన్నారు.

### ఒకేరోజు రెండు మహాసభలు



శంకరపట్నం జనంసాక్షి :కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం మెట్పల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు పొద్దుటూరి సంజీవరెడ్డి అధ్వర్యంలో సర్వసభ్య సమావేశం మొలంగూర్లోని సంఘ గోదాం ఆవరణలో నిర్వహించారు. సంఘం ఆదాయ వ్యయాలను కార్యదర్శి శనిగరం సదయ్య సభ్యులకు చదివి వినిపించారు. ఈ కార్యక్రమములో పాలక వర్గ సభ్యులు అంగడి సారయ్య, బోనగిరి ఐలయ్య, కవ్వ పద్మ, బోడ సుధాకర్, మాడ రాజిరెడ్డి, కాల్వ వెంకటరమణారెడ్డి, కాటం బుచ్చిరెడ్డి, బత్తుల రవి పాల్గొన్నారు. మండలంలోని గద్దపాక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు గుర్రాల తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం రాజాపూర్ క్యాష్ కౌంటర్ ఆవరణలో మహాసభ నిర్వహించారు. సంఘం కార్యదర్శి పాతర్ల శ్రీనివాస్ సంఘం ఆదాయ వ్యయాలను సంఘ సభ్యులకు చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో సంఘ డైరెక్టర్లు ఆయా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

### డిప్యూటీ తాసిల్దార్‌గా బాధ్యతలు



శంకరపట్నం(జనంసాక్షి): మండలం నూతన డిప్యూటీ తాసిల్దార్ గా ఇంద్రాల మల్లేశం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా హుజురాబాద్ రెవెన్యూ డివిజన్ అధికారి కార్యాలయంలో విధులు నిర్వహించిన మల్లేశం శుక్రవారం తాహసిల్దార్ కార్యాలయానికి రాగా రెవెన్యూ కార్యాలయ సిబ్బంది స్వాగతించారు. నాయకులు పలువురు ప్రజాప్రతినిధులు అభినందనలు తెలియజేశారు.

### అంగన్వాడి కేంద్రానికి మరమ్మతులు



ఇబ్రహీంపట్నం (జనం సాక్షి): ఇబ్రహీంపట్నం మండలం డబ్బా గ్రామం లో అంగన్వాడీ కేంద్రం లో తాత్కాలిక సమస్యలను తీర్చాలని డబ్బా గ్రామ బీజేపీ శాఖ ఆధ్వర్యంలో సమస్యల పరిస్కారానికి గ్రామ సెక్రటరీకి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. గ్రామం లో పాలక వర్గం లేకపోవడంతో సమస్య పరిష్కారం కాలేదు. ఈ సమస్య ను బీజేపీ గ్రామ శాఖ సభ్యులు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, కోరుట్ల నియోజకవర్గ యువ నాయకులు సురభి నవీన్ కుమార్ దృష్టికి తీసుకెళ్లడంతో , అంగన్వాడీ కేంద్రంలో తాత్కాలిక మరమ్మతులు చేయించి మానవత్వం చాటుకున్నారు. మరమత్తులు చేయించిన సురభి నవీన్ కుమార్ కి గ్రామ ప్రజలు ధన్యవాదాలు తెలిపారు.

### పలువురిని పరామర్శించిన కేకే

ముస్తాబాద్ (జనంసాక్షి):ముస్తాబాద్ మండల కేంద్రంలోని మిాస లక్ష్మీపతి పారిశుద్ద కార్మికుడు విధులు నిర్వహిస్తుండగా అకస్మాత్తుగా గుండెపోటు రావడం తో అక్కడికక్కడే మరణించారు ఆ యొక్క కుటుంబాన్ని పరామర్శించి వారికి ప్రభుత్వం తరపున అన్ని విధాల అండగా ఉంటామని హామీ ఇచ్చారు కేకే మహేందర్ రెడ్డి ముస్తాబాద్ పట్టణానికి చెందిన కాంగ్రెస్ నాయకులు దీటి నర్సింలు మోకాలికి శస్త్ర చికిత్స జరగడం వల్ల వారిని పరామర్శించి యోగక్షేమాలు తెలుసుకోవడం జరిగింది. మాజీ జడ్పీ కో ఆప్షన్ సర్వర్ పాషా గారి తండ్రి అనారోగ్య కారణంతో మృతి చెందగా వారిని పరామర్శించారు. మండల కేంద్రానికి చెందిన యండి నజీర్ గుండె పోటుతో మరణించడంతో వారి కుటుంబాన్ని పరామర్శించారు.మాజీ జెడ్పిటిసి గుండం నర్సయ్య మండల కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు గజల రాజు, తలారి నర్సింలు , కార్యకర్తలు పాల్గొన్నారు



# ఇసుక అక్రమ దందా

## అనుమతులు లేకున్నా యథేచ్ఛగా తరలిస్తున్న వైనం

- భారీగా అక్రమ ఇసుక రావాణా
- మంజీర నదిని కొల్లగొడుతున్న అక్రమార్కులు
- అధికారుల నిర్లక్ష్యం
- పోతంగల్ నుంచి బిచ్కుంద మీదుగా అక్రమ రవాణా
- కేసులు పెడుతున్న ఆగని దందా
- హస్గుల్,చెట్లూర్,కాడ్గావ్,మంజీరలో బారీగా ఇసుక తవ్వకాలు



కామారెడ్డిబ్యూరో(జనంసాక్షి):
ఇసుక మాఫియా జిల్లాలో పెట్రేగి పోతుంది. అక్రమ ఇసుక రావాణా దందా మూడు ట్రాక్టర్లు,ఆరు ట్రిప్పర్‌లుగా జిల్లాలో సాగుతుంది. జిల్లాలోని వాగులు,వంకలు,నదుల నుంచి ఇసుక బకసరులు ఇసుకను తోడేళ్లలాగా తవేస్తూ కోట్ల రూపాయిలు గడిస్తున్నారు.రాత్రి,పగలు అనే తేడా లేకుండా ఇసుక రవాణా కొనసాగుతుంది.ప్రధానంగా మంజీర నదిలోంచి ఇసుకను తరలిస్తూ కొల్లగొడుతున్నారు. బిచ్కుంద,బీర్కూర్, మంజీరలలో ఇసుక రీచ్‌లు మూసివేసినప్పటికి అక్రమ ఇసుక రవాణా సాగుతునే ఉంది.క్వారీల పేరిట కొందరు ఇసుక బకసురులు, ట్రాక్టర్లు, టిప్పర్‌లు,లారీలతో గుట్టుగా మహరాష్ట్ర,హైదారాబాద్ లాంటి మహనగరాలకు తరలిస్తున్నారు. స్థానిక నేతలు అధికారుల అండదండలతోనే ఇసుకమాఫీయా కొనసాగుతుంది.దానికి ప్రజల నుంచి విమర్శలు వస్తున్న అక్రమ ఇసుక రవాణా ఆగడం లేదు.మంజీరా నదిలో వరుద నీరు ప్రవాహిస్తున్న ఇసుక మాఫీయా బరి తెగించి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు.ఒకవైపు పోలీస్,మైనింగ్ అధికారులు,రెవెన్యూ అధికారులు ఇసుక డంప్‌లను సీజ్ చేస్తున్న అక్రమ ఇసుక దందా ఆగడం లేదు.

**ఆగని అక్రమ రవాణా:**
జిల్లాలోని మంజీర నది ప్రవాహక ప్రాంతంలో లక్షల టన్నుల ఇసుక అక్రమ రవాణా కొనసాగుతుంది.ఇసుక క్వారీల కాంట్రాక్టర్లు,టీజీఎంబీసీ సిబ్బంది కుమ్మకై ప్రభుత్వ ఆదాయానికి గండి కొదుతున్నారు.క్వారీలలో తవ్వకాలను నిలిపి వేసినప్పటికిని అక్రమ రవాణా కొనసాగుతుంది. అయితే ఇటీవల రెండు మూడు క్వారీలలో తవ్వకాలకు టిసిఎండీసీ అనుమతి ఇచ్చింది.దీంతో క్వారీల అక్రమ రవాణా కొనసాగుతుంది. జిల్లాలోని నిజాంసాగర్,బాన్సువాడ, బిచ్కుంద,పిట్లం, భీర్కూర్ మండలాల మీదుగా మంజీర నది ఉంది. ఈ మంజీర నదిలోనే చాలా ఇసుక క్వారీలు ఉండేవి.గతంలో ఈ క్వారీల నుంచి అక్రమంగా తరలిస్తున్నారనే ఆరోపణలతో ప్రభుత్వం అంక్షలు విధించింది.కేవలం ప్రభుత్వ పథకాల నిర్మాణాలకు ఇసుక తవ్వకాలకు అనుమతి ఇస్తున్నారు.మంజీర నదిలో ప్రభుత్వ దెవలఫ్‌మెంట్ పనుల పేరిట అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారు.ఇటీవల కురిసిన బారీ వర్షాలకు నీటి ప్రవాహం ఉన్నప్పటికి ఇసుకబకాసురులు బరితెగించి బాత్‌రూంలో గుట్టుగా ఇసుక తవ్వకాలు చేపడుతున్నారు.ప్రధానంగా బిచ్కుంద మండల పరిధిలోని హస్గుల్, చెక్లూర్,ఖడ్గవ్, మంజీరలో ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలిస్తూ చివారు ప్రాంతంలో గుట్టుగా డంప్‌లు చేస్తున్నారు.బారీ టిప్పర్లతో ఆ ఇసుకను నింపి హైదారాబాద్ లాంటి నగరాలకు తరలిస్తున్నారు.

**రవాణా ఇలా సాగుతుంది:**
జిల్లా సరిహద్దు అయిన పోరుగు జిల్లాకు చెందిన కోటగిరి మండలం పోతంగల్,మంజీర నదిలో స్థానికంగా ఉండే కొందరు చోటమోట నాయకులు అక్రమంగా ఇసుకను తవ్వుతూ బారీగా డంప్‌లు ఏర్పాటు చేస్తున్నారు.పగలు,రాత్రి అనే తేడా లేకుండా టిప్పర్‌లు,లారీల ద్వారా మంజీర నది గుండా బీర్కూర్,బిచ్కుంద మీదుగా తరలిస్తున్నారు.బిచ్కుంద మండల కేంద్రం మీదుగా జాతీయ రహదారి ఉండటంతో గుట్టుగా పోతంగల్ నుంచి బిచ్కుంద మీదుగా ఇసుక లారీలను జాతీయ రహదారిపైకి ఎక్కించి హైదారాబాద్,మహరాష్ట్ర,కర్ణాటలకుతరలిస్తున్నారు.ఆడపదడప పోలీసులు పట్టుకొని వాహనాలను సీజ్ చేస్తున్న అక్రమ దందా మాత్రం ఆగడం లేదు.ప్రతి రోజు జిల్లాలో అక్రమ రవాణా నిరాఘటంగా కొనసాగుతుంది.పోలీస్‌శాఖ,రెవెన్యూశాఖ,మైనింగ్ శాఖ అధికారులు నిర్లక్ష్యం వ్యహించడంతో ప్రకురుతి సంపదను,ఇసుక మాఫీయాను అడ్డుకోవడం లేదు.అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న,లారీలు,ట్రాక్టర్‌లు,టిప్పర్లపై జరిమానలు విధిస్తున్నారు.అధిక లోడ్‌తో లారీలు,టిప్పర్‌లు వెళ్లడంతో రోడ్లు సైతం చెడిపోతున్నాయి.ఇసుక అక్రమ రవాణాపై అధికారులు నిఘా పెట్టడంలో విఫలమవుతున్నారు. అధికారులకు బారీ ఎత్తున మూడుపులు అందడంతో అటువైపు కన్నెతి చూడటం లేదనే ఆరోపణలు ఉన్నాయి.జిల్లా నుంచి జోరుగా అక్రమ ఇసుక రవాణా కొనసాగుతున్న మైనింగ్ శాఖ అధికారులు పట్టించుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తుంది.జిల్లాలో ఇసుక మాఫీయా ఆగడాలకు అడ్డు,అదుపు లేకుండా పోయింది.కాసుల వర్షం కురిపిస్తున్న ఇసుక అక్రమ రవాణాతో పలువురు కోట్లాది రూపాయిలు అర్జిస్తున్నారు.అధికార అండ బలంతో యథేచ్ఛంగా అక్రమ ఇసుక రవాణా జోరుగా కొనసాగుతుంది.

**ఇసుక అమ్రక రవాణాపై చర్యలు:**
**– జిల్లా మైనింగ్ శాఖ అధికారి నగేష్:**
జిల్లాలో అక్రమ ఇసుక రవాణాపై చర్యలు తీసుకుంటున్నాం.ఇటీవల ప్రభుత్వం మంజీరలో ఇసుక తవ్వకాలను రద్దు చేసింది.మంజీర నుంచి ఇసుక అక్రమ రవాణా సాగుతుందని తమకు సమాచారం అందిందన్నారు.అక్రమ రవాణా జరుగకుండా చర్యలు తీసుకుంటాం.ఇటీవల అక్రమంగా తరలిస్తున్న వారిపై కేసులు నమోదు చేసి వాహనాలను సీజ్ చేసి బారీగా జరిమానాలు విధించడం జరిగిందన్నారు.

# చిన్నారిపై పీఈటీ లైంగిక దాడి

- కామారెడ్డి పట్టణంలోని జీవధాన్ పాఠశాలలో ఘటన
- విద్యార్థి సంఘాల ఆందోళన
- మద్దతుగా నిలిచిన మున్సిపల్ చైర్ పర్సన్
- నిందితునుపై ఫాక్సో కేసు నమోదు

కామారెడ్డి జిల్లా ప్రతినిధి (జనంసాక్షి):
కామారెడ్డి జిల్లా కేంద్రంలోని జీవధాన్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఉద్రిక్తత చోటు చేసుకుంది. పాఠశాలలో చదువుతున్న ఆరేళ్ల చిన్నారిపై అదే పాఠశాలకు చెందిన పీఈటీ నాగరాజు లైంగికదాడి చేశాడు. పాఠశాలలో మంగళవారం జరిగిన ఈ ఘటనతో పట్టణ పోలీసులు పీఈటీపై పోక్సో కేసు నమోదు చేశారు. అయితే విషయం తెలుసుకున్న విద్యార్థి సంఘాల నాయకులు పాఠశాల యాజమాన్యంతో గొడవకు దిగారు. పాఠశాలలో జరిగిన ఈ ఘటనపై నిర్లక్ష్యం వహించిన ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాళ్లను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. విషయం ఆనోటా ఈనోటా వ్యాపించడంతో విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలకు చేరుకున్నారు. దాంతో గొడవ పెద్దదిగా మారింది. విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ గడ్డం ఇందుప్రియ, కౌన్సిలర్లు పాఠశాలకు చేరుకుని మద్దతుగా నిలిచారు. ఆందోళనలో పాల్గొని ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కొందరు తరగతి గదుల్లో ఉన్న పిల్లలను బయటకు పంపడానికి ప్రయత్నించగా విద్యార్థులు భయంతో వణిక పోయారు. పట్టణ సీఐ చంద్రశేఖర్ రెడ్డి సముదాయించినా వినకపోవడంతో కాసేపటికి డీఎస్పీ నాగేశ్వర్ రావు అక్కడికి చేరుకుని నచ్చజెప్పే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. మధ్యాహ్నం భోజన సమయం కావడంతో విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలకు లంచ్ బాక్సులు తీసుకుని పాఠశాలకు రావడంతో వారిలో ఆందోళన మొదలైంది. పాఠశాలలో జరిగిన ఘటనతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. విద్యార్థి సంఘాల ఆందోళనలో తల్లిదండ్రులు కూడా పాల్గొనడంతో పాఠశాలలో ఒక్కసారిగా ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది.పరిస్థితి చేయిదాటకుండా ఉండేందుకు పోలీసులు పాఠశాలకు చేరుకున్నారు. అడిషనల్ ఎస్పీ నర్సింహారెడ్డి పాఠశాలకు చేరుకుని పరిస్థితి సమీక్షించారు. పాఠశాలలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఉండేందుకు పోలీస్ ఫోర్స్ పాఠశాలకు చేరుకుంది. పాఠశాలలో ఉద్రిక్తత నేపథ్యంలో విద్యార్థులను బయటకు పంపించారు. దాంతో వారు కూడా ఆందోళనలో భాగస్వామ్యం అయ్యారు. మాకు న్యాయం జరగాలి అంటూ నినాదాలు చేశారు. విద్యార్థి సంఘాలు,తల్లిదండ్రులు ప్రిన్సిపాల్ రూంలోకి చొచ్చుకెళ్లే ప్రయత్నం,చేయగా పోలీసులు అడ్డుకున్నారు.దాంతో పోలీసులు, ఆందోళనకారులకు తోపులాట చోటుచేసుకుంది. ఈ క్రమంలో ఆందోళనకారులు పోలీసులపైకి రాళ్లు విసరడంతో కామారెడ్డి పట్టణ సీఐ తలకు గాయమైంది. సీఐతో పాటు పట్టణ ఎస్సై రాజారాం, లింగంపేట ఎస్సై, పలువురు కానిస్టేబుళ్లకు గాయాలయ్యాయి. దాంతో పోలీసులు లాఠీఛార్జ్ చేసి ఆందోళనకారులను చెదరగొట్టారు. పరిస్థితిని పోలీసులు అదుపులోకి తెచ్చారు బుధ, గురు వారాల్లో ఏదో ఒక రోజు కామారెడ్డి బందుకు పిలుపునివ్వాలని పలువురు అనుకున్నారు. ఘటన జరిగి మూడు రోజులు గడిచిన మంగళవారం వరకు బయటకు రాలేదంటే దీని వెనుక ఉన్న ఏజరిగిందనేది పూర్తి వివరాలు కొద్ది రోజుల్లో తెలవాల్సి ఉంది.

## మద్దికుంట గ్రామానికి ఎస్సీ రిజర్వేషన్ కల్పించాలి

**కేకే మహేందర్ రెడ్డికి దళితుల వినతి**



ముస్తాబాద్ సెప్టెంబర్ 28 (జనంసాక్షి):
ముస్తాబాద్ మండలం మద్దికుంట గ్రామానికి స్థానిక ఎలక్షన్ లో సర్పంచి రిజర్వేషన్ ఎస్సీ రిజర్వేషన్లు కేటాయించాలని సిరిసిల్ల ఇన్చార్జి కేకే మహేందర్ రెడ్డిని కలిసిన మద్దికుంట గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు దోనుకుల కొండయ్య కలిసి ఈ సందర్భంగా మాట్లాడుతూ మద్దికుంట గ్రామస్తులు గత 30సంవత్సరాల నుండి ఎస్సీ రిజర్వేషన్ రాలేదని ఈసారైనా మాకు రిజర్వేషన్ కలిపించాలని కోరారు. గ్రామ శాఖ కొండయ్య, రాజు, నరేష్, కాశీమ్, బాలయ్య, వెంకట్, బాలయ్య, మండల మహేష్, కొండయ్య, ప్రశాంత్, అశోక్, అంజి, గణేష్ తదితరులు పాల్గొన్నారు

**సామాజిక సేవ కార్యకర్త శ్రీనివాసును సన్మానించిన కేకే**

ముస్తాబాద్ (జనంసాక్షి):ముస్తాబాద్ మండల కేంద్రం చెందిన జనగామ శ్రీనివాస్ చేసిన టువంటి సేవలను గుర్తుచేసి సిరిసిల్ల ఇన్చార్జి కేకే మహేందర్ రెడ్డి మాట్లాడుతూ.22 సంవత్సరాలనుండి యూఏఈ లో చేసిన సామాజిక సేవకు మీ లాంటి వాళ్ళవాల్లనే ఇరోజు మా ప్రభుత్వం గల్ఫ్ సంక్షేమ బోర్డు కు శ్రీ కారం చేశాం గల్ఫ్ లో మీరూ చేసిన సామాజిక సేవాకుడిగా గుర్తింపు గా నన్ను రాజన్న సిరిసిల్లా నియోజకవర్గం ఇంచార్జి కేకే మహేందర్ రెడ్డి రెడ్డి, సామాజిక సేవ కార్యకర్త జనగామ శ్రీనివాసులు శాలువతో ఘనంగా సన్మానించిన కేకే మహేందర్ రెడ్డి ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి గుండం నరసయ్య తలారి నర్సింలు , గజ్జల రాజు, గుండెలి శ్రీనివాస్, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు

# స్వచ్ఛతతో ఆరోగ్యం.. ఆహ్లాదం

**ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**



రుద్రంగి (జనంసాక్షి):పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల స్వచ్చతతో అందరికీ ఆరోగ్యం ఆనందం సిద్దిస్తుందని గ్రామాల్లో సఫాయి కార్మికులు చేస్తున్న పనికి సప్పాయిలు మీకు సలాం అంటూ ప్రభుత్వ విప్, వేములవాడ శాసన సభ్యులు ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. స్వచ్ఛభారత్ మిషన్ గ్రామీణ్, ఆగా ఖాన్ ఫౌండేషన్ సంయుక్తంగా కార్యక్రమం నిర్వహిం చారు. రాష్ట్ర ప్రభుత్వం అగాఖాన్ ఫౌండేషన్‌తో కలిసి రుద్రంగి మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన "స్వచ్ఛత హీ సేవా" కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో ర్యాలీ తీసి, స్వచ్ఛత హీ సేవపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఏక్ పేడ్ మాకీ నామ్ నాటడం కార్యక్రమంలో భాగంగా ఆ స్కూల్ ఆవరణలో ప్రభుత్వ విప్ విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. విద్యార్థులకు స్వచ్ఛత ఈ సేవకు సంబంధించిన పెయింటింగ్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో సఫాయిమిత్ర సురక్ష క్యాంపు నిర్వహించారు. సఫాయి కార్మికులందరికీ ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. పలువురు పారిశుధ్య కార్మికులను సన్మానించి, ప్రభుత్వ విప్ మాట్లాడారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిసరాల పరిశుభ్రత పాటిస్తే సీజనల్గా వచ్చే రోగాలు దూరం అవుతాయని వివరించారు. మొక్కలు నాటి సంరక్షిస్తే ఆరోగ్యం.. పచ్చని చెట్లు ఆహ్లాదాన్ని పంచుతాయని పేర్కొన్నారు.ఇక్కడ ఎంపీడీవో నటరాజ్, ఫౌండేషన్ ప్రతినిధులు సెల్వరాజ్, రమణి, ఎస్ బీ ఎం ఐఈసీ కన్సల్టెంట్ సురేష్, ఎంఐఎస్ కన్సల్టెంట్ బి ప్రేమ్ కుమార్, డీవై ఈఈ ప్రేమ్, వైద్య, పారిశుధ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎంఈఓగా రామకృష్ణ బాధ్యతల స్వీకరణ



రుద్రంగి (జనంసాక్షి):రుద్రంగి మండల ఎంఈఓ గా ఎన్ రామకృష్ణ శనివారం బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ.... మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలు సక్రమంగా సమయపాలనతో నడిపించేందుకు, విద్యార్థులకు ప్రాథమిక సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఆయన గతంలో మానాల హైస్కూల్లో హెడ్మాస్టర్ గా విధులు నిర్వహించారు. విద్యాపరమైన సమస్యలు తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని అన్నారు. మండల విద్యార్థులకు మెరుగైన విద్యను అందించి, ఉపాధ్యాయులతో కలిసి ఉత్తమ ఫలితాలు సాధించడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు.

## మానేరు ప్రవహిత ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**ముత్తారం ఎస్సై గోపతి నరేష్**



ముత్తారం(జనంసాక్షి)
ఇటీవల ప్రస్తున్న భారీ వర్షాల వల్ల ఎగువ ప్రాంతంలో విపరీతంగా వర్షాలు కురవడంతో మానేరు డ్యాంలో అధికంగా నీరు చేరడంతో డ్యాం గేట్లు ఎత్తడం ద్వారా 5000క్యూసిక్ నీటిని కిందికి వదిలేయంతో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎల్ఎండి వారి ఆదేశాల మేరకు మండలంలో మానేరు పరివాహక ప్రాంతమైన పారుపల్లి, ముత్తారం, అడవి శ్రీరాంపూర్, ఖమ్మంపల్లి, జిల్లలపల్లె గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ముత్తారం ఎస్సై నరేష్ శనివారం రోజున ఒక ప్రకటనలో తెలియజేశారు గతకొన్ని రోజులుగా విపరీతంగా కురుస్తున్నా వర్షాలకు ప్రాజెక్టులను పూర్తిగా నిండి నీటి ప్రభావం ఎక్కువ కావడంతో నీటిని కిందికి వదిలివేయడంతో ప్రభావిత ప్రాంతాలలో ప్రమాదము జరుగకుండా మానేరు ప్రవహిత ప్రాంత ప్రజలంతా అగ్రత్తంగా ఉండాలని తెలిపారు.అదేవిధంగా రైతులు మానేరు వాగు ప్రాంతాలకు వెళ్లకూడదని. మేకలు గొర్ల కాపరులు కూడా జాగ్రత్తగా ఉండాలని మత్స్యకారులు చేపల వేటకు వెళ్లకూడదని పాత్రికేయ మిత్రులు వార్త కవరేజ్ కోసం వెళ్లి జరిగే ప్రమాదాన్ని గుర్తించే సమయంలో ప్రమాదాల బారిన పడకూడదని ప్రతి ఒక్కరూ జాగతగా ఉండాలని.అంతేకాకుండా గ్రామాల్లో ఉన్న అధికారులకు ప్రజలకు ఎప్పటికప్పుడు చైతన్య పరుస్తూ ప్రమాదం జరుగకుండా జాగ్రత్త తీసుకోవాలి ఎస్సై నరేష్ తెలిపారు

# రుద్రంగిలో మెగాజాబ్ మేళా

**ప్రారంభించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**
**హాజరైన 12 కంపెనీలు**

రుద్రంగి(జనంసాక్షి):యువత వచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పిలుపు నిచ్చారు.రాజన్న సిరిసిల్ల డిస్ట్రిక్ట్ అడ్మినిస్ట్రేషన్ ఆధ్వర్యంలో రుద్రంగి మండల కేంద్రంలో రెడ్డీస్ ఫంక్షన్ హాల్ మెగా జాబ్ మేళా శనివారం నిర్వహించగా, ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు.జాబ్ మేళాకు జిల్లాతో పాటు హైదరాబాద్ వివిధ జిల్లాలకు చెందిన 12 ప్రైవేటు కంపెనీలు రాగా, 375 మంది యువత వచ్చారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఏర్పాటు చేసిన ఆయా సంస్థల స్టాల్స్ ను సందర్శించారు. ఆయా సంస్థల్లో ఎందరికి ఉపాధి అవకాశాలు కల్పిస్తారు? ఉద్యోగం చేసేది ఎక్కడ? చేసే పని ఏమిటి? వేతనాలు ఎంత ఇస్తారు? వసతి సౌకర్యం కల్పిస్తారా తదితర అంశాలపై ఆరా తీశారు. అనంతరం ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడాతూ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే దాదాపు ఈ తొమ్మిది నెలల్లో 40 వేల ఉద్యోగాలు భర్తీ చేసిందని వెల్లడించారు. ఉద్యోగ నియామకాలకు సంబంధించి ఇప్పటికే జాబ్ క్యాలెండర్ విడుదల చేసిందని గుర్తు చేశారు.గతంలో సిరిసిల్ల జిల్లా కేంద్రంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో, జిల్లా అడ్మినిస్ట్రేషన్ ఆధ్వర్యంలో వేములవాడ పట్టణంలో మెగా జాబ్ మేళా నిర్వహించామని గుర్తు చేశారు. పట్టణ కేంద్రాల్లోనే కాకుండా గ్రామీణ ప్రాంతాల్లో కూడా యువత యువకులకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.యువతకు ఉద్యోగావ కాశాలు కల్పించే అంశంపై పక్కా ప్రణాళికతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళుతుందని తెలిపారు. హైదరాబాద్లో స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నదని వివరించారు. ప్రభుత్వ ఉద్యోగాలతోపాటుగా ప్రైవేటు కంపెనీల్లో యువతకు కొలువులు ఇప్పించేందుకు జాబ్ మేళాలు చేపడుతున్నదని పేర్కొన్నారు. యువత వివిధ అంశాల్లో ప్రత్యేక నైపుణ్యాలు పెంపొందించుకోవాలని పిలుపు నిచ్చారు. యువత ఉద్యోగాలు ఎక్కడ వచ్చినా వెళ్లాలని సూచించారు. ఈ జాబ్ మేళాలో 50 మందికి నియామక పత్రాలను పంపిణీ చేశారు. ఆయా కంపెనీలు 100 మందిని ఎంపిక చేశాయి.. వారిలో తుది పరీక్షల అనంతరం ఎంపికైన వారికి నియామక పత్రాలు అందజేస్తా రని జిల్లా ఉపాధి కల్పన అధికారి రాఘవేందర్ తెలిపారు.ఇక్కడ జిల్లా ఉపాధి కల్పన అధికారి రాఘవేందర్, ఆయా కంపెనీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ కార్మికులు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

**మున్సిపల్ చైర్మన్ తక్కల్లపల్లి రాజేశ్వరరావు**



జమ్మికుంట(జనంసాక్షి):పారిశుద్ద కార్మికులు ఆరోగ్యం పట్ల తగు జాగ్రత్త వహించాలని మున్సిపల్ చైర్మన్ తక్కల్లపల్లి రాజేశ్వరరావు అన్నారు. పట్టణంలోని పాత మున్సిపల్ కార్యాలయంలో వావిలాల పి హెచ్ సి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. రాజేశ్వరరావు మాట్లాడుతూ కార్మికులుఆరోగ్య విషయంలో తగు జాగ్రత్తలు వహి స్తూ పనులు చేయాలని, పరిసరాల పరిశుభ్రత పారిశుద్ధ కార్మికుల పైనే ఆధారపడి ఉందని పేర్కొన్నారు. హెచ్ఐవి ఎయిడ్స్ కు సంబంధించిన కరపత్రాన్ని పంపిణీ చేశారు. హెచ్ఐవి ఎయిడ్స్ పైన సందేహాలు ఉన్నట్లయితే 1097 టోల్ ఫ్రీ నెంబర్ కు ఫోన్ చేసి కనుక్కోవాలని తెలిపారు . వైద్యులు ఫరహానుద్దిన్ ,చందన, మేనేజర్ రాజిరెడ్డి, జిల్లా హెల్త్ ఎద్యుకేటర్ పంజాల ప్రసాద్ గౌడ్, జమ్మికుంట హెల్త్ ఎద్యుకేటర్ మోహన్ రెడ్డి, దిడ్డి నరేందర్, సూ పర్వైజర్లు రత్నకుమారి, అరుణ, ఏఎన్ఎంలు మంజుల, వనజ, రాధా, మహేష్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.



# లాభాల వాటాపై వివరణ ఇవ్వాలి

**సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంద నరసింహారావు**

గోదావరిఖని,జనంసాక్షి:అర్జీ1, ఏరియా జీడీకే–2 ఇంక్లైన్ పిట్ కార్యదర్శి ఏ. శంకరన్న అధ్యక్షతన గేట్ మీటింగ్ జరిగింది, ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంద నరసింహారావు మాట్లాడుతూ 2023–24 సంవత్సరానికి సంబంధించిన లాభాల లెక్కలపై కార్మికులందరూ అయోమయంలో ఉన్నందున యాజమాన్యం గతంలో కార్మికులకు తెలియజేసిన మాదిరి కరపత్రం రూపంలో కార్మికులకు పన్నులకు ముందు పనుల తర్వాత సంస్థ లాభం ఎంత అనేది గత సంవత్సరం కూడా కలిపి తెలియజేయాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు గా డిమాండ్ చేస్తున్నామన్నారు ఖర్చు చేశారు తెలియజేయాలని అన్నారు, ఈ కార్యక్రమంలో అర్జీ1 బ్రాంచి అధ్యక్ష కార్యదర్శులు ఆరెపల్లి రాజమౌళి, మండే శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు తోట నరహరి రావు, బ్రాంచి ఉపాధ్యక్షులు ఎస్.కె గౌస్, వంగల రామన్న, పి శ్రీనివాసరావు, ఏ. శంకరన్న, పి. సమ్మయ్య, బీమా నాయక్, శివరామరెడ్డి, జంగాపల్లి మల్లేష్, ఈదుల సాగర్, కొండపల్లి కృష్ణ, బొంకూరు సురేష్, కార్మికులు పాల్గొన్నారు.

## కోల్ ఇండియా పోటీలలో సత్తా చాటిన ఉద్యోగులు..

గోదావరిఖని, జనంసాక్షి:ఒడిశా రాష్ట్రం సంబల్పూర్ మహానంది కోల్ ఫీల్డ్ లిమిటెడ్ ఐ.బి వ్యాలీ ఏరియాలో నిర్వహించిన కోల్ ఇండియా స్థాయి బాడి బిల్డింగ్, పవర్ వెయిట్ లిఫ్టింగ్ టోర్నమెంట్‌లో ఆర్.జి. 1 ఏరియా ఉద్యోగులు సత్తా చాటారు. అత్యత్తమ ప్రతిభ కనపరిచి మహిళా విభాగం నుండి పవర్ లిఫ్టింగ్ క్యాటగిరిలో ఏరియా హాస్పిటల్ లో పనిచేయుచున్న కుమారి సి.హెచ్. సాయిలత, 84 కేజీల పవర్ లిఫ్టింగ్ విభాగంలో "స్వర్ణ పథకం", ఫిట్టర్ రాజయ్య 84 కిలోల వెయిట్ లిఫ్టింగ్ విభాగంలో "కాంస్య పథకం" సాధించారు. జనరల్ మేనేజర్ డి.లలిత్ కుమార్ చీఫ్ డి.కిరణ్ బాబు బంగారు సారంగపాణి అభినందించారు.



## కాంగ్రెస్‌లో బీసీలకు పెద్దపీట

గౌడ్ చిట్ చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలోనే టీపీసీసీ కార్యకర్గ విస్తరణ చేపడతామని.. డీసీసీ బాధ్యతలు ఎమ్మెల్యేలకు ఇవ్వాలనే ప్రతిపాదన ఉందని వెల్లడించారు. పీసీసీ కార్యకర్గ విస్తరణపై త్వరలోనే ఏఐసీసీ పెద్దలను కలుస్తామని పేర్కొన్నారు. ఇతర పార్టీల ఎమ్మెల్యేల చేరికలతో స్థానిక కాంగ్రెస్ నేతలు ఇబ్బంది పడుతున్నది వాస్తవమేనని.. కొత్త పాత నేతల మధ్య సమన్వయం కోసం ప్రయత్నిస్తు న్నామని చెప్పారు. మల్లన్న సాగర్ బాధితులకు న్యాయం చేయాలన్న బీఆర్ఎస్ మాజీ మంత్రి హరీష్ రావు వ్యాఖ్యలపై మండిపడ్డారు. బీఆర్ఎస్ పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు మల్లన్న సాగర్ బాధితుల కన్నీళ్లు హరీష్ రావుకు కనిపించలేదా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మల్లన్న సాగర్ నిర్వాసితులను పరామర్శించేందుకు మేము వెళ్తే మమ్మల్ని పోలీసులు అరెస్ట్ చేయలేదా అని నిలదీశారు. మల్లన్న సాగర్ బాధితులకు కాంగ్రెస్ ప్రభుత్వం అన్నివిధాలా న్యాయం చేస్తోందన్నారు. హైడ్రా, మూసీ అభివృద్ధితో సామాన్యులకు కొంత ఇబ్బందైనా.. హైదరాబాద్ మొత్తానికి లాభం జరుగుతుందని స్పష్టం చేశారు.



# సిన్నర్‌కు షాక్

## డోపింగ్ కేసులో టెన్నిస్ వరల్డ్ నంబర్ 1కు చర్యలకు నిర్ణయం

యూఎస్ ఓపెన్ గెలుపొందిన టెన్నిస్ వరల్డ్ నంబర్ 1 జన్నిక్ సిన్నర్‌కు మరో షాక్. డోపింగ్ కేసు నుంచి బయటపడిన అతడిని ప్రపంచ డ్రగ్స్ నిరోధక సంస్థ మాత్రం వదలిపెట్టడం లేదు. తాజాగా వాడా అతడికి వ్యతిరేకంగా కోర్ట్ ఆఫ్ అర్బిట్రేషన్ (కాస్)ను ఆశ్రయించింది. సిన్నర్‌పై ఒకటి లేదా రెండేండ్ల నిషేధం విధించాలని తన అప్పీల్‌లో డిమాండ్ చేసింది. అసలేం జరిగిందంటే..?

ఈ ఏడాది మార్చిలో సిన్నర్‌కు డోపింగ్ పరీక్షలు నిర్వహించారు. అతడి నమూనాల్లో నిషేధిత క్లొస్టెబొల్ డ్రగ్‌కు పాజిటివ్ వచ్చింది. దాంతో, ఈ విషయమై అంతర్జాతీయ టెన్నిస్ సమీకృత సంఘం అతడిని ప్రశ్నించింది. అయితే. ఫిజియో థెరపీ చికిత్స సమయంలో అనుకోకుండా తాను క్లొస్టెబొల్ డ్రగ్ ఉన్న మందులు తీసుకొని ఉండవచ్చని, అందులో తన తప్పేమీ లేదని ఐటీఐఏకు సిన్నర్ వివరణ ఇచ్చాడు.

అతడి సమాధానంతో సంతృప్తి చెందిన టెన్నిస్ సమాఖ్య సిన్నర్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దాంతో, మళ్లీ రాకెట్ అందుకున్న ఇటలీ కెరటం యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ విజేతగా నిలిచాడు. ఏకపక్షంగా సాగిన ఫైన్ పోరులో అమెరికా సంచలనం టేలర్ ఫ్రిట్జ్‌ను చిత్తు చేసిన సిన్నర్ కెరీర్‌లో రెండో గ్రాండ్‌స్లామ్ కొల్లగొట్టాడు.

అయితే.. వాడా మాత్రం నిషేధిత డ్రగ్ నమూనాల్లో ఉన్నందున సిన్నర్ దోషి అని, అతడిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కాస్‌కు అప్పీల్ చేసింది. ఈ మేరకు తమ వెబ్‌సైట్‌లో వాడా సెప్టెంబర్ 26న సిన్నర్‌పై కాస్‌కు ఫిర్యాదు చేశామని తెలిపింది. టాప్ సీడ్ విషయంలో ట్రిబ్యూనల్ తీసుకున్న నిర్ణయం సరికాదని, తక్షణమే సిన్నర్‌పై ఏడాది లేదా రెండేండ్ల పాటు నిషధం విధించాలని విన్నవించినట్టు వెల్లడించింది.

# కుప్పకూలిన కివీస్

## అరంగేట్ర స్పిన్నర్ ధాటికి న్యూజిలాండ్ ఆలౌట్

- 88 పరుగులతో శ్రీలంకపై చెత్త రికార్డు నమోదు
- చెలరేగిన ప్రభాత్ జయసూర్య, అరంగేట్ర స్పిన్నర్ నిషాన్ పీరిస్

గాలే స్టేడియంలో జరుగుతున్న రెండో టెస్టులో న్యూజిలాండ్ కుప్పకూలింది. సుదీర్ఘ ఫార్మాట్‌లో శ్రీలంక పై చెత్త రికార్డు నమోదు చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో బ్యాటర్ల వైఫల్యంతో 88 రన్స్‌కే పర్యాటక జట్టు ఆలౌటయ్యింది. 1992 తర్వాత లంకపై మరీ ఇంత తక్కువకు న్యూజిలాండ్ ఆలౌట్ కావడం ఇదే తొలిసారి. ఇంతకుముందు లంకపై 102కు కివీస్ పది వికెట్లు కోల్పోయింది. మూడో రోజు ఆట మొదలైన కాసేపటికే ప్రభాత్ జయసూర్య(6/42), అరంగేట్ర స్పిన్నర్ నిషాన్ పీరిస్(3/33)లు విజృంభించారు. కివీస్ ఆటగాళ్లను వరుసపెట్టి పెవిలియన్ చేర్చి పతనాన్ని శాసించారు.

ఓవైపు అందరూ క్యూ కడుతుంటే.. ఆల్‌రౌండర్ మిచెల్ శాంటన్నర్ 29 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడంటే అర్థం చేసుకోవచ్చు లంక బౌలర్లు ఏ మేర చెలరేగారో. ఫాలో ఆన్‌లోనూ న్యూజిలాండ్ ఆట మారలేదు. 121 పరుగులకే సగం వికెట్లు కోల్పోయి ఓటమి అంచున నిలిచింది.

శ్రీలంక పర్యటనలో న్యూజిలాండ్ జట్టు తేలిపోతోంది. బ్యాటర్ల వైఫల్యంతో తొలి టెస్టులో కంగుతిన్న కివీస్.. రెండో టెస్టులోనూ ఓటమి దిశగా పయనిస్తోంది. తొలుత ప్రభాత్ జయసూర్య(6/42), నిషాన్ పీరిస్(3/33)లు చెలరేగడంతో పర్యాటక జట్టు 88 పరుగులకే కుప్పకూలింది. రమేశ్ మెండిస్ స్థానంలో జట్టులోకి వచ్చిన నిషాన్ తన తొలి మ్యాచ్‌లోనూ మ్యాజిక్ చేశాడు. కీలక వికెట్లు తీసి తన ఆగమనాన్ని ఘనంగా చాటాడు. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లోనూ నిషాన్ ధాటికి కివీస్ కుదేలైంది. ఓపెనర్ డెవాన్ కాన్వే(61) పట్టుదలతో అర్ధ సెంచరీతో కొట్టగా.. కేన్ విలియమ్సన్(46) భారీ స్కోర్ చేయలేకపోయాడు.

తొలి టెస్టులో చివరిదాకా పోరాడిన రచిన్ రవీంద్ర(12)ను సైతం బౌల్డ్ చేసిన నిషాన్ ఆతిథ్య జట్టును విజయానికి మరింత దగ్గర చేశాడు. 121 పరుగులకే టాప్ ఆటగాళ్లంతా డగౌట్‌కు చేరిన వేళ టామ్ బ్లండెల్(26 నాటౌట్), గ్లెన్ ఫిలిప్స్(10)లు ఆచితూచి ఆడుతున్నారు. వీళ్లు ఇప్పటికైతే ఆరో వికెట్‌కు 36 రన్స్ జోడించారు. అయినా న్యూజిలాండ్ ఇంకా 357 పరుగులు వెనకబడి ఉంది. చూస్తుంటే.. మూడో రోజు ఆట ముగిసే లోపు లేదా నాలుగో రోజు తొలి సెషన్‌లోనే లంక జయభేరి మోగించడం ఖాయమనిపిస్తోంది. మొదటి ఇన్నింగ్స్‌లో శ్రీలంక 602–5 వద్ద డిక్లేర్ చేసింది. కమిందు మెండిస్, కుశాల్ మెండిస్, దినేశ్ చండిమల్‌లు సెంచరీలతో విరుచు కుపడగా తొలి రోజే లంక టెస్టుపై పట్టు బిగించింది.





# వర్షార్పణం

**బంతి పడకుండానే రెండో రోజు ఆట రద్దు..**

**కాన్పూర్:** కాన్పూర్‌లోని గ్రీన్ పార్క్ గ్రౌండ్‌లో బంగ్లాదేశ్‌తో జరుగుతున్న రెండో టెస్టు రెండో రోజు ఆట రద్దు అయ్యింది. ఒక్క బంతి పడకుండానే ఆటను రద్దు చేశారు. ఉదయం నుంచి పలు మార్లు కాన్పూర్‌లో వర్షం పడింది. కవర్స్‌ను మైదానం నుంచి తీయలేదు. ఉదయం చిన్నపాటి జల్లుగా పడిన వాన.. ఆ తర్వాత భారీ వర్షంగా మారింది. దీంతో గ్రౌండ్‌లోని కవర్స్ తీయకుండానే ఉండిపోయాయి. కొంత సమయం వర్షం ఆగినా.. సూపర్ సోపర్లతో ఆ నీటిని తొలగించే ప్రయత్నం చేశారు. అయితే మబ్బు పట్టడం వల్ల విజిబులిటీ తగ్గింది. పరిస్థితుల్లో ఎటువంటి మార్పు లేకపోవడంతో.. రెండో రోజు ఆటను మధ్యాహ్నం 2.15 నిమిషాలకు రద్దు చేశారు. వాతావరణ శాఖ నివేదిక ప్రకారం ఆదివారం కూడా కాన్పూర్‌లో వర్షం పడే అవకాశాలు ఉన్నాయి. సోమ, మంగళవారాలు మాత్రం వెచ్చగా ఉండనున్నది. తొలి రోజు 35 ఓవర్లు ఆడిన బంగ్లాదేశ్ 3 వికెట్లు కోల్పోయి 107 రన్స్ చేసిన విషయం తెలిసిందే

# ఫ్రాంచైజీ

## యజమానుల్లో ఉత్కంఠ

గత రెండు మూడు నెలలుగా ఆటగాళ్ల రిటెన్షన్ విధానంపై ఎటూ తేల్చని బీసీసీఐ ఉత్కంఠకు తెరదించ నుంది. ఐపీఎల్ మెగా వేలం నేపథ్యంలో ఎంత మందిని అట్టిపెట్టుకోవచ్చు? అనే విషయమై మరికొన్ని గంటల్లోనే ప్రకటన చేయనుంది. శనివారం ఐపీఎల్ కార్యనిర్వాహక మండలి రిటెన్షన్ రూల్‌పై చర్చించనుంది. అందుకోసం బెంగళూరులోని ఫోర్ సీజన్స్ హెూటల్‌లో సమావేశం అవుతోంది. ఈ మీటింగ్ అనంతరం ఎంతమందిని అట్టిపెట్టుకోవాలి? అనేది స్పష్టం చేయనుంది. దాంతో, ఐపీఎల్ ఫ్రాంచైజీ యాజమానులతో పాటు అభిమానుల్లో ఉత్కంఠ నెలకొంది.



ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో రిటెన్షన్ నియమంతో పాటు వేలం ఎక్కడ నిర్వహించాలి? ఫ్రాంచైజీల వద్ద ఎంత డబ్బు ఉండాలి? అనే విషయాలు కూడా చర్చకు రానున్నాయి. 'మేము కొన్ని ప్రధాన అంశాలపై చర్చించాల్సి ఉంది. రిటెన్షన్ పర్స్, రైట్ టు మ్యాచ్(ఆర్‌టీఎమ్) కార్డ్స్, వేలం జరుగబోయే వేదిక.. ఇలా వీటన్నింటిపై ఓ అభిప్రాయానికి రావాలి. ఈరోజుతో అన్ని విషయాలను తేల్చేస్తాం. ఆ వెంటనే మీడియా వేదికగా ప్రకటన విడుదల చేస్తాం' అని ఐపీఎల్ వర్గాలు వెల్లడించాయి. అయితే.. ఈసారి కనీసం ఐదు లేదా ఆరుగురిని అట్టిపెట్టుకునేందుకు అనుమతించనుందని సమాచారం. అదే జరిగితే.. జట్టు కూర్పుకోసం భారీగా ఖర్చు చేసిన చెన్నై సూపర్ కింగ్స్, ముంబై ఇండియన్స్ ఫ్రాంఐజీలకు అది తీపికబురే. ఆనవాయితీ ప్రకారం ప్రతి మూడేండ్లకు ఓసారి ఐపీఎల్ మెగా వేలం జరుగుతుంది. ఇప్పుడు ఆక్షన్ సమయం రానే వచ్చింది. అందుకని అన్ని ఫ్రాంచైజీలు ఎవరిని అట్టిపెట్టుకోవాలి? ఎవరిని వదిలేయాలి? అనే జాబితా తయారు చేసుకునే పనిలో ఉన్నాయి. కానీ, బీసీసీఐ ఇంతవరకూ రిటెన్షన్‌కు సంబంధించి ఎలాంటి ప్రకటన చేయలేదు.

దాంతో, ఈరోజు జరుగబోయే గవర్నింగ్స్ కౌన్సిల్ సమావేశంపైనే అందరి కళ్లు నిలిచాయి. ఇక వేలం వేదిక విషయానికొస్తే.. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో జరగనుందనే వార్తలు వినిపిస్తున్నాయి. నవంబర్ చివరి వారం లేదా డిసెంబర్ మొదటి వారంలో వేలం ప్రక్రియను పూర్తి చేయాలని బీసీసీఐ, ఐపీఎల్ పాలక మండలి భావిస్తున్నాయి.

# అప్పుడు పంత్.. ఇప్పుడు ముషీర్



దేశవాళీ క్రికెట్‌లో పరుగుల వరద పారిస్తూ.. భావితారగా ప్రశంసలు అందుకుంటున్న యువ ఆటగాడు ముషీర్ ఖాన్ జోరుకు బ్రేక్ పడింది. ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో గొప్పగా రాణిస్తున్న అతడు ఇరానీ కప్ ముందు కారు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. లక్నో సమీపంలో ముషీర్ ప్రయాణిస్తున్న కారు యాక్సిడెంట్‌కు గురైంది. ఈ ప్రమాదంలో అతడికి మెడ భాగంలో ఎముక విరిగింది. దాంతో ముషీర్ మూడు నెలలు తనకెంతో ఇష్టమైన ఆటకు దూరం కానున్నాడు. భారత క్రికెట్‌లో ఈమధ్య కాలంలో ఇది రెండో కారు యాక్సిడెంట్.

రెండేండ్ల క్రితం రిషభ్ పంత్ రూర్కీ సమీపంలో జరిగిన కారు ప్రమాదం నుంచి మృత్యుంజయుడిలా బయటపడ్డాడు. ఇప్పుడు ముషీర్‌కు కూడా ప్రాణాపాయం తప్పింది. అంతర్జాతీయ కెరీర్ ఘనంగా సాగుతుండగా పంత్.. ఫస్ట్ క్లాస్‌లో మ్యాచ్ విన్నర్‌గా పేరు వస్తున్న క్రమంలో ముషీర్ అనూహ్యంగా ప్రమాదానికి గురయ్యారు.

ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ పర్యటనలో వీరోచిత ఇన్నింగ్స్‌లతో జట్టును గెలిపించిన పంత్.. ఆ యాక్సిడెంట్ కారణంగా ఏడాదిన్నర పాటు ఆటకు దూరమయ్యాడు. ఐపీఎల్ 17వ సీజన్‌తో పునరామనం చేసిన డాషింగ్ బ్యాటర్.. ఆ తర్వాత టీ20 వరల్డ్ కప్‌లో దుమ్మురేపాడు. తాజాగా చెపాక్ టెస్టులో మెరుపు సెంచరీతో రికార్డులు బద్ధలు కొట్టేశాడు. పంత్ మాదిరిగానే ముషీర్ కూడా త్వరగా కోలుకొని మళ్లీ టాప్ గేర్‌లో ఆడాలని అభిమానులు కోరుకుంటున్నారు.

# తొలి రౌండ్‌లోనే బోపన్న ఇంటికి

భారత సీనియర్ టెన్నిస్ ఆటగాడు రోహన్ బోపన్న ఓటముల పరంపర కొనసాగుతోంది. యూఎస్ ఓపెన్‌లో క్వార్టర్స్‌కు ముందే ఇంటిదారి పట్టిన బోపన్న.. తాజాగా చైనా ఓపెన్‌లోనూ నిరాశపరిచాడు. ఏటీపీ 500 టోర్నీ అయిన చైనా ఓపెన్ పురుషుల డబుల్స్‌లో ఇవాన్ డోడిగ్(క్రొయేషియా)తో కలిసి ఆడిన భారత స్టార్‌కు తొలి రౌండ్‌లోనే చుక్కెదురైంది. శనివారం జరిగిన మ్యాచ్‌లో బోపన్న ద్వయానికి అన్‌సీడెడ్ ఆటగాళ్లు చెక్ పెట్టారు. చైనా ఓపెన్‌లో ఫేవరెట్‌గా అడుగుపెట్టిన బోపన్న – ఇవాన్ జోడీకి ఫ్రాన్సిస్కో సెరునుడొలో, నికోలస్ జారీలు ఊహించని షాక్ ఇచ్చారు. హెూరాహెూరీగా సాగిన మ్యాచ్‌లో ఫ్రాన్సిస్కో నికోలస్ ద్వయం బోపన్న జంటకు గట్టి పోటీనిచ్చింది. తొలి సెట్‌ను ఒక్క పాయింట్ తేడాతో గెలుపొంది.. రెండో సెట్‌ను కూడా అంతే తేడాతో సొంతం చేసుకుంది. దాంతో, బోపన్న ద్వయం 5–6, 6–7తో అనూహ్యంగా ఓటమి పాలైంది.

భారత స్టార్ బోపన్న క్రొయేషియా కెరటం ఇవాన్‌తో కలిసి ఆడడం ఇదే మొదటిసారి కాదు. వీళ్లిద్దరూ 2017 ఏటీపీ మాంట్రియల్ మాస్టర్స్ 1000 టోర్నీలో దుమ్మురేపారు. కానీ, ఆఖరి మెట్టుపై తడబడి రన్నరప్‌తో సరిపెట్టుకున్నారు.



# జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాలను నివారించండి

- ప్రమాదమున్న చోటను గుర్తించి తక్షణ చర్యలు తీసుకోండి
- రోడ్డు భద్రతపై అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్




వికారాబాద్ జిల్లా బ్యూరో, (జనం సాక్షి) : రోడ్డుప్రమాదాలు నివారించేందుకు తగు జాగ్రత్త చర్యలను చేపట్టాలని సంబంధిత అధికారులను వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశించా రు. శనివారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో రోడ్డు భద్రత కమిటీ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జాతీయ రహదారులపై అధిక సంఖ్యలో ప్రమాదాలు జరుగుతున్నాయని వీటిని నివారించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పోలీసు, రవాణా, జాతీయ రహదారులు తక్షణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ప్రమాద స్తలాలను గుర్తించి ప్రమాదాలు జరగకుండా స్పీడ్ బ్రేకర్లు, సూచిక బోర్డులను ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించేం దుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రమాదాల నివారణకు పోలీసు, రెవెన్యూ, ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్, పంచాయతీ కార్యదర్శి, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్, ఆర్ అండ్ బి, జాతీయ రహదారుల ఇంజనీర్లను భాగస్వామ్యం చేస్తూ కమిటీ వేయాలని కలెక్టర్ సూచించారు. ఈ కమిటీల ఆధ్వర్యంలో ప్రమాద స్థలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నివేదికలను సమర్పించాలని కలెక్టర్ తెలిపారు. రోడ్డు ప్రమాదాల్లో మరణించిన బాధిత కుటుంబాలకు మార్గదర్శకాలకు అనుగుణంగా నష్టపరిహారం చెల్లించాలని కలెక్టర్ సూచిం చారు. రోడ్డు ప్రమాదాలు జరిగే క్రమంలో ఘటనా స్థలంలో క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆసుపత్రులకు తరలించడం, అత్యవసరమైన సేవలు అందించిన వారిని గుర్తించి వారికి తగు ప్రోత్సాహకాలు అందించాలన్నారు.

పరిగి, కొడంగల్, పోలీస్, రవాణా, జాతీయ రహదారుల అధికారులు సంయుక్తంగా ప్రమాదకర స్తలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రమాదాలకు గల కారణాలను స్పష్టంగా తెలుసుకొని ప్రమాదాల నివారణకు తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. జాతీయ రహదారికి గ్రామాల నుండి కలిపే అనుసంధాన రోడ్లకు ఇరువైపులా ఉన్న పొదలను తొలగించాలని అదేవిధంగా అవసరమైన స్థలాల్లో స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా సూపరిండెంట్ ఆఫ్ పోలీస్ కె.నారాయణ రెడ్డి మాట్లాడుతూ... ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టడం జరుగుతుందని అన్నారు. ఇందులో భాగంగా డ్రంక్ అండ్ డ్రైవ్, హెల్మెట్ ధరించని, ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించే వారిపై చర్యలు చేపట్టడం జరుగుతుందని ఆయన అన్నారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు శాఖాపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన వెల్లడించా రు. ఈ సమావేశంలో తాండూర్ సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, జిల్లా రవాణా అధికారి వెంకట్ రెడ్డి, పంచాయతీ రాజ్ ఇ.ఇ ఉమేష్ , ఆర్ అండ్ బి ఇన్చార్జి ఇ.ఇ. శ్రీధర్ రెడ్డి లతోపాటు తాండూర్, వికారాబాద్, కొడంగల్, పరిగి డిఎస్పీలు, ఎక్సైజ్ శాఖ, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.



# ఉద్యోగులకు రూరల్ ఏరియా అలవెన్స్ ఇవ్వాలి

పెద్దెముల్ సెప్టెంబర్28(జనం సాక్షి) : గ్రామీణ ప్రాంత ఉద్యోగులకు 10% రిమోట్ రూరల్ ఏరియా అలవెన్స్ ఇవ్వాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు వెంకటరత్నం, జిల్లా ఉపాధ్యక్షుడు నర్సింలు అన్నారు. శనివారం పెద్దెముల్ మండల పరిధిలోని జనగాం, గొట్లపల్లి, పాషాపూర్, తట్టేపల్లి, కందనెల్లి తదితర పాఠశాలల్లో యూటీఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. డీడీఓ బాధ్యతలను స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుల నుంచి తొలగించి ఎంఈఓలకు అప్పగించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పాండు రంగం, సంఘ సీనియర్ సలీం, విజయ్ కుమార్ తదితరులు ఉన్నారు.



# తుపాకీతో కాల్చుకొని కానిస్టేబుల్ ఆత్మహత్య



రంగారెడ్డి జిల్లా ప్రతినిథి సెప్టెంబర్ 28 (జనంసాక్షి) : రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో ఎఆర్ కానిస్టేబుల్ తుపాకీతో కాల్చుకొని ఆత్మహత్యకు పాల్పడటం కలకలం రేపింది. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని మంచాల గ్రామానికి చెందిన బాలకృష్ణ రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఏఆర్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. కలెక్టరేట్‌లో శనివారం తెల్లవారుజామున బాత్రూంలోకి వెళ్లి సూసైడ్ నోట్ రాసి తనవద్ద వున్న గన్‌తో కాల్చుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతి చెందినప్పుడు మృతుడితో పాటు సహ ఉద్యోగులు ముగ్గురు ఉన్నట్లు సమాచారం. మృతదేహాన్ని ఆదిభట్ల పోలీసులు నగరంలోని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. తన చావుకు ఎవరితో సంబంధం లేదన్నట్లు బాలకృష్ణ సూసైడ్ నోట్ రాసి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఏసీపీ కేపీవీ రాజు తెలిపారు. శనివారం తెల్లవారుజామున 3.30 గంటలకు కానిస్టేబుల్ ఆత్మహత్య చేసుకున్నట్లు కలెక్టరేట్ నుంచి సమాచారం వచ్చిందని ఏసీపీ అన్నారు. కానిస్టేబుల్ తన తుపాకీతో తనే కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం అందినవెంటనే ఘటన స్థలానికి చేరుకుని అన్ని సాక్ష్యాధారాలు కూడా సేకరించామన్నారు. కానిస్టేబుల్ తండ్రి దూసరి సత్తయ్య వద్ద సమాచారం సేకరించామన్నారు. కానిస్టేబుల్ బాలకృష్ణకు ఒక అక్క, ఒక చెల్లెలు ఉన్నారని తెలిపారు. వారిద్దరికి కూడా వివాహం అయ్యిందని, అందలో ఒకరు కానిస్టేబుల్ విధులు నిర్వహిస్తున్నట్లు వివరించారు.

# రైతుకు దిక్కెవ్వరు

- వాగు దాటాలి అంటే రైతుల గోస వర్ణనాతీతం
- నాగసముందర్ గ్రామ రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి
- బ్రిడ్జి నిర్మాణం వెంటనే చేపట్టాలి
- సిపియం జిల్లా కార్యవర్గ సభ్యులు కే. శ్రీనివాస్



యాలాల్ సెప్టెంబర్ 28 (జనంసాక్షి) : యాలాల మండలంలోని నాగసముందర్ గ్రామంలో రైతులు పంట పొలాలకు వెళ్లేందుకు బిడ్జి నిర్మాణం చేపట్టాలని సిపియం ఆధ్వర్యంలో రైతులతో కలిసి పంట పొలాలకు వెళ్ళే దారిని సందర్శించారు. ఈ సందర్భంగా సిపియం జిల్లా కార్యవర్గ సభ్యులు కే. శ్రీనివాస్,యు.బుగ్గప్ప, యం.ఎస్.పి జిల్లా నాయకులు డి. మహేందర్‌లు మాట్లాడుతు యాలాల మండల పరిధిలోని నాగ సముందర్ గ్రామంలోని రైతులు వారి పంట పొలాలకు వెళ్లేందుకు వర్షంకాలంలో తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కోవడం జరుగుతుంది అన్నారు. సుమారు 500మంది రైతులు ప్రతిరోజు పంట పొలాలకు రాకపోకలు చేస్తుంటారని తెలిపారు. శివసాగర్ ప్రాజెక్టులో బ్యాక్ వాటర్ నిల్వ ఉండడంతో వాగు దాటాలి అంటే రైతుల గోస వర్ణనాతీతంగా ఉందన్నారు. రైతులు వాగు దాటడానికి ప్లాస్టిక్ డ్రమ్ములతో చేసిన పడవల్లో ప్రయాణం చేయవలసి వస్తుందన్నారు. లేదంటే 20కిలో మీటర్లు చుట్టూ తిరిగి వెళ్లాలని అన్నారు. గత ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు అనేకమార్లు రైతులు ఉన్నతాధికారులకు, పాలకులకు విన్నవించినా రైతులను పట్టించుకోకపోవడం సిగ్గుచేటని విమర్శించారు.రైతే రాజు అని గొప్పలు చెబుతున్న ప్రభుత్వాలు మరి నాగసముందర్ రైతులు అనేక రోజులుగా పడుతున్న ఇబ్బందులు పాలకులకు కనిపించడం లేదా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం నాగసముందర్ గ్రామ రైతులు ఎదురు చూస్తున్న బ్రిడ్జిని నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు.ఈ సమస్య పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం విడాలని, వెంటనే సమస్య పరిష్కారం అయ్యేందుకు కృషి చేయాలని లేకుంటే రైతులతో కలిసి సమస్య పరిష్కారం అయ్యే వరకు పోరాటం నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు నర్సిములు, నరేష్, రాములు, నరేందర్, బల్ల మల్లప్ప, పాండు రంగా రెడ్డి, వెంకటయ్య, పెంటప్ప, మొగులయ్య తదితరులు పాల్గొన్నారు.

# నేటి యువతకు భగత్ సింగ్ ఆదర్శం

**జెవివి రాష్ట్ర కోశాధికారి నాగరాజు**




కాప్రా, సెప్టెంబర్ 28 (జనంసాక్షి) : బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా దేశ స్వాతంత్రం కోసం అతి చిన్న వయసులోనే ప్రాణత్యాగం చేసిన భగత్ సింగ్ చిరస్మరణీ యుడు అన్ని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కోశాధికారి నాగరాజు అన్నారు. శనివారం కుషాయిగూడ పారిశ్రామిక వాడలోని జనవిజ్ఞాన వేదిక మేడ్చల్ జిల్లా కార్యాలయంలో భగత్ సింగ్ జయంతి ని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలదండ వెసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పి.నాగరాజు మాట్లాడుతూ.. చిన్న వయస్సులోనే ప్రాణాలర్పించిన భగత్‌సింగ్ ఆశయాల కోసం ఉద్యమించాలన్ని, 23 సంవత్సరాల వయస్సులోనే దేశ స్వాతంత్ర్యం కోసం ఊరి కొయ్యను ముద్దాడిన ధీరుడు భగత్ సింగ్ అన్ని, నా దేహం కన్నా దేశం గొప్పది అని నినదించిన త్యాగశీలి భగత్ సింగ్ అన్నారు. చిన్న వయస్సులోనే స్వాతంత్ర సంగ్రామంలో పాల్గొనే బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన యోధుడు భగత్ సింగ్ అన్నారు. ఆయన పోరాటపటిమా నేటి యువతకు స్ఫూర్తిదాయకగా తీసుకొని, సైంటిఫిక్ టెంపర్ ను ప్రజలకు విస్తృతంగా తీసుకువెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక మేడ్చల్ జిల్లా కోశాధికారి జెన్ని నాయకులు శివశంకర్ రెడ్డి, శివప్రసాద్, రామ్మోహన్ రావు, ఉజ్మా తదితరులు ఉన్నారు.

## నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు

# కల్పించేందుకు కృషి చేస్తా..

- కరీంనగర్ లో పలు చోట్ల వాకర్స్ ను కలసి మద్దతు కోరిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వి.నరేందర్ రెడ్డి



కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 28 (జనంసాక్షి) : రాష్ట్రంలో నిరుద్యోగులకు అండగా నిలువడానికి సేవకుడుగా పని చేసేందుకు పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా బరిలో ఉంటున్నానని కరీంనగర్, ఆదిలాబాద్, మెదక్, నిజామాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వి.నరేందర్ రెడ్డి తెలిపారు. శనివారం రోజు కరీంనగర్ జ్యోతిబా పూలే, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల మైదానంలో వాకర్స్ తో సమావేశం నిర్వహించారు. రానున్న పట్టభద్రుల ఎన్నికల్లో తనకు మద్దతు తెలపాలని కోరారు. గత 34 సంవత్సరాలుగా విద్యారంగంలో సేవలు అందించానని రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గ్రాడ్యుయేషన్ పూర్తయిన వారు తప్పకుండా ఓటు హక్కు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఇప్పటివరకు చాలా మంది నాయకులు రాజకీయ భవిష్యత్తు కోసం పనిచేశారని, కాని నేను మాత్రం ఒక సేవకుడుగా పనిచేస్తానని పట్టభద్రులకు భరోసా ఇస్తున్నానని, నన్ను అందరించండి మీకు అండగా నేనుంటానని తెలిపారు.

# అటవీ సంపదను కాపాడుకోవాలి

- కూలిన చెట్లను పునర్జీవించేలా చర్యలు చేపట్టాలి
- మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్





ఏటూరునాగారం, సెప్టెంబర్ 28(జనంసాక్షి) : ములుగు జిల్లా తాడ్వాయి, మేడారం అడవీమార్గంలో ఆగస్టు 30న భారీ పెనుగాలులకు కూలిపోయిన చెట్లను కాపాడుకోవాలని, వాటి స్థానంలో నూతనంగా మొక్కలను నాటాలని, పునర్జీవించేలా చర్యలు చేపట్టాలని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. శనివారం తాడ్వాయి మండలంలోని మేడారం ప్రధాన రోడ్డులో నేలబారిన చెట్లను నాయకులు, రిటైర్డ్ అటవీశాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బంగాళకాతం, ఆరేబీయా సముద్రంలో జరిగిన గాలుల ఒత్తిడి ఈ ప్రదేశంలో పడడం వల్ల సుమారు 15వందల ఎకరాల వరకు చెట్లు నేలబారాయి అన్నారు. అందమైన అడవి నేలకూలి భయభ్రాంతులకు గురిచేసిందన్నారు. స్థానిక ఎమ్మెల్యే మంత్రి సీతక్క ఈ కూలిన చెట్ల ప్రదేశాలకు ఎవరు వెళ్లకుండా, ఎవరు కూడా హానీ తలపెట్టకుండా ఇరువైపు కంచెను ఏర్పాటు చేయాలన్నారు. కేంద్రం నుంచి క్యాంపన్ నిధులతో ఈ సంరక్షణ చర్యలు చేపట్టాలని అటవీశాఖ మంత్రి సురేఖను కోరారు. స్థానిక ప్రజలు, అటవీశాఖ అధికారులు ఈ కూలినచెట్ల ప్రదేశాల్లో మళ్లీ మొక్కలను పెంచాలని కోరారు. మేడారం సమ్మక్క సారలమ్మ దయతోనే మనం క్షేమంగా ఉన్నామన్నారు. ఆ తల్లి దర్శనానికి వచ్చే భక్తులు సైతం ఇక్కడ వంట చేసుకోవద్దని, నిప్పుపెట్టొద్దని వేడుకున్నారు. మన అడవీని మనం రక్షించుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు, మాజీ జెడ్పీ చైర్మన్ బడే నాగజ్యోతి, నాయకులు దుర్గం రమణయ్య, సుధీర్, గోవింద్‌నాయక్, మస్రగాని కుమారస్వామి, కాకులమర్రి ప్రదీప్‌బాబు, తాడూరి రఘు, బాస పుల్లయ్య, భాస్కర్, గండెపల్లి నర్సయ్య, కాతం యాదగిరి, ఖలీల్, చంద్రబాబు, బోజారావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## జెఎన్‌యూకు ఓపెన్ వర్సిటీ భూమి ఇవ్వొద్దు

- సిఎం రేవంత్‌కు విద్యావంతుల లేఖ

హైదరాబాద్, సెప్టెంబర్ 28 (జనంసాక్షి) : అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీకి చెందిన భూమిని జవహర్ లాల్ నెహ్రూ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయానికి కేటాయించడం సరికాదంటూ ..సీఎం రేవంత్‌రెడ్డికి తెలంగాణ విద్యావేత్తలు బహిరంగ లేఖ పంపారు. లేఖ రాసిన వారిలో ఎమ్మెల్సీ కోదండరామ్, హరగోపాల్, ఘంటా చక్రపాణి, దొంతి నరసింహారెడ్డి ఉన్నారు. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీకి చెందిన భూమిని జవహర్ లాల్ నెహ్రూ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయానికి కేటాయిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. నామమాత్రం ఫీజుతో విద్య అందిస్తున్న ఏకైక వర్సిటీ అంబేద్కర్ విశ్వవిద్యాలయం అని చెప్పారు. దీన్ని నిలబెట్టుకోవాల్సిన అవసరం అందరిపై ఉందని పేర్కొన్నారు.

## నడిరోడ్డుపై దిగబడిన స్కూల్ బస్సు



వరంగల్ ఈస్ట్ సెప్టెంబర్ 28 (జనంసాక్షి) : వరంగల్ తూర్పు నియోజకవర్గం లోని కరీమాబాద్ బొమ్మల గుడి వద్ద నడిరోడ్డుపై స్కూల్ బస్సు దిగబడి పోయింది. ప్రధాన రహదారి కావడం వల్ల వాహనదరులు రాకపోకలు బంద్ అయ్యాయి. రోడ్డు విస్తరణలో భాగంగా పనులు జరుగుతుండగా రోడ్డుపై ఏర్పడ్డ గుంతలో శ్రీ చైతన్య స్కూల్ బస్సు దిగబడిపోయారు. సుమారు నాలుగు ఐదు గంటలు బస్సు రోడ్డుపై ఉండటం వల్ల ట్రాఫిక్ సమస్య ఏర్పడింది.

# పశువులను తరలిస్తున్న వాహనం బోల్తా

- 13 గోవులు మృత్యువాత, 13 గోవులకు తీవ్ర గాయాలు
- 25 గోవులను గోశాలకు తరలించిన అధికారులు



పాలకుర్తి సెప్టెంబర్ 28 (జనం సాక్షి) : అక్రమంగా పశువులను తరలిస్తున్న పశువుల వాహనం బోల్తా పడడంతో 13 మూగ జీవులు మృత్యువాత పడిన ఘటన మండలంలోని వావిలాల గ్రామ శివారులో జరిగింది, సీఐ మహేందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.... భద్రాద్రి కొత్తగూడెం నుంచి డీసీఎం వాహనంలో 51 గోవులను హైదరాబాదుకు తరలిస్తున్నారు. శనివారం తెల్లవారుజామున జనగామ జిల్లా, పాలకుర్తి మండలం లోని వావిలాల గ్రామ మూలమలుపు వద్ద డీసీఎం వాహనం అదుపుతప్పి బోల్తా పడింది, దీంతో 13 గోవులు అక్కడికక్కడే మృతి చెందగా మరో 13 గోవులు తీవ్రంగా గాయపడ్డాయి. డీసీఎం వాహనం బోల్తా పడగానే అక్కడ నుండి డ్రైవర్ పరారయ్యాడు. పశు సంవర్ధక శాఖ సిబ్బంది ఘటనాస్థలికి చేరుకొని ప్రధమ చికిత్స చేశారు, మూగజీవాలను అక్రమంగా తరలించడమే కాకుండా ఒకే వాహనంలో 51 పశువులను ఎక్కించారని సిఐ తెలిపారు. మూగ జీవులను అక్రమంగా తరలించారని యానిమల్ ట్రాన్స్ ఫోరె న్ యాక్టు ప్రకారం వాహనదారులను డ్రైవర్ పై కేసు నమోదు చేసి వాహనం సీజ్ చేసినట్లు తెలిపారు. యజమానిపై చర్యలు చేపడతామని తెలిపారు, డీసీఎం బోల్తా పడడంతో బతికి ఉన్న పశు వులను మండల కేంద్రంలోని గోశాలకు తరలించారు.

**మూగజీవుల రోదన...**

డీసీఎం వ్యాను నుంచి బోల్తా పడ్డ మూగజీవులు రాత్రి నుండి తెల్లవారు వరకు వాహనంలోనే కిక్కిరిసి ఉండి మృతి చెందగా మరికొన్ని పశువులు కిందపడి చెల్లాచెదరయ్యాయి, నీరు దాన లేక అల్లాడిపోయాయి, బతికి ఉన్న పశువుల కాళ్లు విరిగి నడవలేకపోయాయి, డీసీఎం వాహనాల్లో కింద కొన్నింటిని ఎక్కించి మరికొన్ని దానిపైన చెక్కపరిచి యెక్కించారు, మొత్తం వాహనంలో 51 పశువులను ఎక్కించి కుక్కించారు, నిబంధనలకు విరుద్ధంగా మూగ జీవులను వాహనంలో కుక్కి వాటి ప్రాణాలు తీస్తున్నారని స్థానిక ప్రజలు ఆరోపించారు, అధికారుల తనిఖీలు లేకపోవడంతోనే దళారులు ఇష్ట రాజ్యంగా వ్యవహరిస్తున్నారు, సాధారణంగా పశు వులను తరలించాలంటే ఏ సంతలో కొనుగోలు చేసిన కొనుగోలు చేసిన ధ్రువపత్రం ఉండాలి, పశు వైద్యుల ధ్రువీకరణ తో పాటు ఒక వాహనంలో ఆరు పశువులను మాత్రమే తరలించాలి. వీటికి నీరు, దాన ఏర్పాటు చేయాలి. మూడు కిలోమీటర్లు ఒకసారి విశ్రాంతి ఇవ్వాలి. గడ్డితో పాటు కాపలాదారు ఎప్పుడు సిద్ధంగా ఉండాలి. వీటి ఆరోగ్య పరిస్థితి వైద్యుని ధ్రువీకరణ ఎక్కడికి రవాణా చేస్తున్నారో వివరంగా చెప్పాలి. కానీ నిబంధనలు ఎక్కడ అమలు కావడం లేదన్నది నగ్నసత్యం అంటున్నారు.

## ట్రిపుల్ ఐటీ లో సీటు సాధించే దిశగా విద్యాబోధన చేయాలి



కామారెడ్డి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 28 (జనం సాక్షి): ట్రిపుల్ ఐటీల్లో సీటు సాధించే దిశగా విద్యార్థులకు విద్యా బోధన చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. శనివారం బిక్నూర్ కే.జి.బి.వి. పాఠశాలను కలెక్టర్ తనిఖీ చేశారు. విద్యార్థులకు అందుతున్న భోజన, వసతి సౌకర్యాలు, విద్యా బోధన తదితర అంశాలకు సంబంధించిన వివరాలను ప్రత్యేక అధికారిణి హరిప్రియ ను అడిగి తెలుసుకున్నారు. వంటశాల, స్టోర్ రూం లను పరిశీలించి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని అన్నారు. ట్రిపుల్ ఐటీ లో అడ్మిషన్ పొందేవిధంగా మంచి ర్యాంకులు సంపాదించాలని అన్నారు. హాజరు రిజిస్టర్ లో టీచర్లు, మిగతా స్టాఫ్, ఆరోగ్య సిబ్బంది, వంట సిబ్బంది ప్రతి రోజూ సంతకాలు చేయాలనీ, స్పెషల్ ఆఫీసర్ రిజిస్టర్లను పరిశీలించాలని అన్నారు. అనంతరం తరగతి గదులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ రంగనాథ్ రావు, జిల్లా ఎస్సీ సంక్షేమ అధికారిని రజిత, జిల్లా విద్యాశాఖ అధికారి రాజు, జిల్లా పరిషత్ సి.ఈ. ఒ.చందర్ నాయక్, పంచాయతీ రాజ్ ఈ ఈ దుర్గ ప్రసాద్, డిప్యూటీ ఈ ఈ స్వామి దాస్, జిల్లా పశు సంవర్ధక అధికారి రాజేశ్వర్, అధ్యాపకులు,పాల్గొన్నారు.

# ఎన్నికలు ఏవైనా ఎగరాల్సింది కాంగ్రెస్ జెండానే..

- వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య



పరకాల సెప్టెంబర్ 28 (జనం సాక్షి): రాష్ట్రంలో ఎన్నికలు ఏవైనా ఎగరాల్సింది కాంగ్రెస్ జెండా మాత్రమేనని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య గారు పిలుపునిచ్చారు. పరకాలలోని లలిత కన్వెన్షన్ హాలో నిర్వహించిన పరకాల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమీక్షా సమావేశానికి ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి గారితో కలిసి వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య గారు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ గారు మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో ప్రతీ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ జెండానే ఎగరాలని పిలుపునిచ్చారు. పార్లమెంట్ ఎన్నికలలో నిండు మనసుతో ఆశీర్వదించిన ప్రతీ కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పటి వరకు జరిగినవి సెమీ ఫైనల్స్ మాత్రమేనని.... ఇప్పుడు జరగబోయే ఎన్నికలే ఫైనల్స్ అని అన్నారు. ఆ ఫైనల్స్ లో గెలవాల్సింది కాంగ్రెస్ పార్టీయే అని అందుకు ప్రతీ ఒక్క కార్యకర్త కాంగ్రెస్ పార్టీ గెలుపుకు కృషి చేయాలని తెలిపారు. పార్టీలో కష్టపడి పని చేసే వారికే అవకాశాలు దక్కుతాయని అన్నారు. రాహుల్ గాంధీ గారిని ప్రధాన మంత్రి చేసే వరకు ప్రతీ కార్యకర్త విశ్రమించకుండా కృషి చేయాలని కోరారు. త్వరలోనే కుల గణన జరగనుందని, జనాభా ప్రాతిపదికనే రిజర్వేషన్లు అమలు జరుగుతుందని వెల్లడించారు. పరకాల నియోజకవర్గ అభివృద్ధికి నా వంతు పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కూడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, టిపిసిసి ఉపాధ్యక్షులు దొమ్మాటి సాంబయ్య, వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, ప్రతినిధులు, పాల్గొన్నారు.

# విద్యుద్ఘాతంతో కాడెద్దులు మృతి

- జీవనాధారం కోల్పోయిన కౌలు రైతు
- కుటుంబమంతా కన్నీటి పర్యంతం



మరిపెడ సెప్టెంబర్ 28 (జనం సాక్షి) : విద్యుద్ఘాతంలో కాడెద్దులు మృతి చెందిన సంఘటన మరిపెడ మండలం మూలమర్రితండ గ్రామ పంచాయతీ శివారు వ్యవసాయ క్షేత్రంలో శనివారం చోటు చేసుకుంది. బాధిత కౌలు రైతు భూక్య బిచ్చ కథనం ప్రకారం... మూలమర్రితండాకు చెందిన కౌలు రైతు భూక్య బిచ్చ వ్యవసాయ పనుల నిమిత్తం తన కాడెద్దులను తొలుకుని వెలుతున్నాడు. ఈ క్రమంలో వ్యవసాయ క్షేత్రాల డొంకదారికి ఆనుకొని ఉన్న విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ ఎర్త్ తీగకుఎద్దులు తగిలాయి. దీంతో విద్యుత్ షాక్కు గురైన కాడెద్దులు అక్కడి అక్కడే మృతి చెందాయి. మృతి చెందిన కాడెద్దుల విలువ రూ. 1.60 లక్షలు ఉంటుందని, వ్యవసాయం చేసే అదును సమయంలో ఎద్దులను కోల్పోవడం జీవనాధారం లేకుండా పోయిందని తమకు కొండంత అండగా వ్యవసాయంలో తోడుండే కాడెద్దులు మృతితో కౌలు రైతు దంపతులు బిచ్చ, లింగమ్మ బోరున విలపించారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత కౌలు రైతు దంపతులు వేడుకున్నారు.



## పోటీ పరీక్షలకు పుస్తకాలు వితరణ

కామారెడ్డి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 28 (జనం సాక్షి) : ప్రభుత్వ డిగ్రీ కళాశాల కామారెడ్డిలో డాక్టర్ బి.ఎన్.రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రంథాలయానికి పోటీ పరీక్షల పుస్తకాలను శుక్రవారం అందజేశారు. గ్రామీణ పేద విద్యార్థులు పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలను స్వయంగా కొనుగోలు చేయలేక ఉద్యోగాలకు దూరమవుతున్నారని విషయాన్ని గుర్తించి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు అందుబాటులో ఉండే విధంగా 14 రకాల పుస్తకాల సెట్లను లైబ్రరీకి అందించారు ఈ సందర్భంగా ముఖ్య అతిథి డిఎన్ రావు మాట్లాడుతూ యువతనిరుద్యోగ సమస్యను అధిగమించే విధంగా సిద్ధం కావాలని కోరారు.. కళాశాల ప్రిన్సిపాల్ విజయ్ కుమార్ మాట్లాడుతూ ఈ పుస్తకాలను సద్వినియోగం చేసుకొని ఉద్యోగాలను సాధించే విధంగా సిద్ధం కావాలని కోరారు కళాశాలలో కెరీర్ గైడెన్స్ పోటీపరీక్షల విభాగం నిరంతరం ఉద్యోగాలు కొరకు చేపట్టే కార్యక్రమాలను సంపూర్ణంగా వినియోగించుకోవాలని రాజగంబ్రరావు కోరారు ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కిష్టయ్య, లైబ్రరీ అధిపతి లక్ష్మణాచారి, డాక్టర్ శ్రీనివాసరావు,జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# నేడు పిఎల్ఆర్ కోసం సమావేశం!

(ప్రత్యేక ప్రతినిధి / జనంసాక్షి)

పెర్ఫార్మెన్స్ లింక్డ్ బోనస్, (పిఎల్ఆర్ ) దీపావళి బోనస్, సంబంధించిన సమావేశం 29న కోల్ ఇండియా లిమిటెడ్ (సీఐఎల్) యాజమాన్యం న్యూఢిల్లీ లోధి రోడ్ స్టాండర్డైజేషన్ కమిటీ సమావేశం ఏర్పాటు చేసారు. బొగ్గు గని కార్మికులు స్టాండర్డైజేషన్ కమిటీ నిర్ణయానికి ఎదురుచూస్తున్నారు సమావేశానికి సింగరేణి పరిశ్రమ నుండి బిఎంఎస్ తరపున యాదగిరి సత్తయ్య అధ్యక్షులు, స్టాండర్డ్ డైజేషన్ కమిటీ సభ్యులు, సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ బిఎంఎస్ పాల్గొంటున్నట్లు తెలిపారు. బొగ్గు గని కార్మికులు ఆర్థికంగా ఆశాజనకంగా ఉండే విధంగా కృషి చేస్తామని తెలిపారు. గత సంవత్సరం 2023 ఆర్థిక సంవత్సరం రూ.85,500 కోల్ ఇండియా యాజమాన్యం చెల్లించింది. ఈ సంవత్సరం 37వేల కోట్ల రూపాయలు లాభాలను ఆర్జించింది. ఈ సమావేశంలో పాల్గొనేందుకు సంబంధిత అధికారులు, జాతీయ కార్మిక సంఘాలు బిఎమ్ఎస్ ,హెచ్ఎమ్ఎస్, ఏఐటీయూసీ, సీఐటీయూ నేతలు న్యూఢిల్లీకి బయలుదేరి వెళ్లారు, స్టాండర్డైజేషన్ కమిటీ సమావేశం సెప్టెంబర్ 29న మధ్యాహ్నం 3 గంటలకు జరగనుంది,దీనికి ముందు సమావేశానికి హాజరయ్యే నాలుగు యూనియన్ల నాయకులు బోనస్ ఎంత అనే విషయంలో,చర్చించుకుని యాజమాన్యం ముందు ప్రతిపాదిస్తారని,యాజమాన్యంతో సమావేశానికి ముందు,యూనియన్ నాయకులు చర్చించుకుని బొగ్గు గని కార్మికులు పనితీరు లింక్డ్ రివార్డ్‌గా గౌరవప్రదమైన మొత్తాన్ని పొందేలా భారతీయ మజ్దూర్ సంఘ్ కృషి చేస్తుందని, కోల్ ఇండియా 2023-24లో రూ.37 వేల కోట్లకు పైగా లాభం ఆర్జించిందని, యాజమాన్యంతో చర్చించి బొగ్గు గని కార్మికులకు ఆర్థికముగా ఆశాజనకమైన ఆర్థిక ప్రయోజనాన్ని బుక్కు గని కార్మికులకు అందిస్తామని తెలిపినారు,కాంట్రాక్టు కార్మికులకు కనీసం ఒక నెల ఎక్స్‌గ్రేషియా అందించేలా చొరవ తీసుకుంటున్నామని తెలిపారు. ఇందుకోసం సీఐఎల్ మేనేజ్ మెంట్ పై ఒత్తిడి పెంచేందుకు కృషి చేస్తామని, బోనస్ చట్టం సాకుతో మేనేజ్‌మెంట్ తప్పించుకోవడానికి, ప్రయత్నం చేస్తున్నదని, కాంట్రాక్టు కార్మికులకు ఎక్స్‌గ్రేషియా బోనస్ రూపంలో చర్చిస్తామని తెలిపారు. 2023లో బొగ్గు గని కార్మికులు రూ.85,500 బోనస్‌గా పొందినారని 2023-24 ఆర్థిక సంవత్సరంలో కోల్ ఇండియా రూ.37,369 కోట్ల లాభాన్ని ఆర్జించిందని, బొగ్గు గని కార్మికులకు ఆర్థికముగా ప్రయోజనం చేకూర్చే విధంగా బిఎంఎస్ కృషి చేస్తుందని తెలిపారు.

# జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ ఫుల్

- మరిన్ని యార్డుల కోసం జిహెచ్ఎంసి అన్వేషణ
- నగరం చుట్టుపక్కల పలు భూముల గుర్తింపు



హైదరాబాద్, సెప్టెంబర్ 28 (జనంసాక్షి) : హైదరాబాద్ ప్రజలు ఊడ్చి పడేసిన చెత్తతో జవహర్ నగర్ డంపింగ్ యార్డు నిండిపోయింది. ఇప్పటికే కిలోమీర్ల పరిధిలో కంపు కోడుతోంది. ఈ క్రమంలో మరిన్ని డంపింగ్ యార్డుల అవసరం ఏర్పడింది. దీంతో మహానగరం చుట్టూ డంపింగ్ యార్డులు ఏర్పాటు చేసేందుకు జీహెచ్ఎంసీ కసరత్తు చేస్తోంది. జవహర్‌నగర్ డంపింగ్ యార్డుపై వ్యర్థాల భారం తగ్గించేలా ప్రత్యామ్నాయ స్థలాలను గుర్తించారు. ఆ భూములను బల్దియాకు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని రంగారెడ్డి, సంగారెడ్డి కలెక్టర్లకు కమిషనర్ ఆమ్రపాలి లేఖ రాశారు. ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని లేఖలో కోరారు. ప్యారానగర్‌తో పాటు రంగారెడ్డి జిల్లా తలకొండపల్లిలోని ఖానాపూర్, సంగారెడ్డి పటాన్‌చెరు మండలంలోని లక్డారం, దుండిగల్, చౌటుప్పల్‌లోని మల్కాపూర్ ప్రాంతాల్లో భూములను డంపింగ్ యార్డు ఏర్పాటుకు గుర్తించారు. పరిసర ప్రాంతాల ప్రజలకు దుర్వాసన రాకుండా, పర్యావరణంపై ప్రభావం పడకుండా అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో వ్యర్థాల పునర్వినియోగం, నిర్వహణ చేపడతామని అధికారులు చెబుతున్నారు. ఇందులో భాగంగా తడి చెత్త నుంచి బయో గ్యాస్, సేంద్రియ ఎరువులు, పొడి చెత్త నుంచి విద్యుదుత్పత్తికి ఏర్పాట్లు చేయనున్నారు. ప్యారానగర్‌లోని 152 ఎకరాల స్థలాన్ని డంపింగ్ యార్డు కోసం గతంలో గుర్తించారు. రహదారి, ఇతరత్రా నిర్మాణ పనులూ ప్రారంభించారు. స్థానికులు అడ్డుకోవడంతో తాత్కాలికంగా బ్రేక్ పడింది. ఇక్కడ 15 మెగావాట్ల సామర్థ్యంతో చెత్త నుంచి విద్యుదుత్పత్తి చేసే ప్లాంట్‌ను నిర్మించాలని భావిస్తున్నారు. రోజూ 270 టన్నుల తడి చెత్తతో బయోగ్యాస్ ఉత్పత్తికి ఏర్పాటుచేయనున్నారు. చెత్తనూ భూగర్భంలోని బంకర్‌లో వేసి తడి, పొడి చెత్తగా వేరు చేస్తామని అధికారులు చెబుతున్నారు. కాగా, ప్రస్తుతం నగరంలో రోజూ 7,500 మెట్రిక్ టన్నుల చెత్త వెలువడుతోంది. ప్రస్తుతం జవహర్‌నగర్‌లో లక్ష టన్నులకుపైగా టన్నుల వ్యర్థాల తడి, పొడి చెత్త కుప్పలు ఉన్నాయి.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370